
ఆంధ్ర ప్రదేశ్

మే, 1975 వెల: 50 పైసలు



ఆంధ్రకేసరి కథ


గాంధీజీ ఆదేశానుసారం భారత దేశంలో ఖాదీ ఉద్యమం, భారీ ఎత్తున సాగింది. దేశం మొత్తం మీద ఆంధ్రరాష్ట్రం ఈ కార్యక్రమంలో మొదటిదిగా నిలిచింది మన ప్రకాశం ఆధ్వర్యాన.
దేశంలో ఏ ప్రాంతంలో జాతీయ వాదులమీద బ్రిటీష్ ప్రభుత్వానికి సంఘర్షణగా జరిగినా స్వంత ఖర్చు మీద ఆ ప్రదేశానికి ప్రకాశం వెళ్ళి పరిశీలించి స్వరాజ్య పత్రికలో వ్రాసేవాడు.
ఆంధ్రులకన్న వేమదేశీ రాము దండుకు ప్రకాశం భాగస్వామి యాచేరాడు
ఈ కార్యక్రమానికి కావలసిన ధన సహాయం నేను చేస్తాను.
1922లో నాగపూర్ జెండా సత్యాగ్రహం జరిగినప్పుడు జైలుకి వెళ్ళడానికి త్యాగులైన వీరులు కావలసి వచ్చింది. మన ప్రకాశం అక్కడికి వెళ్ళాడు
ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షునిగా, నేను నేనుగా, ఎంతమంది సత్యాగ్రహులనైనా పంపిస్తాను.
1926లో బర్మా మలయా దేశాలలో ప్రకాశం పర్యటించాడు అక్కడ ఉన్న భారతీయుల కష్టసుఖాలను స్వయంగా పరిశీలించడానికి
40వ కాంగ్రెస్ మహాసభలో కేంద్రరాష్ట్ర శాసనసభలను కాంగ్రెసు వారు ఆక్రమించెయ్య వచ్చునని తీర్మానించారు. 1926లో జరిగిన శాసనసభ ఎన్నికలలో అపూర్వ విజయం ప్రకాశానికి లభించింది
ప్రకాశానికి జై! జై! జై!

ఆంధ్రప్రదేశ్

మే, 1975

సంపుటి : 19] వైశాఖ—జ్యేష్ఠ, 1897 [సంచిక : 7

ప్రధాన సంపాదకులు

శ్రీ రా ఖ్యం సిన్హా

సంపాదకులు

యస్. గోపాలకృష్ణమూర్తి

శ్రద్ధాంజలి

భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్, ఆంధ్రప్రదేశ్ మాజీ గవర్నరు, ప్రసిద్ధ ట్రేడ్‌యూనియన్ నాయకులు శ్రీ ఖండూభాయి దేశాయి కాలధర్మం చెందినందుకు "ఆంధ్రప్రదేశ్" గాఢ సంతాపం ప్రకటిస్తూ, వారిరువురికీ శ్రద్ధాంజలి ఘటిస్తోంది.

మొదటి కవరు పేజీ : ప్రపంచ తెలుగు మహాసభలను విజయవంతం చేసినందుకు ముఖ్యమంత్రిని రాష్ట్రపతి అభినందిస్తోన్న దృశ్యం

రెండవ, మూడవ కవరు పేజీలు : ప్రకాశం కథ (చిత్రాల్లో)

చివరి కవరు పేజీ : బారులు తీర్చిన కూజాలు

పాలు చందా : ఆరు రూపాయలు

వెల: 50 పైసలు

రిజిస్టరు నెం: హెచ్/హెచ్. డి. 81

ఈ సంచికలో...

పేజీ

2 వంశధారా—సుధాధారా! (కవిత)

3 తెలుగుజాతి పురా ప్రాభవం

5 తెలుగుజాతి వైభవం

7 విదేశాల్లో తెలుగువారు

10 తెలుగు సంస్కృతి ఔన్నత్యం

12 తెలుగు గడ్డమీద తెలుగు చలనచిత్ర పరిశ్రమ

15 ప్రభుత్వమూ—పేద వర్గాలూ

18 నగరంలో రాష్ట్రపతి

19 ప్రపంచ తెలుగు మహాసభలు

21 చిత్రాల్లో కొన్ని ముఖ్యాంశాలు

29 తెలుగు—అధికార భాష

32 మహాభారతము (సీరియల్)

34 తెలుగు లిపి పరిణామం

36 అఖిలభారత ఫొటోగ్రఫీ ప్రదర్శన

38 మన సేద్యపునీటి ప్రాజెక్టులు

43 రాష్ట్రంలో ఆయకట్టు అభివృద్ధి

44 వ్యావహారిక భాషా విజయం

46 జిల్లాల్లో...

48 ఊహాతీత యథార్థాలు

ఈ సంచికలోని రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి చెందినవిగా భావించ నక్కరలేదు.

వంశధారా—సుధాధారా...

వంశధారా—సుధాధారా
దీనజన జీవనాధారా . . వంశధారా

నీవు ప్రవహించేటి శ్రీకాకుళము ఆంధ్రలో మొదటిది
కరువు కాటక మందు కూడా శ్రీకాకుళమే మొదటిది
కడుపు మంటల కోర్వలేక నిత్యమూ ఒక ధారగా
వలస పోయేవారి వంశపు గౌరవం కాపాడగా రా ॥ వంశధారా ॥

నూటయాభై ఏళ్ల యోచన నేడు నిజమై నిలువగా
మాట వరసకు అయిన ఆకలి మంట వాడగుపించకుండా
పసిడి పంటలతోన భూములు పరవశించి నవ్వగా రా ॥ వంశధారా ॥

నీదు చల్లని కాలు తాకిన చాలు మా నాగేటి చాలుకు
ముత్యాలు పండిస్తాము ముచ్చట తీరగా ముమ్మాటు సాలుకు
కోట గోడలు దాటుకుని సిరి సాటివారల గుడిసె చేరగా రా ॥వంశధారా॥

కొట్టు మిట్టాడేము నిత్యము మెట్ట పైరులు పెట్టుకొంటూ
పండకను అల్లాడినాము నెత్తి నోరూ కొట్టుకొంటూ
బొంకు ఎరగని సాధు జనములలోన జంకును బాపగా రా
చింకి బతుకుల వారి మనసున బింకమును చేకూర్చగా రా ॥వంశధారా॥

—శ్రీ దత్తి ప్రసాదరావు



తెలుగుజాతి పురాప్రాభవం

శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్

[ప్రపంచ తెలుగు మహాసభలలో 1975 ఏప్రిల్ 18న రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్ చేసిన ప్రసంగంలోని కొన్ని భాగాలను యీ దిగువ ప్రచురిస్తున్నాం]

"చరిత్రకందని కాలం నుండి మన దేశ చరిత్ర, సంస్కృతులను రూపొందించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రముఖపాత్ర వహించింది. ఉత్తర, దక్షిణ ప్రాంతాల నాభి స్థానంలో ఉన్న మీరు అటు ఆర్యుల సంస్కృతి, ఇటు ద్రావిడుల సంస్కృతులలోని ఉత్తమ సంప్రదాయాలను సమ్మిళితం చేసుకున్నారు. నిజానికి మీరు గర్వించదగిన అపూర్వమైన మీ గత చరిత్రను గూర్చి నేను వివరించి చెప్పాల్సిన అవసరంలేదు. కృష్ణా, గోదావరి, తుంగభద్ర, మూసీ, మంజీరావంటి మహానదుల తీర ప్రాంతాలలో అనేక సామ్రాజ్యాలు ఉద్భవించి, అంతరించాయి. వాటిలో శాలివాహనులు, చాళుక్యులు, కాకతీయులు, విజయనగరరాజులు, కుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీ వంశపు రాజ్యాలు మీ ప్రజల లలితకళలు, శిల్పకళలు, భాష, సాహిత్యం, సాంస్కృతిక జీవితాలను ప్రభావితంచేసి, చెరగని ముద్రవేశాయి. అనేక మతాలు ఇక్కడ వర్ధిల్లినాయి. రాష్ట్రం అంతటా ఉన్న అందమైన కోటలు, దేవాలయాలు, మసీదులు, చైత్యాలు, విహారాలు, గురుద్వారాలు, చర్చిలు మీ మత సహనాన్నీ, సమ్యక్‌దృష్టినీ అద్దంపట్టి చూపుతాయి. మీ రాజధానీ నగరమైన హైదరాబాదు వైభవోపేతమైన మీ సంప్రదాయాలకు దర్పణంగా నిలుస్తుంది. వివిధ భాషలవారు, విశ్వాసాలవారు వివిధ సంప్రదాయాలుగలవారు ఇక్కడ సమైక్యతతో ప్రశాంత జీవితం గడుపుతున్నారు. సుదూర ప్రాంతాలకు మీ సంస్కృతిని విస్తరింపజేయడంలోనేగాక ప్రజలు సంతృప్తితో సౌభాగ్యవంతమైన జీవితాన్ని గడపడానికి అనువైన పరిపాలనా విధానాలను రూపొందించడంలోకూడా చరిత్రాత్మకమైన సమయాలలో మీరు చిరస్మరణీయమైన మహోన్నత పాత్ర వహించారు. దేశంలోని యీ ప్రాంతంలో వివిధ మతాలు, భాషలుగల ప్రజలు సమైక్యతతో జీవించడానికి సంప్రదాయ, సంస్కృతుల సమ్మేళనం ఎంతగానో దోహదం చేసింది.

సాంఘిక న్యాయం

ఆధునిక యుగంలోకూడ మీ సంఘ సంస్కర్తలు, మత ప్రముఖులు తమ రచనలద్వారా, ప్రబోధాలద్వారా సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా నిరంతరం ఉద్యమాలను నిర్వహించి అన్ని మతాల ప్రజల సాంఘిక న్యాయానికి మౌలికమైన సమైకతనుగూర్చి నొక్కి చెప్పారు. చరిత్రాత్మకమైన స్వాతంత్ర్య సమరంలో ఆంధ్రులు గౌరవప్రదమైన ప్రత్యేకమైవ పాత్ర నిర్వహించి, గమనార్హమైన త్యాగాలు చేశారు. గర్వకారణమైన ఈ చరిత్ర అంతా మీ భాషలోను, సాహిత్యంలోను, లలితకళలలోను ప్రస్ఫుటమైంది. సాంఘిక న్యాయం, కళాత్మకదృష్టిని సమ్మిళితపరచి వివిధ రూపాలలో ప్రబోధించడానికి వీలుగా మరింత పటిష్ఠం చేసే బాధ్యత తెలుగుభాష, సాహిత్య ప్రియులపై ఉంది.

మహోన్నతమైన మీ సంస్కృతికి, వారసత్వానికి మీరు గర్వపడడం సహజమే ఐనప్పటికీ మీ సాహిత్యం, సంస్కృతి చైతన్య ప్రవంతిగా ప్రవహించడానికి మారుతున్నకాలానికి అనుగుణంగా కొత్త పద్ధతులను కొత్త రూపాలను సంతరించుకోవాల్సిన అవసరం ఉంది. సాహిత్యం చాలా శక్తివంతమైన సాధనం. అది మన గతకాలవైభవాన్ని చాటిచెప్పడమే కాకుండా ప్రస్తుత కాలపు ఆశలను ఆశయాలను కూడా ప్రతిబింబింప చేయాలి. మౌలికంగా ప్రపంచమంతటా ప్రజల భావోద్రేకాలు ఒకేవిధంగా ఉంటాయి. భాషద్వారా సమగ్ర మానవత్వాన్ని చదువరులకు చవిచూపేది సాహిత్యం ఒక్కటే. అందువల్ల మీ గత వైభవానికి మీరు ఎంత గర్వ పడినప్పటికీ, అన్ని ప్రాంతాలనుండి, అన్ని వైపుల నుండి వచ్చే వినూత్న భావాలను స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను. విశాల దృక్పథం ఉన్నప్పుడే భాష అభివృద్ధి చెందుతుంది. చలనం ఉన్నప్పుడే పటిష్ఠత కలుగుతుంది. దానిని గ్రహించి యిముడ్చుకునే శక్తిఉంటే అది మరింత వికసిస్తుంది.

కొత్త జాగృతి

విశాలమైన భారత దేశంలో అనేక వైవిధ్యాలు, జాతులు, మతాలు, కులాలు, వర్ణాలు ఉండడంలో ఆశ్చర్యమేమీ లేదు. అయితే అవి మన అభివృద్ధికి ప్రతిబంధకాలు కాకూడదు. అంతేగాక అవి మన సమైక్యతను పటిష్ఠంచేయాలి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భాష, సాహిత్యం, లలిత కళలు కొత్తజీవం పోసుకున్నాయి. వాటిలో కొత్త జాగృతి వచ్చింది. అన్ని భాషలు వాటి మార్గంలో అవి వికాసం చెందడానికి ప్రభుత్వం అన్నివిధాల ప్రోత్సహిస్తున్నది.

మన దేశంలోని ప్రముఖ భాషలలో తెలుగు ఒకటి. తెలుగువారు అనేక రాష్ట్రాలలోను, దేశాలలోను వ్యాపించిఉన్నారు. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలలో లక్షలాది తెలుగువారు నివసిస్తున్నారు. వారంతా ఆ యా రాష్ట్ర ప్రజలలో కలిసిమెలిసి జీవిస్తున్నారని తెలిసి నాకు చాలా సంతోషం కలిగింది. ప్రశాంత పరిస్థితులలోనే భాష, సాహిత్యం అభివృద్ధి చెందగలుగుతాయి.

నేడు మనం శాస్త్ర విజ్ఞాన యుగంలో ఉంటున్నాము. కమ్యూనికేషన్స్ రంగంలో కొత్తకొత్త సాధనాలు రావడంతో దేశాలమధ్య దూరాలు తగ్గిపోయాయి. మానవాళి పరస్పరం సన్నిహితులవుతున్నారు. ఇటువంటి పరిస్థితులలో ఏ భాష, ఏ దేశం అందరికీ దూరంగా ఉండలేదు. మన భాషలు శాస్త్ర విజ్ఞాన పురోభివృద్ధిని మారు మూల గ్రామాలకు విస్తరింపజేయాలి. కేవలం భావ ప్రకటనకు, కవిత్వానికి పరిమితమైఉండి, సంతృప్తి చెందలేవు. సాంఘిక చైతన్యం, స్తబ్దతగా ఉన్న జాతిని అభ్యుదయగామిగా మార్చడానికి శక్తివంతమైన సాధనాలుగా రూపొందాలి. ఇలా చేయడానికి మన భాషలలో కొన్ని మార్పులు రావాల్సి ఉన్నాయి. అవి కొత్తకొత్త పదాలను స్వీకరించాలి. భావ ప్రకటనలో వినూత్నపద్ధతులను, కొత్త మార్గాలను పెంపొందించుకోవాలి. సాహిత్యం యొక్క ప్రయోజనం వినోదం కలిగించడం, పునరుజ్జీవింప చేయడమేగాక ప్రజలలో మహోన్నత భావాలను రేకెత్తింప జేయాలి. నేడు రచయితలు ప్రముఖపాత్ర నిర్వహించాల్సి ఉంది. ఎందుకంటే వారు తమ రచనల ద్వారా ప్రజల ఆలోచనా సరళిని తీర్చిదిద్దడమే గాక జాతి భవిష్యత్తును నిర్దేశించగలుగుతారు. తమ ప్రయోజనాత్మకమైన రచనల ద్వారా ప్రజల వద్దకు వెళ్లి వారి జీవన విధానాలను మెరుగుపరచే ప్రయత్నాలలో వారినే క్రియాత్మక భాగస్వాములుగా చేయడమే మన ప్రధాన బాధ్యత అని నేను భావిస్తున్నాను.

దేశం నేడు గడ్డు పరిస్థితులలో ఉంది. ఇంటా, బయటా అనేక సవాళ్లను ఎదుర్కొన్నది. విచ్ఛిన్నకర శక్తులను ఎదుర్కొంటున్నది. ఈ విచ్ఛిన్నకర శక్తులను ఎదుర్కొని, ప్రజలలో జాతీయ సమైక్యతాభావాన్ని పెంపొందించాలి. విజ్ఞాన ఖనులైన మీరు మనం కలలుకన్న భారతదేశాన్ని నిర్మించడంలో మీ పాత్ర మీరు వహిస్తారని నా విశ్వాసం. మీరు ఎక్కడ ఉన్నా మీ పురోగతి, సమృద్ధి, జాతి అభివృద్ధితో ముడిపడి ఉందనే విషయాన్ని జ్ఞాపకం ఉంచుకోవాలి. "



మాజీ గవర్నరు శ్రీ ఖండూభాయి దేశాయి అస్తమయం

ఆంధ్రప్రదేశ్ మాజీగవర్నరు, ప్రముఖ ట్రేడ్‌యూనియన్ నాయకులు శ్రీ ఖండూభాయి దేశాయి దక్షిణ గుజరాతుప్రాంతమైన బల్సార్‌లో 1898 వ సంవత్సరం అక్టోబరు 23న జన్మించారు. విద్యార్థి దశలోనే మహాత్మాగాంధీ పిలుపు అందుకొని "సహాయ నిరాకరణోద్యమం"లో చేరి కళాశాలను బహిష్కరించారు. తరువాత గుజరాత్ విద్యాపీఠం నుండి పట్టాపొంది కొంతకాలం బొంబాయిలోని ఒక జాతీయ పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పని చేశారు.

భారత జాతీయ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ స్థాపించడంలో శ్రీ ఖండూభాయిదేశాయి కీలకమైన పాత్ర వహించారు. ఈ సంస్థ అభివృద్ధి చెందటంకోసం ఎనలేని సేవ చేశారు.

1937 లో బొంబాయి శాసనసభకు ఎన్నికయ్యారు. పారిశ్రామిక తగాయిదాలను శాంతియుతంగా పరిష్కరించడానికి దేశంలో మొట్టమొదటిసారిగా ఒక శాసనాన్ని రూపొందించడంలో ఎంతగానో సహాయపడ్డారు.

జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో కార్మిక శాఖ మంత్రిగా వుంటూ కార్మికుల శ్రేయస్సుకోసం దృఢమైన చర్యలను తీసుకొన్నారు.

1968లో ఆంధ్రప్రదేశ్ గవర్నరుగా నియమితులయ్యారు. 1973 జనవరి 18 నుండి కొంత కాలంపాటు రాష్ట్రపతి తరఫున గవర్నరుగా రాష్ట్ర పరిపాలనా బాధ్యతలను నిర్వహించారు.

1975 ఏప్రిల్ 17వ తేదీన యీయన మరణంతో దేశం ఒక ప్రముఖ నాయకుణ్ణి కోల్పోయింది.

తెలుగుజాతి వైభవం

శ్రీ జలగం వెంగళరావు



[ప్రపంచ తెలుగు మహాసభలో ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు చేసిన ప్రసంగంలోని కొన్నిభాగాలను యీ దిగువ ప్రచురిస్తున్నాం.]

ఏటేటా ఉగాది వస్తుంది. కాని ఈ యేడు వచ్చిన ఉగాదికి ఒక ప్రత్యేకత ఉన్నది. తెలుగుదేశ చరిత్రలో కనీ వినీ యెరుగని రీతిని మనం హైదరాబాదులోని కాకతీయనగరంలో నేటి నుండి వారం రోజులపాటు ప్రపంచ తెలుగు మహాసభలు జరుపుకుంటున్నాం. ఈ సభలకు మన ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుంచీ, భారత దేశంలోని పలు ప్రాంతాలనుంచేగాక, ప్రపంచంలోని వివిధ దేశాలనుంచీ ప్రతినిధులు వచ్చారు. తెలుగువారే గాక, తెలుగు భాషపైన ఆదరాభిమానాలుగల విదేశీయులు కూడా రావడం ఈ సభలకు మరింత శోభను చేకూర్చింది. ఈ ఉగాది తెలుగువారికే గాదు, మన కన్నడ సోదరులు కూడా ఈనాడు ఉగాది పండుగ జరుపుకుంటున్నారు. పశ్చిమ చాళుక్యులు కన్నడమును తమ అధికార భాషగా చేసుకుంటే తూర్పు చాళుక్యులు తెలుగును అధికార భాషగా చేసుకున్నారు. కన్నడము, తెలుగు అక్కా చెల్లెళ్ళ వంటివి. రెండు భాషల లిపి ఎంత సన్నిహితంగా ఉంటుందో మీకు తెలియనిది కాదు విజయనగరాధీశ్వరులైన శ్రీకృష్ణదేవ రాయలవారు ఉభయ భాషలను ఆదరించారు. తూర్పు చాళుక్య రాజైన రాజరాజనరేంద్రుని ఆస్థానంలో ఎందరో కన్నడ కవులు ఉండేవారు. ఇదంతా ఎందుకు చెబుతున్నాను అంటే—మన పొరుగు రాష్ట్రమైన కర్ణాటకానికీ మనకూ కొన్ని శతాబ్దాల భాషా, సాంస్కృతిక సంబంధాలున్నాయి. తెలుగే కన్నడమూ, కన్నడమే తెలుగా అన్నంతగా అవి కలగలిసిపోయాయి.

భారత స్వాతంత్ర్య పోరాటంలో ఆఖరు ఘట్టమైన హైదరాబాదు సంస్థాన విముక్తి పోరాటంనాడు కృత్రిమమైన రాష్ట్రాల సరిహద్దులు యేనాటికైనా తొలగిపోయి భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడాలని మేం కలలు కన్నాం. ఆ కలలు నిజమై, తెలుగు మాట్లాడే వారందరితో ఒక రాష్ట్రం—ఆంధ్రప్రదేశ్‌గా అవతరించింది. ఈ సమైక్యతకు భంగం కలిగే సంఘటనలు కొన్ని జరిగినా, అవన్నీ క్రమంగా తొలగిపోయి మనం నేడు సంఘటితంగా వున్నాం. ఈ ఐక్యతను కాపాడుకోడానికే ఈ మహాసభలు తోడ్పడగలవని నేను విశ్వసిస్తున్నాను.

చరిత్రాత్మకమైన ఈ మహాసభలు మన తెలుగుజాతి ప్రాచీన వైభవాన్నీ, మన సంస్కృతినీ, సంప్రదాయాన్నీ సుమారు రెండు వేల అయిదువందల యేండ్ల మన నాగరికతనూ, మనం మరోసారి జ్ఞాపకం చేసుకోడానికీ, మన పూర్వులు మనకు ఇచ్చిన వారసత్వాన్ని అర్థం చేసుకోడానికీ తోడ్పడతాయి రమారమి అయిదు కోట్ల తెలుగువారిలో భావసమైక్యతను సాధించడానికి భాష ఎంతైనా తోడ్పడగలదనే దృఢ విశ్వాసం కలవాణ్ణి నేను. శాతవాహనుల నాటి తెలుగుకీ ఇప్పటి తెలుగుకీ పోలికేలేదు. మన భాషలో వచ్చిన, రానున్న పరిణామాలను గురించి భాషా శాస్త్రవేత్తలు ఈ వారం రోజుల్లో జరిగే సదస్సులలో చర్చిస్తారు.

శాతవాహనుల కాలంనుండి నేటివరకు తెలుగువారి చరిత్రలో గల గొప్ప గొప్ప విశేషాలను మన చిత్రకారులు ప్రత్యేకంగా

చిత్రించారు. మన చిత్రకారుల ప్రతిభను తెలుసుకోవడానికి కూడా ఈ ప్రదర్శన ఉపయోగపడుతుంది. దీనికి శాతవాహన, విజయనగర, కాకతీయ ద్వారాలు వున్నాయి. తెలుగు ప్రజల చరిత్రనీ, సంస్కృతినీ యివి కళ్ళకు కట్టినట్లు ప్రదర్శిస్తాయి. "తరతరాల తెలుగు జాతి వైభవం" అనే ప్రదర్శన అది. పుస్తక ప్రదర్శన, చేతిపనుల ప్రదర్శన, బాలల విభాగం. మహిళల విభాగం మొదలైనవి కూడా వున్నాయి.

ప్రపంచ తెలుగు మహాసభల లక్ష్యం ప్రపంచంలోని తెలుగు వారి ప్రతినిధుల నందరినీ ఒకరి అభిప్రాయాలు ఒకరు అర్థం చేసుకుని, స్నేహ సంబంధాలను పెంపొందించుకోవడం.

మన రాష్ట్రంలో తెలుగు భాషను తాలూకా స్థాయిలో పరిపాలనా భాషగా ప్రవేశపెట్టిన సంగతి మీకందరికీ తెలిసిందే. అంచెలంచెలుగా మన తెలుగు భాషను రాష్ట్ర స్థాయిలో ప్రవేశపెట్టడం జరుగుతుంది. బోధనా భాషగా తెలుగును ఉన్నత విద్యాస్థాయిలో ప్రవేశపెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. విజ్ఞాన శాస్త్ర గ్రంథాలను తెలుగులో అందించడానికి కృషి జరుగుతున్నది. సాంకేతిక పదజాలం ఆధునిక విజ్ఞాన బోధనకు కావాలి. అట్టి పదజాలాన్ని ఏర్పరచుకోడానికి పరిశోధనలు సాగుతున్నవి. మనకు స్వాతంత్ర్యం వచ్చి రమారమి 27 సంవత్సరాలైనా మాతృభాషలకు రావలసినంత ప్రాధాన్యం రాలేదు. ఆ ప్రాధాన్యం ఇవ్వాలన్నదే మా సంకల్పం.

1975 వ సంవత్సరాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంస్కృతిక సంవత్సరంగా పరిగణించింది. సంగీత, సాహిత్యాలు, నాటకం, నృత్యం, శిల్పం, చిత్రకళ, మన సంస్కృతికి పునాదులు. ఇవి తెలుగువారి భావసమైక్యతకు తోడ్పడగలవు. ఆధునిక కాలంలో ప్రజలమీద చలన చిత్రాల ప్రభావం యెంతగానో వుంది. మన సంస్కృతిలో ఒక భాగంగా చలన చిత్ర పరిశ్రమ స్థానం ఏర్పరచుకున్నది. ఈ ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతం చేయడానికి మన తెలుగు చలనచిత్ర రంగానికి సంబంధించిన కళాకారులు-నటీనటులు, సాంకేతిక నిపుణులు, దర్శకులు, నిర్మాతలు ప్రదర్శనల ద్వారా ఎంతో తోడ్పడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాజధానియైన హైదరాబాదు నగరం తెలుగు చలన చిత్ర పరిశ్రమకు ముఖ్య కేంద్రంగా రూపొందడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్వవిధాలా సహకరించగలదని హామీ ఇస్తున్నాను. ఇంకా కొత్త స్టూడియోలు నిర్మాణం కావాలి. ఎక్కువ సంఖ్యలో చిత్రాలు ఇక్కడ నిర్మించబడాలి.

ముఖ్యోద్దేశాలు

ప్రపంచంలోని వివిధదేశాలలో వున్న తెలుగువారు తమ మధ్య సాంస్కృతిక సంబంధాలను దృఢపరచుకోవడం, తెలుగు భాష, సాహిత్యం, కళలు మొదలగు వాటిలో అభివృద్ధిని సాధించడం, ఆధునిక అవసరాలకు తగినరీతిగా భాషను సంస్కరించుకోవడం—

తెలుగు ప్రజల జీవితానికీ, చరిత్రకీ, సాహిత్యానికీ సంబంధించిన గ్రంథాలను ప్రచురించడం—

తెలుగు భాషను అధ్యయనం చేయడానికీ, వివిధ రంగాలలో పరిశోధనలు జరుపుకోడానికీ సౌకర్యాలు కల్పించడం—

వివిధ ప్రాంతాలలోని రచయితలు, మేధావులు, కళాకారులు పరస్పరం సంబంధాలు ఏర్పరచుకోవడానికి తోడ్పడడం—ఈ సభల ముఖ్య ఉద్దేశాలు.

ఈ ఆశయాల సాధన కోసం జాతీయ, అంతర్జాతీయ పరిశోధకులకు తోడ్పడే అంతర్జాతీయ తెలుగు విజ్ఞాన సంస్థను నెలకొల్పడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిశ్చయించింది.

తెలుగుజాతి సమగ్ర స్వరూపాన్ని ప్రేక్షకులకు అవగతం చేయడానికి మ్యూజియం ఏర్పరుస్తున్నారు.

మన ప్రాచీన కళారూపాలైన బుర్రకథ, జముకుల కథ, జానపద గీతాలు, తోలుబొమ్మలాటలు, మున్నగువాటిని సజీవంగా వుంచడమేగాక వాటిని పునరుద్ధరించి అవి ఆధునిక జీవితానికి ఉపయోగపడేలా చేయవలసిన అవసరం కూడావుంది. చలనచిత్ర పరిశ్రమ మూడుపూవులు ఆరుకాయలుగా వర్ధిల్లవలసినదేగాని మన నాటక రంగం మటుమాయం కాకుండా చూడాలి.

మన ప్రభుత్వం వ్యవసాయ రంగంతో పాటు, పారిశ్రామిక రంగాన్నివృద్ధి జేయడానికి శాయశక్తులా కృషిచేస్తున్నది. మన తెలుగుదేశం అన్నపూర్ణ. కృష్ణా, గోదావరి, పెన్నానదులు కల జాతి. ఇదే మన భాగ్యం. ఆర్థిక సమస్యలను మనం క్రమంగా, కలిసికట్టుగా పరిష్కరించుకుందాం. మనం ఆశావాదులం. మనకు ప్రకృతి సంపద చాలావుంది. దాన్నంతటినీ సక్రమంగా వినియోగించుకోవాలి. సంకుచిత దృష్టి విడిచి విశాల దృష్టితో పురోగమించాలి. గతాన్నీ, వర్తమానాన్నీ, భవిష్యత్తునీ మనం మరచిపోరాదు. గతం లేనిదే వర్తమానం లేదు. వర్తమానం లేనిదే భవిష్యత్తులేదు.

హిందీ భాష మాట్లాడేవారి తరువాతి సంఖ్యలో భారతదేశంలో మనదే పెద్ద రాష్ట్రం. మన సంఖ్యాబలాన్ని ప్రదర్శించుకోడానికి కాదు మనం ఈ సభలు జరుపుకుంటున్నది. మన వ్యక్తిత్వాన్ని ప్రదర్శించడానికే మనం ఈ సభలు జరుపుకుంటున్నాం.

వైవిధ్యంలో ఏకత్వం సాధించడమే మన లక్ష్యం. మనను మనం అర్థం చేసుకున్ననాడు ఇతరులను మనం సరిగా తెలుసుకోగలం. మన రాష్ట్రాన్ని మనం సుసంపన్నం చేసుకోవడం ద్వారా భారతదేశాన్ని సుసంపన్నం చేయగలం. ఇవి తెలుగువారందరి సభలు. రాజకీయ, ప్రాంతీయ, విభేదాలు లేకుండా యావత్తు తెలుగుజాతి జరుపుకునే పండుగ ఇది. మనం అంతా ఒకటి అని ఒక్క గొంతుతో పలకడానికీ, హృదయాలలో సమైక్యతా బీజాలు నాటడానికీ ఏర్పరచిన ఉత్సవాలు ఇవి.

విదేశాల్లో తెలుగువారు



- శ్రీ పిడతల రంగారెడ్డి

అనాది నుంచీ తెలుగు వారు విదేశాలతో సంబంధాలు కలిగి వుంటూనే వున్నారు. తెలుగు సీమకు సుదీర్ఘమైన సముద్ర తీరం వుండడం వల్ల మొదటి నుంచీ విదేశాలతో సముద్ర మార్గంగా వర్తక వ్యాపారాలకు వీలయ్యింది. తెలుగు వారు స్వతహాగా సాహసులు కావడం వల్ల ప్రాణాలకు తెగించి చుట్టుపట్ల పొరుగు దేశాలతోనేకాక సుదూర ప్రాంతాల్లోని దేశాలతో కూడా భయంకర సముద్రాల మీదుగా ఓడల మీద వెళ్లి వ్యాపారం సాగించే వారు. శాతవాహనుల కాలంలో యీ విధమైన సముద్ర వ్యాపారాన్ని తెలుగువారు విశేషంగా జరిపేవారు. జావా, సుమిత్ర, బోర్నియో మొదలైన ద్వీపాలతో మరీ ఎక్కువ సంబంధాలు వుండేవి మనకు.

వర్తకం వల్లా, బౌద్ధమతం వల్లా భారత దేశానికి విదేశాలతో సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. బౌద్ధ మతానికి దక్షిణాదిన ఆంధ్రదేశం ఆనాడు కేంద్రంగా విలసిల్లిన కారణంగా బౌద్ధ సన్యాసులు. భిక్షుకులు, మొదలైనవారిలో తెలుగువారు కూడా విశేష సంఖ్యలోనే వున్నారు.

తెలుగువారు అధిక సంఖ్యలో నివాసం ఏర్పరచుకొన్న ఆనాటి దేశాల్లో ప్రత్యేకంగా సింహళం, బర్మా, మలేసియా, బలి, ఇండోనేషియా దేశాలను పేర్కొవచ్చు. మలేసియాకు తెలుగు వారు క్రీ. పూ. 3వ శతాబ్దిలోనే శాతవాహన చక్రవర్తుల కాలంలో బౌద్ధమత ప్రచారానికి వచ్చినట్టు మలేసియా చరిత్రలో వుంది. ఆ నాటి శాతవాహన రాజులు మలేసియా దేవాలయాన్ని నిర్మించారు. వాటి శిథిల శకలాలు నేటికీ బీడోర్, సుంగై, సిపుట్, ఈపో, లోయలలో దొరుకుతున్నాయి.

అదేవిధంగా బర్మాతో కూడా తెలుగు వారికి పురాతన కాలం నుంచీ కూడా సంబంధం వున్నట్టు ఆధారాలు వున్నాయి. వెయ్యి సంవత్సరాల క్రితం మధ్య బర్మా ప్రాంతంలో విషువు అనే నగరం వుండేది. అప్పటి లిపి తెలుగుకు దగ్గరగా వుంది. సింహళ దేశంతోనూ యిదేవిధంగా చిరకాల సంబంధాలు వున్నాయి. 13,14] శతాబ్దాలలో ఆర్య చక్రవర్తులు సింహళ దేశాన్ని పరిపాలించిన రోజుల్లో కాంచీ పురం నుండి, ఆంధ్రదేశం నుండి నేత పనివారిని రప్పించుకున్నారు. ఈ నాటికీ కూడా శ్రీ లంకలోని నేత పని వారు తెలుగే మాట్లాడుతారు.

బ్రతుకు తెరువుకై వలస

ఆంగ్లేయులు భారత దేశాన్ని పాలించిన రోజుల్లో బ్రిటిష్ వలస దేశాలకు తెలుగువారు చాలామంది ఉద్యోగ రీత్యా, వృత్తి రీత్యా వెళ్లి అక్కడే స్థిరపడిపోయారు. బ్రతుకుతెరువుకోసం బృందాలు బృందాలుగా వెళ్లిన వారే ఎక్కువ. తోటి వలస దేశాలకు వెళ్లడంలో అంతగా యిబ్బందులు లేకపోవడంవల్లా, ఆంగ్ల పాలకుల ప్రోత్సాహం వల్లా చెప్పుకోదగ్గ సంఖ్యలోనే తెలుగు వారు వలస వెళ్లిపోయారు. మారిషస్, ఫీజీ, దక్షిణాఫ్రికా మొదలైన దేశాలకు వెళ్లిన తెలుగువారు అలాటివారే.

బర్మాదేశంతో యిటీవలి కాలం వరకూ తెలుగువారు పెద్ద ఎత్తున వ్యాపారం చేస్తుండేవారు. కోనసీమ ప్రాంతంనుండి కొబ్బరి కురిడీ, కొబ్బరి పీచు, చేనేత వస్త్రాలు బర్మాకు తీసుకపోయి అక్కడినుండి బియ్యం, రబ్బరు తెచ్చి వ్యాపారం చేస్తుండేవారు. కోనసీమ ప్రాంతంలో చాలామంది వుండేవారు. 'రంగం' వ్యాపారం రెండో ప్రపంచ సంగ్రామం నాటివరకు విస్తారంగా జరుగుతుండేది. బ్రతుకు తెరువు కోసం కూడా చాలామంది ఉత్తర కోస్తా, కోనసీమ ప్రజలు బర్మాకు వలస వెళ్లిపోయారు. రంగమెళ్లిన బావమీద పాటలు కట్టి పాడుకోవడం తెలుగు వారికి అలవాటే. ఆలాగే అండమాను దీవిలో కూడా బ్రిటిష్ వారికాలంలో కోన సీమనుంచి వ్యాపారం జరుగుతుండేది. ఈ నాటికీ కూడా కొంతమంది ముసలివారు వెనకటి

సముద్రయాన సాహస యాత్రలను గురించి, అండమాను, రంగూన్‌లలో అనుభవాలను గురించి చిన్నపిల్లలకు కోనసీమ ప్రాంతాలలో చెప్తూ వుంటారు. కృష్ణా జిల్లాలోని మోటుపల్లి కూడా ఒకనాడు ప్రసిద్ధ ఓడరేవుగా విలసిల్లినది. అక్కడనుంచి తెలుగువారు సముద్రాంతర దేశాలతో పెద్దఎత్తున వ్యాపారం కొనసాగించేవారు.

వ్యవసాయ కూలీలుగా...

మారిషస్, ఫీజీ దీవుల్లోకి తెలుగువారు బ్రిటిషువారి కాలం లోనే అడుగుపెట్టారు. 1950 లో తెలుగువారిని కూలిపనికై బ్రిటిషువారు మారిషస్ దీవికి తీసుకెళ్లారు. మొదట్లో తెలుగు వారు చెరకు తోటల్లో కూలీలుగా వుండి మెల్లమెల్లగా స్వంత వ్యవసాయాన్ని ఏర్పరచుకున్నారు. చదువు సంధ్యలు అలవరచు. కుని ప్రభుత్వోద్యోగాలలో కూడా మంచి పదవులను అధిష్ఠించారు. ఫీజీదీవికి తెలుగువారు మొట్టమొదట అడుగుపెట్టినది 1918లో. వీరు సైతం ఆదిలో వ్యవసాయ కూలీలుగానే అడుగుపెట్టినా కాలక్రమేణా కొంతమంది భూములు సంపాదించుకుని స్వంతంగా సేద్యం చేసుకుంటూ డబ్బూ పలుకుబడీ సంపాదించి గౌరవంగా బ్రతుకుతున్నారు. దక్షిణాఫ్రికాకు వెళ్లిన తెలుగువారి విషయమూ యింతే.

శాస్త్రీయ, సాంకేతిక రంగాలలో కొన్ని దేశాలు సాధించిన అభి వృద్ధిని పురస్కరించుకుని, అక్కడ ఉన్నత విద్యాభ్యాసానికి వెళ్ళిన తెలుగువారు తమ విద్యాభ్యాసం కాగానే స్వదేశానికి తిరిగి వస్తున్నప్పటికీ అక్కడే ఉద్యోగాలలో స్థిరపడిపోయి ఆ యా దేశాల పౌరసత్వాలను స్వీకరించిన వారు కూడా బాగానే వున్నారు. ఇలా స్థిరపడి పోయినవారు ఎక్కువగా అమెరికా, ఇంగ్లండులలో వున్నారు.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం అమెరికాలో ఎక్కువ మంది డాక్టర్లు, ఇంజనీర్లు, సైంటిస్టులు వంటి శాస్త్ర, సాంకేతిక వేత్తల అవసరం, గిరాకీ పెరిగింది. అటువంటి పరి స్థితుల్లో కామన్వెల్తు దేశాలనుంచి వచ్చి చదువుకుని పట్టభద్రు లైన విద్యార్థులకు ఉద్యోగావకాశాలు విస్తృతమయ్యాయి. మంచి జీతాలు లభించడంవల్ల చాలామంది అక్కడే స్థిరపడి పోవాలను కున్నారు. అలావెళ్లిన భారతీయుల్లో తెలుగువారు కూడా ఎక్కువ గానే వున్నారు. ఆదేశాల్లోనేకా, యిప్పుడిప్పుడు అభివృద్ధి చెందు తున్న దేశాల్లో శాస్త్ర, సాంకేతిక వేత్తల అవసరం పెరిగింది. నైజీరియా, గినీ మొదలైన ప్రాంతాలకు యిప్పుడిప్పుడు చాలా మంది తెలుగు ఇంజనీర్లూ, డాక్టర్లూ వెళుతున్నారు.

సాంస్కృతిక రాయబారులు

వృత్తిరీత్యా వెళ్ళి స్థిరపడిపోయినవారూ, చదువుకోడానికి వెళ్ళినవారూ మరీ యిటీవలికాలంవారే గనుక యిక్కడి తెలుగు సీమ ఆచార వ్యవహారాలకు; సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ జీవితాలకు సంబంధించిన పరిజ్ఞానం, పూర్తి అవగాహన వీరికి పుష్కలంగా వుంది. ఇక్కడ వివిధ రంగాలలో వస్తోన్న విప్ల వాత్మకమైన మార్పులను ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ చూసి అనుభవించిన వారే గనుక యీ చైతన్య మయమైన, యీ నిర్మాణా త్మకమైన కృషిని గురించి విదేశాలలో ప్రచారం చేస్తున్నారు. ఒక విధంగా వీరు మన సాంస్కృతిక రాయబారులు. ఆయా ప్రాంతాలలో వున్న తెలుగువారిని సమీకరించుకుని, సంఘాలు స్థాపించుకుని సమిష్టిగా తెలుగుభాష, తెలుగు సంస్కృతి వికాసాలకు దోహదం చేస్తూ, తెలుగు పండుగలు, వేడుకలూ జరుపుకుంటూ తెలుగు వాతావరణాన్ని పరాయి సీమలో తమ యింటి ముంగిట నిలుపు కొంటూ తెలుగు జాతికి పరోక్షంగా సేవ చేస్తున్నారు.

తెలుగువారు ఎక్కడున్నా తమ భాషను, తమ గడ్డను, తమ సంస్కృతిని మర్చిపోకుండా వుండడం స్వదేశంలోని తెలుగు వారికి హర్షదాయకం. పరాయి ప్రాంతాల్లోని తెలుగువారి అవ సరాలను గుర్తించి, వాటిని తీర్చడం మనందరి కర్తవ్యం.

ప్రపంచ తెలుగు మహాసభల్లో

విదేశీ ప్రతినిధులకు అపూర్వ కానుకలు

ప్రపంచ తెలుగు మహా సభలకు వచ్చిన విదేశీ ప్రతినిధులకు తెలుగు గడ్డను, తెలుగు నదీ జలాలను చిన్న చిన్న సీసాలలో అపూర్వమైన కానుకలుగా అందజేశారు. మాతృ భూమిని సందర్శించి నందుకు గుర్తుగాను, ప్రపంచ తెలుగు మహా సభలకు హాజరైన జ్ఞాపక చిహ్నంగాను ఈ సీసాలను చిన్న పెట్టెలో చిరకాలం భద్ర పరచడానికి అనువుగా అమర్చారు.

తెలుగు గడ్డను ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల నుంచి సేకరించారు. తెలుగు నదీ జలాలను కృష్ణా - గోదావరి - తుంగభద్ర - శారద - వరాహ - మునేరు - స్వర్ణ - గుండ్లకమ్మ - మంజీర - కోటిపల్లివాగు - పెన్న - వంశధార - మూసీ - నాగావళి నదుల నుండి సమీకరించారు.

అపూర్వ కానుకలను ప్రపంచ తెలుగు మహా సభల కార్యనిర్వాహక అధ్యక్షులు శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు 106 మంది విదేశీ ప్రతినిధులకు అందజేశారు.



ప్రాచ్య దేశపు ప్రఖ్యాత తత్వవేత్త డా. రాధాకృష్ణన్ అస్తమయం

డా. రాధాకృష్ణన్ పండితుడు 1888వ సంవత్సరంలో సెప్టెంబరు 5న ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని తిరుత్తనిలో జన్మించారు. తిరుపతిలోని లూథరన్ మిషన్ ఉన్నత పాఠశాల, వెల్లూరులోని లార్హీ కళాశాల, మద్రాసు క్రైస్తవ కళాశాలల్లో చదివారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితంలో రెండు ప్రధానమైన దశలను పేర్కొనవచ్చు. ఆయన పండితుడుగాను, దేశసేవా దురంధరుడుగాను వినుతికెక్కారు. ఈ రెండు రంగాలలో ఆయన అపూర్వ విజయాలను సాధించారు. 27 సంవత్సరాల వయస్సు నిండక ముందే ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అనేక పత్రికలలో ఆయన వేదాంత సంబంధమైన అనేక వ్యాసాలు వ్రాసి ప్రకటించారు. "రవీంద్ర తత్వం" అనే వ్యాసం 1918 లో ప్రకటించిన తర్వాత ఆయనకు గొప్ప రచయితగా పేరు స్థిరపడిపోయింది. రెండేళ్ళ తర్వాత "సమకాలీన తత్వ శాస్త్రంలో మత ప్రాధాన్యం" అనే రచన ప్రకటించబడింది. దీనిలో బెర్గసన్, లీబ్ నిర్జ్, రసెల్, మొదలైన పాశ్చాత్య వేదాంత పండితుల దృక్పథాలను ఆయన పరిశీలించారు. ఇది ప్రాచ్య, పాశ్చాత్య దేశాలలో తాత్విక రంగంలోని ప్రముఖులలో పెద్ద సంచలనం కలిగించింది.

"భారతీయ వేదాంత దర్శనం" అనే గ్రంథంలో క్రీ. పూ. సుమారు మూడువేల సంవత్సరాల నుండి భారత దేశంలో వృద్ధి చెందుతూ వచ్చిన వేదాంత శాస్త్ర దృక్పథాలను ఆయన వివరించి చూపారు.

1952 లో "లైబ్రరీ ఆఫ్ లివింగ్ ఫిలాసఫర్స్" అనే సంస్థవారు "సర్వేపల్లి రాధాకృష్ణన్ వేదాంతం" అనే ఒక సంపుటిని వెలువరించారు.


1946–50 సంవత్సరాల మధ్య యునెస్కోలో అనేకసార్లు భారత ప్రతినిధి వర్గాలకు ఆయన నాయకత్వం వహించారు. 1948 లో యునెస్కో కార్యనిర్వాహక సమితి ఛైర్మన్‌గాను, 1952 లో యునెస్కో అధ్యక్షులుగాను ఎన్నికైనారు.

ప్రజాహిత రాజకీయ రంగంలో డా. రాధాకృష్ణన్ పాండితీ రంగంలోవలెనే సమానంగా రాణించారు. 1949–52 మధ్యకాలంలో డా. రాధాకృష్ణన్ రష్యాలో భారత రాయబారిగా పని చేశారు. ఆయనకు స్టాలిన్‌తో కలిగిన వ్యక్తిగత పరిచయం వల్ల రెండు దేశాల మధ్య స్నేహసంబంధాలకు గట్టి పునాదులు పడినవి. 1952 లోను 1957 లోను రెండుసార్లు డా. రాధాకృష్ణన్ భారత ఉపరాష్ట్రపతిగా ఎన్నికైనారు. అనేక పాశ్చాత్య దేశాలకు, తూర్పు దేశాలకు వెళ్ళి ఆయా దేశాలకూ, భారత దేశానికీ గల మైత్రి సంబంధాలను మెరుగుపరచడంలో ఆయనెంతో కృషిచేశారు.

1962 మే 13 తేదీన డా. రాధాకృష్ణన్ భారత రాష్ట్రపతి పదవిని అలంకరించారు. 1964 లో వీరికి భారత రత్న బిరుదు నిచ్చి భారత ప్రభుత్వం సత్కరించింది.

ఆయన మరణంతో భారతీయ మేధావి వర్గంలో తీరని లోటు ఏర్పడింది.

2 –5



తెలుగు సంస్కృతి ఔన్నత్యం

శ్రీ మండలి వెంకట కృష్ణారావు

ప్రపంచ జనాభాలో భారతీయుల సంఖ్య ఆరవవంతు అయితే భారత దేశ జనాభాలో ఆంధ్రుల సంఖ్య పదియవ వంతు. మనది ఏకజాతి ప్రజలు నివసించే సువిశాలమైన దేశము. ఆ మాటకు వస్తే రష్యా మినహాగా దాదాపు మొత్తం ఐరోపాఖండం అంత విశాలమైనది భారత దేశం. ఆంధ్రప్రదేశ్ వైశాల్యంలోనూ, జనాభాలో కూడా ఐరోపా ఖండంలోని కొన్ని పెద్ద రాజ్యాలకంటే పెద్దది. తెలుగు మాట్లాడేవారి సంఖ్య అయిదు కోట్లకు పైచిలుకుగా ఉన్నది. భారత దేశంలో అధికార భాష అయిన ఒక హిందీని మినహాయిస్తే, సంఖ్యాబలంలో తెలుగుదే ప్రథమ స్థానం.

భాష అన్నది అభిప్రాయ ప్రకటనకు ఉపయుక్తం అయ్యే సాధన మాత్రమే కాదు. భారత దేశంలోని ఒక ఉపజాతి గుర్తింపుకు, పరిగణనకు ఇది ఒక చిహ్నం. ఇదే భాషా రాష్ట్రాల వ్యవస్థీకరణకు ప్రాతిపదిక సిద్ధాంతం. దేశంలో భాష సమైక్యతా సాధనకు ఇది అత్యంత శక్తివంతమైన సాధనం. ఆంధ్ర ప్రదేశ్‌లో నివసించే ప్రజలను మాత్రమే కాక దేశంలో ఇతర ప్రాంతాలలోనూ, ప్రపంచంలో ఇతర దేశాలలోనూ ఈ భాష మాట్లాడే ప్రజలు అందరినీ కలిపే ఒక అనుసాధనంగా తెలుగు ఉపయుక్తం అవుతున్నది. ఇలా భాష మూలంగా ఏర్పడిన సంబంధాలను మరింత దృఢతరం చెయ్యడానికే ప్రపంచ తెలుగు మహాసభలు ఏర్పాటు చేశారు.

తెలుగు అనగానే మన సంస్కృతి, మన జాతి ఔన్నత్యం, మన చరిత్ర అంతా ఒక్కసారి స్ఫురణకు వస్తుంది. ఇది కొన్ని సంప్రదాయాలు,—పద్ధతులు, అలవాట్లు, ఆలోచనా పద్ధతులు మొత్తం మీద ఒక విలక్షణమై, ఒకానొక జీవన విధానాన్ని ప్రతిబింబిస్తుంది.

ప్రపంచ తెలుగు మహాసభలు ఏర్పాటు మూలంగా దేశదేశాల నుంచి వచ్చిన సోదరులంతా ఒకచోట—ఆంధ్రప్రదేశ్ రాజధానీ నగరంలో కలుసుకోడానికి అవకాశం కలిగింది. ఇటు ఎక్కడో మారిషస్ దీవుల నుంచీ, మలేసియా నుంచీ వచ్చిన తెలుగు వారు అటు కీన్యానుంచీ, దక్షిణ ఆఫ్రికానుంచీ వచ్చిన తెలుగువారిని కలుసుకొని పరిచయం కలిగించుకొన్నారు. అలాగే దేశంలో దక్షిణ ప్రాంతాలు—తంజావూరు, మధురై, కోయంబత్తూరుల నుంచి వచ్చిన తెలుగువారు అటు గుజరాత్, బరంపురం, బస్తర్, చాందా, మాతుంగ, మరట్వాడా ప్రాంతాలనుంచి వచ్చిన తెలుగు వారిని కలుసుకొన్నారు. ఇందువల్ల ఇటు దేశంలోనే కాక అటు ప్రపంచం మొత్తంమీద వివిధ దేశాలలోని తెలుగు ప్రజల మధ్య భాష సమైక్యత సాధించడానికి ఇందుమూలంగా దోహదం కలిగింది.

తెలుగువారికి అపూర్వమైన, అనంతమైన సాంస్కృతిక సంపద ఉన్నది. చిత్రలేఖనం, శిల్పం, నాట్యం, నాటకం, సంగీతం, సాహిత్యంవంటి లలితకళా రంగాలలో తెలుగువారు అపారమైన సేవ చేశారు. దేశ దేశాలకు పరివ్యాప్తమైన అఖండమైన కీర్తి ప్రతిష్ఠలు గడించారు. లేపాక్షి దేవాలయాలలో అందమైన కుడ్య చిత్రాలు, అమరావతి, నాగార్జున ప్రాంతాల ఆనాటి బౌద్ధారామాలలోని అపురూప శిల్పాలు జగద్విఖ్యాతములు అయ్యాయి. వాటికి న్యాయంగా రావలసిన కీర్తి వచ్చింది. కాని వాటిని మరింత గాఢంగా, కళాదృష్టితో నిశితంగా పరిశీలించి, రసాస్వాదన చెయ్య వలసిన అవసరం ఉన్నది. ఇతరులకు వాటిని గురించి ఇలా పూర్వాపరాలు వివరించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈ

కళాఖండాల పరిశీలన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో బౌద్ధమత వ్యాప్తి, విజయనగర సామ్రాజ్య విస్తరణకు సంబంధించిన చరిత్ర మరింత వివరంగా పునశ్చరణ చేసుకోవలసి ఉన్నది. అలాగే కూచిపూడి నాట్యం, నాట్య దాని విలక్షణతగురించి భారత నాట్యశాస్త్రంలో దీని ప్రాధాన్యం గురించి మరింత వివరంగా చెప్పుకోవలసి ఉన్నది.

త్యాగరాజు తమిళనాడులో జీవితం గడిపినా, క్షేత్రయ్య, ఆంధ్రదేశం నడిబొడ్డులో జీవించినా వారు ఇద్దరూ 'తెలుగులోనే' గానం చేశారు. వారు అలా తెలుగు భాషా మాధుర్యాన్ని లోక విదితం చెయ్యడం వల్లనే తెలుగు భాషకు 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అన్న ప్రశస్తి వచ్చింది. పాశ్చాత్య దేశాలలో ఇటాలియన్ భాష ఎంత మధురమైనదో తూర్పు దేశాలలో తెలుగు భాష అంత మధురమైనది. ఇది అజంతమైన భాష. పదాలలో మార్దవం ఎక్కువ ఉండడం వల్ల ఇతర దేశాలవారు ఈ భాషను ఇంతగా మెచ్చుకొన్నారు. ఇంగ్లీషు భాషకు షేక్స్‌ప్రియర్ మహాకవి ఎంత ఖ్యాతి తెచ్చారో తెలుగు భాషకు అదేవిధంగా త్యాగరాజు శాశ్వతమైన కీర్తి ప్రతిష్ఠలు గడించిపెట్టారు.

సంస్కృత భాషా ప్రభావం, సంస్కృత కావ్యాల ప్రభావం ఎంత ఉన్నప్పటికీ, తెలుగు సాహిత్యం అతిప్రాచీన కాలంనుంచి నన్నయ్య, తిక్కనాదుల కాలం నుంచి అతి నవీన కాలంవరకు తన ప్రత్యేకతనూ, తన వ్యక్తిత్వాన్నీ నిలువరించుకొన్నది. తెలుగు భాషపై సంస్కృత ప్రభావం యావత్తు సాహిత్యాన్ని కమ్మేసుకొన్నా కూడా తెలుగు ప్రత్యేకత వైలక్షణ్యం ఏమాత్రం పోగొట్టుకోలేదు. విభిన్న లక్షణాలు కల్పించిన తెలుగుతనం—తెలుగు నుడికారం చెడలేదు. ఇలాంటి వివిధ విషయాలన్నీ ఒక్కసారి మళ్ళీ ఆకళింపు చేసుకోడానికి—అవగాహన చేసుకోడానికి ఈ మహాసభ మూలంగా సదవకాశం కలిగింది.

తెలుగువారికి ఎంతో ఉత్తమమైన, అపూర్వమైన పూర్వ చరిత్ర ఉన్నదనే విషయం జ్ఞాపకం చెయ్యడంకోసం ఈ మహాసభల సందర్భంగా తెలుగువారి చారిత్రిక వైభవాన్ని గురించి వివరించే ప్రదర్శనలు కూడా ఏర్పాటయ్యింది. మన పూర్వ వైభవానికి కారకులైన మహాకవులు, యోధులు, చక్రవర్తులు, నాయకుల గౌరవార్థం రాష్ట్రంలో పలుచోట్ల చిహ్నాలు నెలకొల్పుతారు.

అంతర్జాతీయ సంస్థ

తెలుగు అధ్యయన వ్యవహారాల అంతర్జాతీయ సంస్థ ఒకటి ఏర్పాటు చెయ్యడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రపంచంలో వివిధ ప్రాంతాలనుంచి వచ్చే పరిశోధకులు తెలుగుభాష విషయం లోనూ, సాహిత్యం విషయంలోనూ గట్టిగా ప్రత్యేకమైన కృషి చెయ్యడానికి ఇందులో అన్ని సౌకర్యాలు కల్పిస్తారు. వారు పరిశోధన జరిపి క్రొత్త విషయాలు కనిపెట్టడానికి అన్ని విధాలా ప్రోత్సాహం కల్పిస్తారు.

మహాసభ ప్రయోజనం ఒక వారం రోజులపాటు సమావేశాలు జరగడమేకాదు. ఈ మహాసభ ప్రధాన ఉద్దేశాలకు వాటి మూలంగా ప్రచారం లభిస్తుంది. అయితే ఈ మహాసభల అనంతరం కూడా తెలుగు సాంస్కృతిక సంవత్సరంగా పరిగణించే సంవత్సరం పొడుగునా కార్యక్రమాలు అప్పుడప్పుడూ జరుగుతూనే ఉంటాయి. సాంస్కృతిక సమైక్యత సాధించాలని, పరస్పరం సహకారం అందజేసుకోవాలనే సందేశం ఈ మహాసభకు విచ్చేసిన ప్రతినిధుల సహాయంతో ప్రపంచం నలుమూలలకూ విస్తరించింది.

ద్వితీయ ప్రపంచ తెలుగు మహాసభల కమిటీ

కౌలాలంపూర్‌లో 1977 లో జరిగే ద్వితీయ ప్రపంచ తెలుగు మహా సభల నిర్వహణ కోసం ముఖ్య మంత్రి శ్రీ జలగం వెంగళరావు పోషకులుగా 18 దేశాల ప్రతినిధులతో ఒక కమిటీ ఏర్పాటయింది.

ఈ కమిటీకి డాక్టర్ సి. అప్పారావు (మలేసియా) అధ్యక్షులుగాను, రాష్ట్ర విద్యామంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావు ఉపాధ్యక్షులుగాను ఉంటారు.

శ్రీయుతులు ఎన్. వి. యస్. ప్రసాదరావు (ఆంధ్రప్రదేశ్) ప్రధాన కార్యదర్శిగాను, యం. సోమునాయుడు (మలేసియా) కార్యదర్శిగాను వుంటారు. డాక్టర్ ఎస్. వేణుగోపాల్ (యు. కె.) శ్రీ నర్సింలు (మారిషస్), డాక్టర్ బసవయ్య (కెనడా), శ్రీ దేవేంద్రరావు (ఫిజీ దీవి), శ్రీమతి స్వెత్లానా జనితా (రష్యా), శ్రీ ఎ. ఎమ్. రాజు (శ్రీ లంక), రాష్ట్ర మంత్రి శ్రీ కె. వి. కేశవులు, ప్రముఖ శాస్త్ర వేత్త శ్రీ సూరి భగవంతం, శ్రీ ఎస్. వి. రామారావు (అమెరికా), శ్రీ కె.వి. సుబ్బారావు (యు.కె.), తెలుగు సినీకళాకారుల సంఘం అధ్యక్షులు సభ్యులుగా వుంటారు.



తెలుగు గడ్డమీద తెలుగు చలనచిత్ర పరిశ్రమ

శ్రీ బెజవాడ గోపాలరెడ్డి


సినిమా ఒక పరిశ్రమ. దీనివల్ల వినోదపు పన్ను రూపంలో ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. అనేక లక్షల మందికి యీ పరిశ్రమవల్ల ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఉపాధి లభిస్తుంది. బహుళ ప్రయోజనకరమైన పరిశ్రమ యిది.

తెలుగు చలన చిత్ర పరిశ్రమ యిప్పటికే బాగా అభివృద్ధి చెంది వుంది. ఇంకా అభివృద్ధి చెందుతోంది. అయితే అది స్వరాష్ట్రంలో కాకుండా పొరుగు రాష్ట్రంలో జరుగుతోంది. నిజానికి ఆంధ్ర ప్రదేశ్ చలన చిత్ర పరిశ్రమకు అనువైన రాష్ట్రం. ఈ పరిశ్రమకు కావలసిన అన్ని హంగులూ యిక్కడ వున్నాయి. ప్రకృతి పరిసరాలూ సౌందర్యమయాలు. ప్రతి దృశ్యమూ ఒక అద్భుత కళా ఖండం. దక్కను పీఠ భూమి ఎగుడు దిగుడుల నేల మీద పరచుకున్న అందాల రాళ్ళ గుట్టలు, తూర్పు కనుమల్లో స్వాగత తోరణం కట్టిన కొండల బారు, పురాతన సంస్కృతి తొంగి చూసే అపూర్వ కట్టడాలు, విరిసిన చిరునవ్వుల విశాల ఆరామాలు, కొండల గుండెలో పారే సెలయేళ్ళు, వెండి పూత పూసినట్టు మెరిసిపోయే సముద్ర తీరాలు, పచ్చల తివాసీ పరిచిన పచ్చిక బీళ్లు, చీకట్లు కురిపించే చిట్టడవులు, హరివిల్లు విరిసినటు రంగుల చిరునవ్వులు విసిరే ఆరామాలు—యిలా చెప్పుకుంటూ పోతే ఎన్నెన్నో వున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఆంధ్ర ప్రదేశ్ సౌందర్య నిధి. ఇది చలనచిత్ర పరిశ్రమకు అన్నివిధాలా అనువైనది.

ఉమ్మడి రాష్ట్రంగా మద్రాసు వున్నప్పుడు తెలుగు చలన చిత్ర రంగం మద్రాసులో స్థిరపడిపోయింది. ఇప్పుడు ఆ రంగాన్ని స్వరాష్ట్రానికి తీసుక రావలసిన అవసరం ఎంతయినా వుంది. ఇటు ప్రభుత్వమూ, అటు పరిశ్రమలోనివారూ యిందుకు తీవ్రంగా కృషి చేయాలి. తెలుగు గడ్డమీద తెలుగు చిత్ర సీమను ప్రతిష్ఠించాలి. అప్పుడే దాన్నియింకా ఎక్కువగా అభివృద్ధి చేసుకోవడానికి వీలవుతుంది.

ప్రభుత్వ కృషి

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కూడా యీ పరిశ్రమను స్వరాష్ట్రానికి తీసుకు రావడానికి గట్టి ప్రయత్నాలే చేస్తోంది. ఇటీవలి కాలంలో యిందుకు ముమ్మరంగా కృషి ప్రారంభ మయ్యింది. ఈ రాష్ట్రంలో తీసే చిత్రాలకు సబ్సిడీ యివ్వడం, స్టూడియోల పునరుద్ధరణకు ఋణాలు మంజూరు చేయడం, ఉత్తమ తెలుగు చిత్రాలకు ఏటా బహుమతులు యివ్వడం, ఒక చిత్రపురిని ఏర్పాటు చేయడం, పూనాలోని ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో చదువుకొనే మన రాష్ట్ర విద్యార్థులకు స్కాలర్ షిప్పులు యివ్వడం వంటి మంచి పనులు చాలా చేస్తోంది. రాష్ట్రంలో తీసే చలన చిత్రాలు ఒక్క తెలుగు వాటికే కాకుండా ఏ భాషలో తీసిన వాటికైనా ప్రభుత్వం సబ్సిడీ యిస్తోంది. దీనివల్ల యితర భాషా ప్రాంతాల వారిని కూడా ఆకర్షించి ఆయా భాషా చిత్రాలనుకూడా యిక్కడ తీయడానికి అవకాశం కల్పించి, తద్వారా చలనచిత్ర పరిశ్రమ మరింత శీఘ్రంగా అభివృద్ధి చెందడానికి దోహదం చేసినట్టవుతుంది. హిందీలో, కన్నడంలో, మరాఠీలో, మళయాళంలో కొన్ని చిత్రాలు యిక్కడ తీసేరనికూడా విన్నాను.




ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ చలనచిత్ర బహుమతుల నిర్ణాయక సంఘం, 1973 : శ్రీమతి శ్రీరాజ్యం సిన్హా, శ్రీ గోరాశాస్త్రి, డా. బెజవాడ గోపాల రెడ్డి, శ్రీ తుర్లపాటి కుటుంబరావు, డా. ఎన్. శ్రీదేవి.

తక్కువ ఖర్చు చిత్రాలు

రాష్ట్రంలో తీసే చిత్రాలకు యిచ్చే సబ్సిడీని కూడా ప్రభుత్వం 50 వేల రూపాయల నుంచి లక్ష రూపాయలకు పెంచింది. లక్ష రూపాయల సబ్సిడీ అంటే తక్కువేం కాదు. అయితే మన తెలుగు సినిమాకు లక్ష రూపాయలు ఒక మూలకు కూడా రావు. లక్షలకులక్షలు ఖర్చుపెట్టి సినిమా తీసే అలవాటు మన తెలుగు చిత్ర పరిశ్రమలో చోటు చేసుకుంది. ఎంత ఎక్కువ డబ్బు ఖర్చు పెడితే అంతగొప్ప చిత్రం అవుతుందనే ధోరణి ఆరోగ్యకరమయినది కాదు. రెండున్నర లక్షలలోపు బడ్జెటుతో అత్యద్భుతమైన సినిమాలు తీసి జాతీయ, అంతర్జాతీయ బహుమతులు సంపాదించిన యితర భాషా చిత్రాలు అనేకం వున్నాయి. అందువల్ల ప్రభుత్వం లక్షరూపాయల సబ్సిడీ యిస్తున్నదంటే ఆ మొత్తం తక్కువేమీ కాదు. ఇంత ఉదారంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నందుకు నిజంగా ప్రభుత్వాన్ని అభినందించాలి.

స్వరాష్ట్రానికి తెలుగు చలన చిత్ర పరిశ్రమను రప్పించే ముందు దానికి యిక్కడ ఒక నీడ అంటూ కల్పించడం అవసరం. స్టూడియో సౌకర్యాలు లేకపోతే చలన చిత్ర పరిశ్రమకు మనుగడే లేదు. అందుకే ఒక చిత్రపురి ఏర్పాటుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది. ఈ చిత్రపురిలో స్థలం, నీరు, విద్యుచ్ఛక్తి వంటి ప్రాథమిక అవసరాలను యీ పరిశ్రమలోని వారికి తక్కువ ధరలకు ప్రభుత్వం యిస్తున్నది. ఇక్కడ స్టూడియోలు కట్టడానికి కొందరు చలన చిత్ర రంగంలోని ప్రసిద్ధులు ముందుకు రావడం ఎంతయినా హర్షదాయకం. పంతాలు పట్టింపులు లేకుండా అంతా యిక్కడకు రావాలని, స్థిరపడాలని నా కోరిక. ఇలా రావడంలో, ప్రారంభంలో కొన్ని యిబ్బందులను ఎదుర్కోవలసి వచ్చినప్పటికి దూరదృష్టితోనూ, స్వరాష్ట్రం మీద ప్రేమాభిమానాలతోనూ యిందుకు సిద్ధ పడక తప్పదు. ఒక మంచి పని వెనక కొద్దో గొప్పో త్యాగం వుండి తీరుతుంది



ఆంధ్ర ప్రదేశ్ గవర్నరు శ్రీ యస్. ఓబులరెడ్డి 1973 సం.పు ఉత్తమ చలనచిత్రాల కళాకారులకు బహుమతులను పంచినప్పటి చిత్రం. ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు, ఆర్థిక, సమాచార శాఖ మంత్రి శ్రీ పిడతల రంగారెడ్డి, నిర్ణాయకసంఘ సభ్యులను, కళాకారులను చిత్రంలో చూడవచ్చు.

ఆ త్యాగానికి, ప్రారంభంలో ఎదురయ్యే కొద్దిపాటి యిబ్బందులకు సిద్ధపడడం విజ్ఞుల లక్షణం.

ఇక్కడ చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందినప్పుడు సాంకేతిక వేత్తల అవసరం చాలా వుంటుంది. పూనా సంస్థలో శిక్షణ పొందేందుకు మన రాష్ట్రానికి చెందిన విద్యార్థులు కొందరికి ప్రభుత్వం స్కాలర్ షిప్పులు యివ్వడంవల్ల చాలా మంది యీ సాంకేతిక విషయాలలో శిక్షణ పొందడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఇంతవరకు 22 మంది ఆ విధంగా స్కాలర్ షిప్పు సౌకర్యం పొంది వివిధ రంగాలలో శిక్షణ పొందారు. ఈ విధంగా శిక్షణ పొందిన వారిని పరిశ్రమలోకి తీసుకొని ప్రోత్సహించడం చలన చిత్ర పరిశ్రమ వారిమీద వుంది.

చలనచిత్ర అభివృద్ధి సంస్థ

ఆంధ్ర ప్రదేశ్‌లో చలన చిత్ర పరిశ్రమాభివృద్ధికై ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం ఎంతైనా అభిలషణీయం. దీనికి సంబంధించిన నివేదికను తయారు చేయుమని ఒక ప్రత్యేకాధికారిని ఏర్పాటు చేయడం, ఆయన నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేయడం కూడా జరిగింది. ఈ నివేదిక యిప్పుడు ప్రభుత్వ పరిశీలనలో వుంది. త్వరలోనే ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని చలన చిత్ర అభివృద్ధి సంస్థను వాస్తవం చేస్తుందని మనం ఎదురు చూడవచ్చు. ఈ సంస్థవల్ల యిటు చలన చిత్ర నిర్మాణం మాత్రమే కాక చలన చిత్ర ప్రదర్శనకు సంబంధించిన అనేకానేక విషయాల వరకు యావత్ చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి వీలు ఏర్పడుతుంది.

తెలుగు చలన చిత్రాలలో ఉత్తమ సాంకేతిక, కళాత్మక విలువలను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రభుత్వం ఏటా బహుమతులిచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించడంలో ఉద్దేశం యిదే. ఈ కార్యక్రమాన్ని 1964 నుండి ప్రారంభించారు. గత కొద్ది సంవత్సరాలుగా బహుమతుల ప్రదానాన్ని వాయిదా వేయవలసి వచ్చింది. శ్రీ పిడతల రంగారెడ్డి గారు బహుమతుల కమిటీకి అధ్యక్షులుగా అయిన తర్వాత ప్రత్యేక శ్రద్ధ వహించి 1970, 1971, 1972 సంవత్సరాల బహుమతులను గత ఏడాది ప్రదానం చేయడం జరిగింది. శ్రీ రంగా రెడ్డి గారు చలన చిత్ర పరిశ్రమాభివృద్ధికి మొదటినుంచీ కృషిచేస్తున్న వ్యక్తి. ఇప్పుడు నా అధ్యక్షతన ఒకకమిటీని ప్రభుత్వం నియమించింది. మా కమిటీ 1973 సంవత్సరంలో నిర్మించబడిన తెలుగు చిత్రాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు అర్హమైనవిగా శారద, అందాలరాముడు, సంసారం—సాగరం యీ మూడు చిత్రాలను ఎన్నిక చేసింది.

ప్రభుత్వమూ పేదవర్గాలు



స్వరాజ్యం వచ్చిన తర్వాత సంక్షేమరాజ్యం అనేమాట మనకు తరచు వినపడుతూ వుంది. గాంధీజీ దీన్నే రామరాజ్య మన్నారు.

“ నేను కలలు గన్న స్వరాజ్యం బీదల స్వరాజ్యం. రాజులు, ధనికులూ వారి జీవితావసరాలను ఎట్లా తీర్చుకుంటారో అలాంటి సదుపాయాలు బీదలకు కూడా సులభంగా లభించాలి. . . నేను కలలు గన్న స్వరాజ్యంలో కులమత భేదాలకు ఎలాంటి స్థానంలేదు. ఆ స్వరాజ్యం అందరి క్షేమం కొరకే, కళ్యాణం కొరకే వుంటుంది. అందరి కొరకు అంటే అందులో కుంటి, గ్రుడ్డి, మూగ మొదలైన వారూ, ఆకలితో అలమటించే కోట్లాది కష్టజీవులు కూడా వుంటారు” అన్నారు గాంధీజీ.

సంక్షేమ రాజ్యంలో సంఘంలో అట్టడుగునవున్న నిరుపేద వర్గాల సముద్ధరణ ప్రథమకర్తవ్యం. విద్యా విషయికంగానూ, ఉద్యోగఅన్వేషణలోనూ బాధపడుతున్న విద్యార్థులూ, యువజనులూ, చేతికి వచ్చే జీతం డబ్బులు చాలక సతమతమవుతున్న మధ్య తరగతి ప్రజలూ మొదలగువారి పరిస్థితులు మెరుగుపరచడానికి నిరంతరంగా కృషి జరుగుతూ వుండవలసిందే. ప్రణాళికా కార్యక్రమాలు అమలుపరచడం ద్వారా యీ సాంఘిక దుర్బలతలను మనం తొలగించుకోవాలి.

మన రాజ్యాంగం ఏమన్నది ?

మన రాజ్యాంగం అదే చేసింది. తదనుగుణంగా మన ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నవి. ఒక నిర్దిష్ట కాలం వరకు షెడ్యూలు జాతులు, షెడ్యూలు కులాలు మొదలగు సంఘంలోని బలహీన వర్గాలవారికి ప్రత్యేక హక్కులు యివ్వాలనీ, అనేక విషయాలలో వారికి రిజర్వేషన్ల పద్ధతి అమలుపరచాలనీ, మన రాజ్యాంగం నిర్దేశించింది. మనం ఆదర్శంగా పెట్టుకున్న సోషలిస్టు తరహా సమాజనిర్మాణం జరగాలంటే ప్రజల్లో వివిధ వర్గాలకు సంతృప్తికరంగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించుకోవడం అవసరం. నిరుపేద వర్గాల వారికి ప్రతి విషయంలోనూ ప్రత్యేక ప్రాధాన్యం యివ్వడం తప్పనిసరి.

మన రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమశాఖ ద్వారా తన కార్యక్రమాలను నిర్వహిస్తుంటుంది. ఇవి ముఖ్యంగా వెనుకబడిన వర్గాల సముద్ధరణకు సంబంధించి ఉంటాయి. షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులు, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉపకార వేతనాలు యివ్వడం, వారి కోసం హాస్టళ్ళు నిర్వహించడం, ఇతర విధాలుగా విద్యావిషయికమైన కార్యక్రమాలు నిర్వహించడం, గృహవసతి కల్పన, సహకార గృహ నిర్మాణ సంఘాలు, వృత్తి విద్యా శిక్షణ, ఇతర ఆర్థిక అభివృద్ధి పథకాలు మొదలగు వాటిని చేపట్టి నిర్వహిస్తున్నారు.

చిన్న రైతులకు ఆర్థిక సహాయం

ఆర్థిక అభివృద్ధి పథకాలు సంఘంలో వున్న బలహీన వర్గాల వారి బాగుకోసం ఉద్దేశించినట్టివి. చిన్న రైతులు నాగళ్ళు, ఎద్దులు, పాడి పశువులు, వ్యవసాయ పరికరాలు కొనుక్కోవడానికీ, కొత్త భూములను సాగులోకి తెచ్చుకోడానికీ, సేద్యపు నీటి బావులు త్రవ్వించుకోడానికీ, విద్యుచ్ఛక్తితో నడిచే పంపులు ఏర్పాటు చేసుకోడానికీ ఆర్థిక సహాయం జరుగుతున్నది. అలాగే రిక్షాలు కొనుక్కోవడానికి, చిన్న వర్తకులకు, చేతి పనివాండ్రకు పెట్టుబడి క్రింద అప్పులివ్వడం మొదలగు కార్యక్రమాలు కూడా అమలు జరుగుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ షెడ్యూలు జాతుల ఆర్థిక సహాయ సంస్థ నొకదానిని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఉన్న వనరులను సమీకరించి ఆర్థిక అభివృద్ధికి తగు పథకాలను రూపొందించి అమలు పరచడానికి ఈ కార్పొరేషన్ కృషి చేస్తున్నది. అలాగే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన వర్గాల ఆర్థిక సహాయ సంస్థను కూడా ఏర్పాటు చేశారు.

బీద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

బీద వర్గాలకు సంబంధించిన విద్యార్థులకు చదువు మీద ఆసక్తి కలిగించడానికీ, వారికి ఆర్థికంగా తోడ్పడడానికీ ఉపకార వేతనాలు

యిచ్చే పథకాలు అమలు పరుస్తున్నారు. పిల్లలు తల్లిదండ్రుల వద్ద వుండి చదువుకుంటున్నా, ప్రభుత్వపు గుర్తింపు పొందిన హాస్టళ్లలో వుండి చదువుకుంటున్నా ఈ స్కాలర్‌షిప్‌లు లభిస్తాయి. ఆరవ తరగతి నుండి పోస్ట్ గ్రాడ్యుయేట్ తరగతుల వరకు చదువుకునే షెడ్యూలు తరగతుల, వెనుకబడిన తరగతుల విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్‌లు యిస్తారు. మెట్రిక్యులేషన్‌కు పూర్వపు తరగతులు చదువుకునేవారికి వీటిని మంజూరుచేసే అధికారం జిల్లా కలెక్టర్లకు వుంటుంది. 1973-74 సంవత్సరం నుండి మెట్రిక్యులేషన్ తరువాత తరగతులు చదివే వారికి కూడా స్కాలర్‌షిప్‌లు యిచ్చే అధికారం కూడా కలెక్టర్లకే యిచ్చారు. రాష్ట్రం వెలుపల ప్రాంతాలలో మెట్రిక్యులేషన్ తరువాత తరగతులు చదివేవారికి సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టరు ఈ స్కాలర్‌షిప్‌లు మంజూరుచేస్తారు. స్కాలర్‌షిప్‌ల పేరుతో యిచ్చే మొత్తాలు పుస్తకాలు, ఫీజులు, భోజన, వసతిఖర్చులు, మొదలగు వాటికోసం ఉద్దేశించినట్టివి. హాస్టళ్ళలో వుండి చదువుకుంటున్న వారికి భోజన, వసతి సౌకర్యాల క్రింద 6-10 తరగతులలో నెలకు రూ. 20ల వంతున 10 నెలలు ఇస్తారు. కాలేజీ విద్యార్థులకు నెలకు రూ. 40ల వంతున 9 నెలలు ఇస్తారు. హైదరాబాదు, విశాఖపట్టణం, గుంటూరు, కర్నూలు, మద్రాసు వంటి పెద్ద పట్టణాలలో కాలేజీ విద్యార్థులకు నెలకు రూ. 50 ల వంతున యిస్తారు.

1974-75 సంవత్సరానికి రాష్ట్రప్రభుత్వం షెడ్యూలుజాతుల స్కాలర్‌షిప్ పథకాలకోసం 1 కోటి 11 లక్షల 12 వేల రూపాయలు కేటాయించింది. 1972-73 లో 82,829 మంది విద్యార్థులకు ఈ విధంగా 1 కోటి 6 లక్షల 43 వేల రూపాయల మేరకు సహాయం జరిగింది. తరువాత సంవత్సరంలో అంటే 1973-74 లో 83,023 మంది విద్యార్థులకు ఈ పథకంవల్ల లాభం కలిగింది.

వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులకు 1972-73లో 93,456 మందికి, 1973-74లో 1,01,370 మందికీ స్కాలర్‌షిప్‌లు లభించాయి. 1974-75 సంవత్సరపు బడ్జెట్‌లో యిందు కోసం 1 కోటి 8 లక్షల 77 వేల రూపాయలు కేటాయించారు వెనుకబడిన వర్గాల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల కోసం కేటాయించిన మొత్తాలను క్రైస్తవమతం పుచ్చుకున్న హరిజనులు, వెనుకబడిన వర్గాల జాబితాలోవున్నవారూ, ఆర్థికంగా బలహీనులైన వర్గాల వారికీ ఉపయోగపడేటట్లు పునర్విభజించారు.

బలహీన వర్గాలకు హాస్టలు వసతి

బలహీనవర్గాల ప్రజల సముద్ధరణ కార్యక్రమంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లతోపాటు హాస్టలు వసతి కల్పించడం కూడా ఒక ముఖ్యాంశమే. మన రాష్ట్రంలో షెడ్యూలు కులాలకోసం 961 హాస్టళ్లను ప్రభుత్వం నిర్వహిస్తున్నది. ఇవి కళాశాల విద్యార్థులకూ స్కూలు విద్యార్థులకూ ఉపయోగపడుతున్నాయి. కళాశాల విద్యార్థుల కోసం ఉద్దేశించిన వాటిలో 44గురు విద్యార్థులకూ, 4 విద్యార్థినులకు; అలాగేస్కూలు హాస్టళ్లలో 680 విద్యార్థులకోసం, 233 విద్యార్థినుల కోసం నిర్వహిస్తున్నారు.

1972-73 సంవత్సరాంతానికి ప్రభుత్వం సబ్సిడీ యిస్తున్న హాస్టళ్లు 774 వుండేవి. 1973-74 సంవత్సరంలో చివర్లో వీటిని ప్రభుత్వం రద్దు చేసింది. వీటిస్థానే సాంఘిక సంక్షేమశాఖవారు కొత్తగా హాస్టళ్ళు ప్రారంభించారు

1974-75 బడ్జెటులో ప్రభుత్వ హాస్టళ్ళు, బాలికల హాస్టళ్లు, దుస్తుల కొరకు ధనసహాయం, 5 లక్షల ఉద్యోగాల పథకం మొదలగు వాటి కోసం 3 కోట్ల, 37 లక్షల, 75 వేల రూపాయలు కేటాయించారు.

ఈ హాస్టళ్లలో విద్యార్థులను చేర్చుకునే విషయంలో సీట్లలో 60 శాతం షెడ్యూలు కులాలవారికీ, 15 శాతం క్రైస్తవ హరిజనులకూ, 14 శాతం వెనుకబడిన తరగతులవారికీ, 6 శాతం ఆర్థికంగా బలహీన వర్గాల వారికీ, 5 శాతం షెడ్యూలు జాతులవారికీ కేటాయించడం జరిగింది.

ఉపాధి, ఉద్యోగాలు

సరే, యీ పేద వర్గాలవారికి చదుకోవడానికి తగిన వసతులు ఏర్పాటు చేస్తున్నాం. బాగానేవుంది. మరి చదువుకున్న తర్వాత వాళ్లు ఏం చెయ్యాలి? ఉద్యోగాలు ఎక్కడున్నాయి. ప్రభుత్వోద్యోగాలలో వారి కోసం కొంత రిజర్వేషన్ పద్ధతి అమలు జరుగుతున్నదనుకోండి. ఆ మాత్రం చాలుతుందా? ఈ నాడు దేశంలో సాంకేతిక విద్యకు ఎంతో ప్రాధాన్యం వచ్చింది. మామూలు కాలేజీ విద్యకంటే వృత్తి విద్యలకు గిరాకీ బాగావుంది. దేశం అభివృద్ధి చెందుతున్న కొలదీ, పరిశ్రమలు పెరుగుతున్న కొలదీ సాంకేతిక విద్యావేత్తలు అవసరం అందుకే వృత్తి విద్యా శిక్షణ పేరుతో ఒక ముఖ్యమైన కార్యక్రమం అమలు జరుపుతున్నారు. తోళ్లు మనుపు చేయడం, తోళ్లతో వస్తువుల తయారీ, నేత, వడ్రంగం వంటి వృత్తి విద్యలలో అనేక మంది హరిజనులకు శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం శిక్షణ-ఉత్పత్తి కేంద్రాలు పని చేస్తున్నాయి వీటిని రెండో పంచవర్ష ప్రణాళిక కాలంలో ప్రారంభించారు. ఇలాంటి కేంద్రాలు మన రాష్ట్రంలో 27 వున్నాయి వీటిలో 600 మంది శిక్షణ పొందుతున్నారు. ఒక సంవత్సరం శిక్షణ యిస్తారు. శిక్షణ కాలంలో నెలకు 20-30 రూపాయలు, ఆయా వృత్తులనుబట్టి స్టయిఫండు యిస్తారు. అలాగే దుస్తుల తయారీ కేంద్రాలు మనకు 11 వున్నాయి ఇవి శ్రీకాకుళం, విశాఖపట్నం, కాకినాడ, ఏలూరు, విజయవాడ, మంగళగిరి, నెల్లూరు, కడప, అనంతపురం, చిత్తూరు, కర్నూలు కేంద్రాలలో వున్నాయి. జంటనగరాల్లో వున్న 6 కేంద్రాలలో ఒక్కొక్కదానిలో 150 మంది తర్ఫీదు పొందవచ్చు. జిల్లాలలోని కేంద్రాలలో ఒక్కొక్క దానిలో 20 మందికి శిక్షణ ఇస్తారు. అనంతపురం, విజయనగరం, కేంద్రాలలో వడ్రంగం శిక్షణ కేంద్రాలున్నాయి. చిత్తూరు, కొత్తవలస కేంద్రాల్లో బుట్టలల్లకం కేంద్రాలు, రాజేంద్ర నగర్, నార్సింగి, రఘునాధ్‌పల్లి, కల్వకుర్తిలలో తోళ్ల పరిశ్రమ కేంద్రాలు పని చేస్తున్నాయి.

హరిజన కాలనీలలో...

షెడ్యూలు కులాల పిల్లలకోసం హరిజన కాలనీలలో సాంఘిక సంక్షేమశాఖ ప్రత్యేక పాఠశాలలు నడుపుతున్నది. 1974–75లో యీ పాఠశాలల నిర్వహణకోసం 32 లక్షల 9 వేల రూపాయలు కేటాయించారు. ఇందులో మధ్యాహ్న భోజన వసతి పథకాల ఖర్చుకూడా చేరివుంటుంది. ఈ విధంగా 529 ప్రాథమిక పాఠశాలలు, 4 హైస్కూళ్ళు యీ శాఖవారు నడుపుతున్నారు. ఇవి పూర్తిగా హరిజనుల పిల్లలకోసమే. వీటిలో 972 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు; 22,313 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

పేదతనంతో బాధపడేవారి పిల్లలు నిజానికి పాఠ్య గ్రంథాలు కూడా కొనుక్కోలేరు. వీరికి జాతీయం చేయబడిన పాఠ్యగ్రంథాలను 1 నుంచి 10వ తరగతివరకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నది. 1972–73లో యీ విధంగా 1,18,693 మంది విద్యార్థులకు పుస్తకాలు యిచ్చారు. 1973–74లో రూ. 6 లక్షల 32 వేలకు పైగా యిందుకోసం ఖర్చు జరిగింది. అంతేకాక షెడ్యూలు కులాల, హరిజన క్రైస్తవులకు చెందిన విద్యార్థులకు రాష్ట్రంలో అన్ని కళాశాలల్లోనూ పూర్తి ఫీజు మినహాయింపు సౌకర్యం కలుగచేశారు. తల్లిదండ్రుల ఆదాయం ఏడాదికి రూ. 3,600లకు మించని సందర్భాలకు యిది వర్తిస్తుంది. విశ్వవిద్యాలయాలవారు ఈ మినహాయింపు అమలుపరచి, ఆ మొత్తాన్ని ప్రభుత్వం వద్దనుంచి రాబట్టుకొంటారు.

ఉండడానికి ఇల్లు

ఏదో ఒకవృత్తి చేసుకుని నాలుగు డబ్బులు సంపాదించుకోగలిగినా ఉండడానికి యిల్లుండాలికదా! అది అన్నింటికంటే పెద్ద సమస్య. జీవితభీమా సంస్థవారు యిచ్చిన రు. 10 కోట్ల ఋణంతో 55,546 యిండ్లు పేదవారికోసం నిర్మించే పథకం అమల్లోవుంది. 1974 ఏప్రిల్ చివరకు 46,173 యిండ్ల నిర్మాణం పూర్తిఅయింది భారీయెత్తున గృహనిర్మాణ కార్యక్రమాలు నిర్వహించడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూలుజాతులు, షెడ్యూలుకులాల సహకార గృహనిర్మాణ సంస్థల ఫెడరేషన్ నిర్మించబడింది. జిల్లాల్లో కలెక్టర్లు అధ్యక్షులుగా జిల్లా సహకార గృహనిర్మాణ సంఘాలు పనిచేస్తున్నాయి.

ఇండ్ల స్థలాలు

హరిజనులు మొదలగు పేదవర్గాల ప్రజలకు యిండ్ల స్థలాలు మంజూరుచేయడం కూడా సంక్షేమకార్యక్రమాల్లో ఒక ప్రధానాంశం. ఇండ్ల స్థలాలను సేకరించడానికీ, షెడ్యూలు తరగతులు, షెడ్యూలు జాతుల సహకార గృహనిర్మాణ సంస్థలలో పెట్టుబడికీ ప్రభుత్వం నిధులను కేటాయిస్తున్నది. అంతేకాక ప్రభుత్వస్థలాలు లభ్యమైన సందర్భాలలో వాటిని పేదవారికి ప్రభుత్వం మంజూరు చేస్తున్నది. ఇందుకోసం అవసరమైతే ప్రయివేటు స్థలాలను కూడా సేకరిస్తున్నారు. అంతేకాక యిండ్లస్థలాలు మంజూరుచేసిన హరిజనులకు పక్కా యిండ్లు కట్టుకోడానికిగాను ఒక్కొక్క కుటుంబానికి వంద రూపాయల వంతున ఆర్థిక సహాయంకూడా చేస్తున్నారు.


1973–74 సంవత్సరంలో హరిజనులకు 12,374 స్థలాలు మంజూరు చేశారు. ఇవి 278 గ్రామాలకు సంబంధించినవి. మొత్తం 1,118 ఎకరాల 73 సెంట్లు. వీటికోసం జరిగిన ఖర్చు రు 54.92 లక్షలు. ఇవికాక 400 గ్రామాలలో 13,696 కుటుంబాలవారికి 1061 ఎకరాల ప్రభుత్వభూమి కూడా యిండ్ల స్థలాలక్రింద కేటాయించడం జరిగింది. ఇండ్లు కట్టుకోడానికి గ్రాంట్లు 19,970 కుటుంబాలవారికి యిచ్చారు.

ప్రజల సహకారం

నిరుపేదవర్గాల ప్రజలు అధికసంఖ్యలోవున్న కారణాన ఎంత చేసినా యింకా చేయవలసి వుండనే వుంటుంది. ప్రభుత్వం యిది చేసిందీ అంటే, యింతేనా అనిపించడంకూడా కద్దు. అయితే ఏ కార్యక్రమం విషయంలో చూసినా అంతా ఒక రోజులో జరగాలనుకోవడం సాధ్యంకాని పని. ఇదీ మేము చేసింది అని ప్రభుత్వం చెప్పడమూ, యింకా ఎక్కువ చెయ్యలేకపోయారా అని ప్రజలు అడగడమూ ప్రజాస్వామ్య వ్యవస్థలో సాధారణంగా జరుగుతుంటుంది. ఇంతకూ మనం చూడవలసిందల్లా, ఏవిషయంలోనైనాసరే ప్రభుత్వం చిత్తశుద్ధితో, పట్టుదలతో పనిచేస్తున్నదా లేదా వనరులు లభ్యమైనంతలో శాయశక్తులా కృషిచేస్తున్నదా లేదా, అనే. మన ప్రభుత్వం నిరుపేదవర్గాల సముద్ధరణకు పూనికతో అన్ని విధాల పనిచేస్తున్నదనే విషయం నిర్వివాదం. ప్రజలు పూర్తిగా సహకరిస్తే ఇంతకు పదింతలు పనికూడా చేసుకోవడం సాధ్యమే.

మనం క్లిష్ట సమయంలో దుర్భర జీవితం గడుపుతున్నాం. కాని మానవుడిలో నిద్రాణమైవున్న సుగుణాలు మేల్కొని బానిసత్వానికి లోనుకాని శ్రమజీవనానికీ, నూతన సృష్టికీ కృషి చేసే రోజు దగ్గరలోనే వుంది. ఇది సత్యం; ఇదే మనలను ఓదార్చి శక్తినీ, ధైర్యాన్నీ పుంజుకొనేలా చేస్తుంది.

—గోర్కీ




నగరంలో రాష్ట్రపతి

భారత రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా కాశ్మీరు ముఖ్యమంత్రి శ్రీ షేక్ అబ్దుల్లాతో ఏప్రిల్ 17 న బేగంపేట విమానాశ్రయం చేరగానే ఆంధ్రప్రదేశ్ గవర్నరు శ్రీ శేషారెడ్డి ఓబులరెడ్డి, ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు ప్రభృతులు స్వాగతం చెప్పారు.



ఏప్రిల్ 18వ తేదీ మధ్యాహ్నం రాష్ట్రపతి జూబిలీ హాలులో ప్రొఫెసర్ హెచ్. కె. షెర్వాని సంపాదకత్వంలో వెలువడ్డ "మధ్య యుగపు దక్కన్ చరిత్ర" రెండు సంపుటాలను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ గవర్నరుతోపాటు మహారాష్ట్ర గవర్నరు శ్రీ నవాబ్ అలీయావర్ జంగ్, ఒరిస్సా గవర్నరు శ్రీ అక్బర్ అలీ ఖాన్, హిమాచల్ ప్రదేశ్ గవర్నరు శ్రీ చక్రవర్తి ప్రభృతులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఇదొక మరపురాని ఘట్టం. "వైవిధ్యంలో ఐక్యతను భారతీయ సంస్కృతికి ప్రత్యేకతగా భావించుకొనే పక్షాన, ఇది దక్కను ప్రాంతాన నిరూపింపబడ్డంత నిర్దిష్టంగా దేశంలో మరెక్కడా కానరాదు" అన్నారు యీ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్.


ఆ రోజు మధ్యాహ్నమే గాంధీభవన్ ఆవరణలో జరిగిన ఒక ప్రత్యేక సమావేశంలో ఆంధ్రప్రదేశ్ భూదాన యజ్ఞ బోర్డు రజతోత్సవాలకు ప్రారంభోత్సవం చేశారు. 25 సంవత్సరాల క్రితం పోచంపల్లి అనే కుగ్రామంలో ఆచార్య వినోబా భావే ప్రారంభించిన భూదానోద్యమం, చరిత్రలో కనీవినీ ఎరుగని శాంతియుత క్రాంతినీ, బీదసాదలకు భూమినీ ప్రసాదించింది. జాతి మొత్తం అంతా యీ వుద్యమానికెంతో రుణపడివుంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రపతి "హింస ప్రబలమై సాగుతోన్న యీ తరుణంలో యీ వుద్యమ రజతోత్సవాలు క్రొత్త ఔచిత్యాన్ని సంతరించుకొన్నా" యన్నారు.



ఆరోజు సాయంత్రం రాష్ట్రపతి ప్రపంచ తెలుగు మహాసభల నుద్దేశించి కాకతీయనగర్‌లో ప్రసంగించారు.

వార్తావాహిని

ప్రపంచ తెలుగు మహాసభలు



రాష్ట్రపతి శ్రీ ఫకృద్దీన్ అలీ అహమ్మద్ ఏప్రిల్ 18న మహా సభలలో ప్రసంగిస్తున్న దృశ్యం. శ్రీయుతులు మండలి వెంకట కృష్ణారావు. అక్బర్ అలీఖాన్, మర్రి చెన్నారెడ్డి, షేక్ అబ్దుల్లా, యస్. ఓబులరెడ్డి, జలగం వెంగళరావు గార్లనుకూడా చిత్రంలో చూడవచ్చును.

ఏప్రిల్ 12, 1975 ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించే రోజు। ఐదు కోట్ల తెలుగు ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు గట్టిపునాదులు పడ్డరోజు। నవభారత నిర్మాణానికి విశేషంగా తోడ్పడ్డ తెలుగు ప్రజల జీవితంలో మరువలేని, మరుపురాని మహాఘట్టం. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తెలుగు ప్రజలంతా ఒక వేదిక మీద కలసిన రోజు. అదే ప్రపంచ తెలుగు మహాసభలు ప్రారంభమయినరోజు. ఈ వారం రోజులు తెలుగు వెలుగు; తెలుగు ప్రతిభ దేశం నలుమూలలే కాకుండా ప్రపంచం నలుదిశలా వ్యాపించి ఆంధ్రప్రదేశ్‌కు ఎనలేని కీర్తిని సంపాదించిన మధుర క్షణాలు:

తెలుగు దేశపు పూర్వపుటౌన్నత్యాన్ని ఒకసారి మనం చేసుకొని తెలుగు సంస్కృతిలోని ప్రాభవాన్ని ప్రపంచం నలుదిశలా వ్యాప్తి చేయుటకు తోడ్పడ్డ ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావును ఐదుకోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎన్నటికీ మరువ లేరు. తెలుగు మహాసభలు విజయవంతమగుటకు తోడ్పడ్డ విద్యాశాఖా మంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావు అభినందనీయులు।

భారతదేశంలోని ఉత్తర దక్షిణప్రాంతాలకు మేలుకలయిక అయిన హైదరాబాదు నగరం యీ వారం రోజులు నూతన శోభను సంతరించు కొన్నది; ఈ మహాసభలలో మనరాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పాల్గొనుట గమనార్హం. ఇది నిజంగా తెలుగు ప్రజలకు సరైన గుర్తింపు అని చెప్పక తప్పదు. భారత స్వాతంత్ర్యోద్యమంలో నవభారత నిర్మాణంలో, కేంద్రంలో సుస్థిర ప్రభుత్వ నిర్మాణంలో తెలుగు వారు ప్రముఖపాత్ర వహించారు; ఇది చరిత్రకారులు, భారత ప్రజలు మరువలేని నగ్నసత్యం.

కేంద్రంలో రాష్ట్రపతిగానూ, ఉప రాష్ట్రపతిగానూ, స్పీకరుగానూ, కేంద్రమంత్రులుగానూ, సహాయ మంత్రులుగానూ, డిప్యూటి మంత్రులుగానూ, గవర్నర్లుగానూ, పెక్కు ఉన్నత పదవులు చేపట్టి తెలుగు జాతి కీర్తి ప్రతిష్ఠలను దేశం, ప్రపంచం నలు మూలలా విస్తరింపచేశారు. చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ పెక్కు నదులతో, నదీ ప్రాజెక్టులతో వ్యవసాయ రంగంలో భారత దేశానికే తల మానికమై, అన్నపూర్ణయని పేరు తెచ్చుకొన్నది. దీనికి తెలుగు వారంతా గర్వించాలి. అదే కాకుండా విశేష సముద్రతీరంగల మనరాష్ట్రం, సముద్రయానానికీ, వ్యాపారానికీ ఎంతో ఉజ్వల భవిష్యత్తు కలిగి ఉన్నది.

మన రాష్ట్రంలో ఉన్న సహజ సంపదలను వెలికితీసి, వానిని పూర్తిగా సద్వినియోగం చేసిననాడు మన రాష్ట్రం పారిశ్రామికంగా

కూడా అభివృద్ధిచెంది మన తెలుగు వారి ఆర్థిక సంపదలు పెరగ గలవు. దీనికి తెలుగు వారంతా కలసి మెలసి అన్నదమ్ముల వలె కష్ట పడి కృషి చేసిననాడు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయిక, పారిశ్రామిక, ఆర్థిక రంగాలలలో అన్ని రాష్ట్రాలకన్నా ముందుండ గలదు.

మహాసభల సందర్భంగా జంట నగరాలు రంగు రంగుల తోరణాలతో, బ్రహ్మాండమైన ఆర్చీలతో కన్నుల పండువుగా కన్పించాయి. కాకతీయ నగర్‌లో సభాస్థలికి వెళ్ళే ఏడు మార్గాలను తెలుగు నాట మహాకవులు నన్నయ, పోతన, పెద్దన, వేమన, రామదాసు, మొల్ల, సరోజినీ నాయుడుల పేర్లతో ద్వారాలు నిర్మించారు. మహాసభల్లో గోష్ఠులు, చర్చలు, సమ్మేళనాలు జరిపేందుకు గాను పదివేల మంది కూర్చోవటానికి వీలుగా "నాగార్జున పీఠం" నిర్మించారు

లాల్‌బహదూర్ స్టేడియం లోపలి భాగంలో 12 అడుగులఎత్తు గల 47మంది నాయకుల భారీ కట్ అవుట్ల అలంకరణ యీ సభలకు ప్రత్యేక వన్నె తెచ్చినది. తెలుగు మహాసభలు అపూర్వ ఉత్సాహ సంరంభాల మధ్య ఉగాది పర్వదినాన కుమారి టంగుటూరి సూర్య కుమారి ప్రార్థనతో ప్రారంభమయ్యాయి. మన ఉప రాష్ట్రపతి శ్రీ బి డి. జెట్టి ప్రారంభోపన్యాసం చేస్తూ తెలుగుభాష ప్రాచీనమైన దనీ, యీ సభలు తెలుగు భాషా సంస్కృతులకు మరింత బలం చేకూర్చగలవనీ ఆశాభావం వెలిబుచ్చారు.

మహాసభలకు ముందు చార్మినార్ నుండి కాకతీయ నగరం వరకు అపూర్వమైన బ్రహ్మాండమైన ఉరేగింపు జరిగింది. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను, తెలుగు చరిత్ర వైశిష్ట్యాన్ని ప్రతిబింబించే రీతిగా ఒకమైలు పొడుగున క్రిక్కిరిసిన జనంతో ముఖ్య మంత్రి శ్రీ జలగం వెంగళరావు నాయకత్వాన సాగిన ఉరేగింపు తెలుగు జాతి ఘనత చాటిచెప్పేదిగా వుంది.

ఈ మహాసభలకు మన తెలుగు సినిమా పరిశ్రమ అంతా తరలి వచ్చిందా అన్నట్లు మన సినీ కళాకారులంతా యీ కార్యక్రమాల్లో పాల్గొని ఆనందపర్చారు.

మన రాష్ట్రపతి శ్రీ ఫకృద్దీన్ అలీ అహమ్మద్ చిట్టచివర రోజున ప్రసంగిస్తూ ద్రవిడ, ఆర్యభాషల మేలుకలయిక తెలుగు భాష అని వర్ణించారు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నకవులు, పండితులు, గాయకులు, ఇంకాపలురంగాలలో విశేషకృషి చేసిన పెద్దలేకాకుండా విదేశాలనుండి సుమారు 106 మంది ప్రతినిధులు పాల్గొని మహాసభల విజయానికి తోడ్పడ్డారు.

మన కేంద్రమంత్రులు శ్రీయుతులు కొత్త రఘురామయ్య, నూరుల్ హసన్, జి.వెంకటస్వామి,ఐ.కె. గుజ్రాల్, అఖిల భారత కాంగ్రెసు, కార్యదర్శిపి.వి నరసింహారావు. గవర్నర్లు మర్రి చెన్నారెడ్డి, నవాబ్ ఆలీ యావర్ జంగ్, యస్. ఓబులరెడ్డి, అక్బర్ అలీఖాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆవుల సాంబశివరావు, బెజవాడ గోపాలరెడ్డి, వావిలాల గోపాలకృష్ణయ్య. యన్. జి. రంగా మన మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, అధికారులు, అనధికారులు పాల్గొని సభలను దిగ్విజయంచేశారు.

వివిధ రంగాలలో విశిష్టమైన సేవచేసి ప్రసిద్ధికెక్కిన ప్రముఖ తెలుగు వారిని యీ మహాసభల సందర్భంగా సన్మానించడం, వారి సేవలను కొనియాడడం యీ మహాసభలకు మరింత అందాన్నీ, నిండుదనాన్నీ, అర్థాన్నీ యిచ్చాయి రెండు వందలకు పైగా తెలుగు ప్రముఖులను యీ విధంగా సన్మానించారు. కవులు, పండితులు, సంగీతవేత్తలు, చిత్రకారులు, రాజకీయవేత్తలు, శాస్త్రజ్ఞులు, సాంఘిక కార్యకర్తలు, పాత్రికేయులు, నటులు యింకా ఎన్నెన్నో రంగాలకు సంబంధించిన ఎందరెందరో మహానుభావులకు వారి కృషికి తగిన గుర్తింపుగా సన్మానాలు జరిగాయి. చలన చిత్ర రంగంలో ఒకనాడు దేదీప్యమానంగా వెలిగి ప్రేక్షకలోకాన్ని ఆనందింపజేసి నేడు మరుగు పడిపోయిన సుప్రసిద్ధ నటీనటులను గుర్తించుకుని సన్మానించడం యీ సభల అందాన్ని యినుమడింపజేసింది

దేశ విదేశాలనుంచి, రాష్ట్రంలోని మూలమూలల్నుంచి విచ్చేసిన ప్రతినిధులతో, చూడవచ్చిన ప్రేక్షకులతో ఆ వారం రోజులూ ప్రపంచతెలుగు మహాసభలు కన్నుల పండువుగా, వీనుల విందుగా మహావైభవోపేతంగా జరిగాయి. ఆ వైభవ దృశ్యాలను దీని తరువాత ప్రచురించిన ఫొటో పేజీలలో చూడవచ్చు:

[మొదటి పేజీలో : చార్మినార్ నుంచి కాకతీయనగర్ వరకు ముఖ్యమంత్రి నాయకత్వంలో జరిగిన బ్రహ్మాండమైన ఊరేగింపు, జనసందోహ దృశ్యాలు

రెండవ పేజీలో : కాకతీయనగర్‌లో ముఖ్యమంత్రి పతాకావిష్కరణ, శాతవాహన నగర్‌లో తరతరాల తెలుగుజాతి వైభవం ప్రదర్శనకు గవర్నరు ప్రారంభోత్సవం దృశ్యాలు.

మూడవ పేజీలో : నాగార్జున పీఠంలోజరిగిన వివిధ గోష్ఠులలో శ్రీయుతులు పి. వి. నరసింహారావు, జలగం వెంగళరావు, ఆరుద్ర, యస్వీ జోగారావు, సి నారాయణరెడ్డిగార్లు ప్రసంగిస్తున్న దృశ్యాలు.




నాలుగు, ఐదు పేజీల్లో: మహాసభలకు ఉపరాష్ట్రపతి శ్రీ బి.డి. జెట్టి ప్రారంభోత్సవం, రత్నపాప, వేదాంతం సత్యనారాయణశర్మల నృత్యాలు, హాజరయిన అసంఖ్యాక జనసమూహం, ప్రారంభోత్సవ గీతం పాడిన కుమారి టంగుటూరి సూర్యకుమారి.

ఆరవ పేజీలో : శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి, శ్రీమతి న్యాపతి కామేశ్వరి, శ్రీయుతులు గోరాశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, అజిత్‌పాల్ సింగ్, ఎన్. భగవాన్‌దాస్‌ల సన్మాన దృశ్యాలు.


ఏడవ పేజీలో : శ్రీమతి మాలతి, శ్రీ సి. హెచ్. నారాయణ రావు, కుమారి టంగుటూరి సూర్యకుమారి, శ్రీమతి శాంత కుమారి, శ్రీమతి పుష్పవల్లి, శ్రీమతి కాంచన మాల, శ్రీయుతులు అక్కినేని నాగేశ్వరరావు, ఎన్. టి. రామారావుల సన్మాన దృశ్యాలు.


ఎనిమిదవ పేజీలో : కుమ్మరి మాస్టారి బుర్రకథ, అల్లూరి సీతారామరాజు నాటిక, సుశీల, బాలసుబ్రహ్మణ్యం పాట కచేరీ, ఈమని శంకరశాస్త్రి వీణావాయిద్యం,యామినీ కృష్ణమూర్తి నృత్యదృశ్యాలు.]



WORLD TELUGU CONFERENCE
ప్రపంచ తెలుగు మహాసభలు







తొలిరోజు దృశ్యాలు















ప్రముఖులకు సత్కారాలు




































గోష్ఠులు














సినీకళాకారులకు సన్మానం




















సాంస్కృతిక కార్యక్రమాలు





తెలుగు: అధికార భాష



—శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య

భారతదేశంలో నడచిన స్వాతంత్ర్యోద్యమంలో ఇరవైయవ శతాబ్దం మొదటి పది సంవత్సరాలలో భాషోద్యమానికి ఆంధ్రావని లోని ప్రజలు వైతాళికులైనట్టే భారత స్వాతంత్ర్యానంతరం భాషా ప్రయుక్త రాష్ట్ర నిర్మాణం సాధనలోనూ ప్రథములు అయినారు.

ప్రజాస్వామ్యంలో ప్రజలు తమ పరిపాలనను, బోధనను, తమ మాతృభాషలో సాగించవలెననడం సహజం ఈ సహజ వాంఛతోనే భాషా రాష్ట్ర ఉద్యమాలు సాగించబడినవి. ఆంధ్రోద్యమ ఆశయాలలో ఒకటిగా ఉన్న ఆంధ్ర విశ్వవిద్యాలయం 1926లో యేర్పడినప్పుడు ఆ శాసనంలో ఆంధ్ర విశ్వకళాపరిషత్తు శాసనం తెలుగులో బోధన, పరీక్షలు తమ ఆశయమని నిర్దేశించడం ఇందుకు నిదర్శనం. ఆశయంగా శాసనంలో నిర్దేశించడమే జరిగిందికాని అమలుజరపడం మాత్రం జరుగలేదు.

తెలుగు జిల్లాలు ఆనాటి సంయుక్త మద్రాసు రాష్ట్రంలోను, అట్లే ఆనాటి హైదరాబాదుసంస్థానంలోను, ఈ రెంటిని ఆనుకొని ఉన్న ఇతర రాష్ట్రాలలో ఆంధ్ర ప్రాంతాలున్నవి. 1948లో సంయుక్త మద్రాసు రాష్ట్రంలోను, 1952లో ఆనాటి హైదరాబాదు రాష్ట్రంలోను కొన్ని జిల్లాలలో కొన్ని స్థాయిలలో ప్రాంతీయ భాషలను అధికార భాషలుగా ప్రభుత్వాలు నిర్ణయించడం, మద్రాసు రాష్ట్రంలో తూర్పుగోదావరి జిల్లాలోనూ, హైదరాబాదు సంస్థానంలో తెలంగాణా జిల్లాలలో కొన్నింటిలోనూ అమలు జరుపుటకు ప్రకటనలు జరిగినవి.

1950లో భారత రిపబ్లిక్ అవతరణ అనంతరం, 1953 అక్టోబరు ఒకటవ తేదీన ప్రథమ భాషాప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్ర అవతరించింది. 1966లో భారతదేశం అంతటా భాషా ప్రయుక్త రాష్ట్రాలుగా పునర్వ్యవస్థీకరణ జరగడం, తెలంగాణా జిల్లాలనుకూడా కలిపి ఆంధ్రప్రదేశ్ అవతరించడం జరిగింది.

ఆనాడు ఏర్పడిన భాషా రాష్ట్రాలు అంతకుముందు ఆ యా ప్రాంతాలలో కలిసివున్న భాషా ప్రాంతాలు తమతమ భాషలను అధికార భాషలుగా నిర్దేశిస్తూ శాసనాలు చేశాయి. ఆంధ్ర రాష్ట్ర శాసన సభ 1955 సెప్టెంబరులో 29న తెలుగును అధికారభాషగా అమలు జరుపవలెనని తీర్మానించింది. 1959లో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు అధికారభాషగా అమలుజరుపుటకు యేయే స్థాయిల్లో యేయే శాఖలలో విస్తరించవలెనో పరిశీలన చేయుటకు ఒక ప్రత్యేక అధికారిని నియమించి, అందుపై ప్రజలతో ఎక్కువ సంబంధంగల 31శాఖలలో తెలుగును అధికారభాషగా ప్రవేశపెట్టుటకు ప్రభుత్వం అంగీకరించి 1960లో ప్రకటన చేసింది. ఈ ప్రయత్నానికి సహకారిగా వుండుటకు అనువుగా ఆంధ్రప్రదేశ్ శాసన మండలి తెలుగు పదకోశాన్ని ఇంగ్లీషు మాటలను సమకూరుస్తూ ప్రకటించింది

అధికారభాష శాసన రూపం దాల్చవలెననే ప్రయత్నం 1955 నుండి సాగినా చివరకు 1966లో శాసనం అయింది.

సమీక్షా సంఘం సూచనలు

అంతవరకు జరిగిన పనిని సమీక్షించేందుకూ, జరుగవలసిన పనిని సూచించేందుకూ ఒక సమీక్షా సంఘం నియమింపబడడం, అది రెండు సంవత్సరాలు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలు పర్యటించి తమ నివేదిక సమర్పించడం జరిగింది. అందులో అప్పటికున్న తాలూకా స్థాయిలో మాత్రమేగాక జిల్లాస్థాయిలోనూ, రాష్ట్రస్థాయిలోనూ వెంటనే అమలు జరిపే ప్రయత్నం సాగించవలెనని, శాసన మండలి కూడా వర్తించవలెనని, ముద్రాలేఖినులను [టైపు రైటరులు] అధికంగా తయారు చేయించి అన్ని ఆఫీసులకు అందించ వలెననీ, లినోటైపుకూడా అమర్చి ముద్రణ సౌకర్యం పెంచవలెననీ, తెలుగు రాని సిబ్బందికి తగు శిక్షణ అవకాశాలు కలిగించవలెననీ, ప్రభుత్వ ఉద్యోగాలలో పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్వహిస్తున్న పరీక్షలలో, 1.2.3, గ్రూపులలో తెలుగు భాషకు అవకాశం యివ్వవలెననీ, తెలుగు బోధనా భాషగా చదివిన వారికి ఉద్యోగాలలో ప్రాధాన్యత యిస్తూ అవకాశాలు కలిగించవలెననీ, అధికార భాష నిర్వహణకు సాధారణ పరిపాలనాశాఖలో ప్రత్యేక విభాగం యేర్పాటు చేయవలెననీ, శాసనంలో ఉదహరించిన అధికార భాషా కమీషన్ను యేర్పాటు చేయవలెననీ ఈ సమీక్షా సంఘం సూచించింది. అధికార భాషా శాసనం క్రింద వివిధ శాఖలలో, వివిధ స్థాయిలలో అధికార భాషగా తెలుగును అమలు జరుపుటకు తగు ప్రకటనలు అప్పుడప్పుడు ప్రభుత్వం చేసింది.

అంతేకాకుండా కేంద్రప్రభుత్వం కూడా భాషా విధానంపై పార్లమెంటు చేసిన తీర్మానాన్ని 1968 జనవరి 18వ తేదీన తమ తీర్మానంగా ప్రకటించింది.

అందులో ప్రాంతీయభాషల గురించి ఈ విధంగాచెప్పారు:–

(2) భారత రాజ్యాంగంలోని ఎనిమిదవ అనుబంధంలో పేర్కొనబడిన భారతీయ భాషలన్నింటి సంపూర్ణ వికాసానికి నిర్దిష్ట చర్యలు తీసుకోవడం దేశంయొక్క విద్యా సాంస్కృతిక అభివృద్ధికి ఆవశ్యకం కనుక హిందీతోపాటు ఇతర భారతీయ భాషలు సంపన్నములై ఆధునిక విజ్ఞాన ప్రసారానికి పటిష్టములైన సాధనాలయ్యేటట్లుగా వాటి సమగ్ర వికాసానికి భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి ఒక సమగ్ర పథకాన్ని రూపొందించి అమలు జరుపాలి.

4. (బి) రాజ్యాంగంలోని ఎనిమిదవ అనుబంధంలో పేర్కొనబడిన అన్ని భారతీయభాషలు మరియు ఇంగ్లీషు, అఖిల భారత సర్వీసులలోను, కేంద్ర ఉద్యోగాలలోను నియామకాలకై ఎన్నిక చేయడానికి ప్రత్యామ్నాయ బోధనాభాషగా అనుమతింపబడాలి. భావి పరీక్ష విధానం ఎలావుండాలి, ఎంత కాలంలో జరగాలి, ఏవిధంగా జరగాలి అనే విషయాలలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ సలహాగైకొని ఇది అమలు జరుపబడాలి

గతంలో అధికార భాషగా తెలుగు :

తెలుగు అధికారభాషగా నడచిన చరిత్రను పరికిద్దాం. సుమారు వెయ్యి సంవత్సరాలనాడు అంటే తూర్పుచాళుక్యుల పరిపాలన ప్రారంభంనుండి విజయనగర రాజుల పాలన అంతమైన 17 శతాబ్దివరకు తెలుగు అధికారభాషా స్థానాన్ని పొందిందని చెప్పవచ్చు.

వేంగీచాళుక్యులు పశ్చిమ ఆంధ్రప్రాంతం పాలించిన 500–800 సంవత్సరాలలోసంస్కృతం, తెలుగు, కన్నడం భాషలు వాడినారు. ఆనాటి చోళులు తీరప్రాంతం పాలించిన 1000–1200లలో తెలుగు, సంస్కృతం వాడుకలోవుంది. కాకతీయులు తెలంగాణా సమగ్రకోస్తా ప్రాంతం పాలించిన 1100–1330 సంవత్సరాలలో తెలుగు అధికార భాషగా, రాజభాషగా అమలుజరిగింది.

వెలనాటి చోళులు కృష్ణా, గుంటూరు జిల్లాలు పరిపాలించినపుడు తెలుగు, కొద్దిగా సంస్కృతం భాషలు వాడారు. రెడ్డిరాజులు తీరప్రాంతాన్ని 1330–1450 పాలించినపుడు ముఖ్యంగా తెలుగు, అపుడపుడు సంస్కృతం రాజభాషగా అమలుజరుపుతూ వచ్చారు. రేచర్ల వెలమలు తెలంగాణా పాలించిన 1330–1458 సంవత్సరాలలో తెలుగును రాజభాషగా అమలు జరిపారు. విజయనగర రాజులు రాయలసీమ, కొంతకొంత కోస్తా ప్రాంతాలలో పరిపాలన సాగించినపుడు తెలుగు, కన్నడం, వాటితోబాటు సంస్కృతం, తమిళం వాడుతూవచ్చారు. బహమనీ రాజుల కాలంలో తెలంగాణాలో 1336 నుండి 1578 సంవత్సరాలలో పర్షియన్ భాషను, అరబ్బు భాషలను ఉపయోగిస్తూవచ్చారు. గజపతులు కోస్తాజిల్లాలలో 1458–1518 సంవత్సరాలలో తెలుగు సంస్కృతం భాషలు వాడుతూ వచ్చారు. కుతుబ్‌షాహి సుల్తానులు తెలంగాణా ఉత్తర తీర ప్రాంతాలు,రాయలసీమ–అంటేదాదాపు నేటి ఆంధ్రప్రదేశ్ అంతటా 1518 నుండి 1700 వరకు తెలుగు, పర్షియన్, అరబ్బీ భాషలు వాడుతూ వచ్చారు. ఆంధ్ర ప్రభుత్వం ఏర్పడిన తరువాత మద్రాసు రాజధానిలో వున్న యావదాంధ్ర జిల్లాలలో ఆంగ్లం, తెలుగు, ఉర్దూ భాషలు ఉపయోగిస్తూ వచ్చారు. తెలంగాణాలో నైజాం సుల్తానులు ఉర్దూ, తెలుగు, ఆంగ్ల భాషలు వాడుతూ వచ్చారు. ఆంగ్ల ప్రభుత్వం సర్కారు, రాయల సీమ జిల్లాలలో ఇంగ్లీషు, తెలుగు భాషల్లో పరిపాలన సాగించారు. అనుదినం ఇంగ్లీషు ప్రాధాన్యత హెచ్చించారు. 1946–47 లో తూర్పు గోదావరి జిల్లాలో, 1950–52లలో తెలంగాణాలోను తెలుగును తాలుకా స్థాయిలోఅమలు జరుపు ప్రయత్నం జరిగింది. తెలుగు మరుగు పడకపోయినా తెలుగు మరుపు తగిలేంత వరకు ఇంగ్లీషును సాగించారు. 1953 అక్టోబరు 1న ఆంధ్రరాష్ట్రం అవతరించింది. కొంత ఇంగ్లీషులోనే సాగింది. కొంత తెలుగుకు అవకాశం ఉండేది. 1956లో ఆంధ్ర ప్రదేశ్ అవతరణ జరిగింది. ఉర్దూ బదులు తెలంగాణాలోకూడా ఇంగ్లీషు వాడుక చేయబడింది. అధికార భాషగా ఉర్దూ బదులు తెలుగు కావలెనని తపస్సుచేస్తున్న తెలంగాణాలోనూ, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావలెనని సాధించుకున్న సర్కారు రాయలసీమ జిల్లాలలోనూ అధికార భాషగా తెలుగు అడుగు అరలలో సజీవంగా బ్రతుకు సాగించింది.

కేంద్ర ప్రభుత్వం వివిధ ప్రాంతీయ భాషల విషయంలో ఈ విధంగా చేసివున్నా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అందుకు సంబంధించి శాసనం చేసివున్నా, ప్రకటనలు చేసివున్నా అమలు జరగడం మాత్రం అంతమాత్రంగానే సాగించి, రాష్ట్రపతి పాలనలో కమిషన్ను నియమించే విషయం ప్రస్తుతానికి లేదనీ, ప్రత్యేక విభాగం యేర్పాటు చేయవలసిన అవసరం కనుపించడం లేదని అద్వయి జర్లు ది. 7–8–1973 న తేల్చి వేశారు.

నిర్మాణాత్మక చర్య :

అయితే, అటుతరువాత శ్రీ జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా యేర్పడిన ప్రస్తుత మంత్రి వర్గం తెలుగును అధికార భాషగా తాలూకా, అంతకన్నా క్రింది స్థాయిలలోవున్న అన్ని కార్యాలయాలలోను విధిగా తెలుగును అధికార భాషగా అమలు జరుపుటకు నిశ్చయించి, ప్రజలలో అందుకు తగిన ఉత్సాహం కల్పించుటకు ఆనంద సంవత్సరాది తెలుగు ఉత్సవాలతో ప్రారంభించారు. దీనితో బాటు అధికార భాషా సంఘము [కమీషను]ను శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య అధ్యక్షుడిగా, శ్రీ యన్. శ్రీనివాసులు రెడ్డి యం. యల్. ఎ.; శ్రీమతి టి. యస్. అనసూయమ్మ, యం. యల్. ఎ.; శ్రీవి పి. రాఘవాచారి, యం. యల్. సి.; శ్రీ తులాబందుల నాగేశ్వరరావులు సభ్యులుగా నియమించడం, ఉగాది నుండి కార్యరంగంలో పని సాగించడం జరిగింది.

కోడ్‌లు, మాన్యుయలులు, స్టాండింగు ఆర్డర్లు ప్రభుత్వపు ఉత్తర్వులు వెంట వెంటనే తెలుగులో అనువదించితే క్రింది కచేరీలలో శ్రమ తగ్గుతుందని జిల్లాలలో కోరారు. ఆ విధంగా

వాటిని అనువదించుటకు, శాసన సభలో చేయబడిన బిల్లులు ఇంగ్లీషులో శాసనాలుగా ప్రకటించిన వెంటనే తెలుగు శాసన ప్రతులు కూడా ప్రకటించుటకు యేర్పాట్లు చేస్తూ జీ ఓ లు కూడా జారీ చేయబడినవి. ఈ అనువాదాలు అధికార పూర్వకంగా వుండకపోయినా సమాచారానికి ఉపయోగపడుతవి. వాటిని ప్రజలు ఉపయోగించుకోవడానికి అనువుగా వుంటవి. జీ ఓ. లు జారీచేసిన వెంటనే తెలుగులోనికి అనువాదం చేయబడి రెండూ ఒకేసారి ప్రకటింపబడుటకు ప్రభుత్వం ఉత్తర్వు ఇచ్చింది కూడా. ఇవి కొంత సౌకర్యం కలిగించవచ్చు.

తెలుగు టైపురైటర్లు కావలసివున్నవి. ఇపుడు 120 కలవు. ఇవి కాక రానున్న ఏప్రిల్ లోగా 500, తరువాత సంవత్సరం 501 కొనడానికి ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయబడినవి

ఇక పరి భాష విషయం : అధికార భాష అమలు జరుపుటలో యిబ్బందులు రెండుగా తెలియ జేశారు. పరిభాష విషయం ఒక మాట చెప్పవలసి వుంది. వెంటనే ఇంగ్లీషు పదానికి తెలుగు పదం తెలియకపోయినా, స్ఫురించకపోయినా తెలుగు వాక్యాలలో ఇంగ్లీషు మాటను తెలుగుఅక్షరాలలో వ్రాయవచ్చు. తాత్కాలికంగా అంటే అలవాటు పడేవరకు, స్ఫురణకు వచ్చేంత వరకు—దీనికితోడు వివిధ జిల్లాలలో ఒక పదానికి వేరు వేరుగా వాడుక పదాలున్నవి జిల్లాలలోనూ, అన్ని ప్రాంతాలలోను వాడబడేపర్యాయపదాలు ప్రాంత ప్రాంతానికి మారవచ్చు. కాని అవి మరుపుతగలడం కాని, మరుగు పడడం కాని జరిగితే భాష అభివృద్ధికాదు సంపన్నం సమగ్రంకూడా కాజాలదు. అందువల్ల భాషకు తీరని నష్ట సంభవిస్తుంది. అందుకే ప్రతి ప్రచార శాఖలోని వారు నేడు వాడుచున్న ఇంగ్లీషు పదాల జాబితా తయారు చేసుకొని వాటికి యే ప్రాంతాలలో యే యే పదం వాడుతున్నారో ఇంకా దానికున్న పర్యాయ పదాలు కూడా సేకరించి పంపవలసిందిగా జిల్లా అధికారులను, క్రింది అధికారులను పెద్దలను పిన్నలను భాషాభిమానులను కోరడం జరిగింది. ఇపుడు కూడా కోరుతున్నాం. ఆ విధంగా వివిధ ప్రాంతాల నుండి వివిధ కార్యాలయాలవారు పంపిన పదజాలం—ఈ నాడు క్రోడీకరణ జరుగుతున్నది. ఇవి మాత్రమే కాకుండా ఇంకా రావలసివున్నవి. ఇవి అన్నీ సమకూర్చుకొని ఈ నాడు వాడుకలోవున్న పద పారిజాతం పది సంవత్సరాల క్రితం తయారు చేసినందున అలవాటు వల్ల వాడుక వల్ల, తెలుగు అధికార భాషగా వస్తున్నదన్న ఆసక్తి వల్ల ఇంటర్ మీడియట్ నుండి తెలుగు బోధనా భాషగా 1969 నుండి సాగింపబడుతున్నందువల్ల పలు పదాలు ప్రయోగంలోకి వచ్చినవి. తెలుగు పదాల గురించి తెలుగు అకాడమీ వారు కరీంనగర్, కడప గుంటూరు జిల్లాలలో జరిపిన విస్తృత పరిశీలన వల్ల అనేక మాటలు ప్రజా బాహుళ్యపు నుడికారం నుండి బయట పడుతున్నవి. వీటి అన్నింటినీ సమగ్రంగాను, శాఖల వారీగాను కర్ణాటక. తమిళనాడు ప్రభుత్వాలు తమ తమ భాషలలో ప్రచురించినట్లు సంగ్రహంగానూ చిన్న పుస్తకాలుగా ప్రచురింపవలసిన అవసరంవుంది. అందుచేత తెలుగు దేశంలోని నాలుగు చెరుగుల నుండి సామాన్యజనం అనుదినం వాడుకుంటున్న నిత్య జీవితరంగం లోని వ్యవహారంలో కలిసిపోయిన వివిధ అన్య భాషా పదాలకు సరితూగగల పదాలు ఏరి కూర్చి ప్రచురించవలసి వుంది. అంతేకాకుండా తెలుగు భాష ఇంతవరకు సాహిత్యభాషగా మాత్రమే వుంది. బోధనా భాషగా ప్రవేశ పెట్టడంతో బోధనలో రావలసిన శాస్త్రీయ, సాంకేతిక రంగాలకు కూడా సరిపడగల తెలుగు పదాలు లభించినంతవరకు సమకూర్చుకోవలసి వుంది. అధికార భాషగా అమలు జరుపుకోవడంలో నిత్య వ్యవహారంలో వాడుతున్న తెలుగు పదాలు జనసామాన్యంలో వాడుతున్న పదజాలం సమీకరింపబడి గ్రంథస్థం—ఒక నిఘంటువుగాని, పారిభాషిక పదకోశంగాని, పరిపాలనా పదపారిజాతం గాని తయారు కావలసి వుంది అప్పటికే వాడుకలో పడిపోయిన రేడియో, రైలు, తహసీలు, జమాబంది మున్నగు వాటివి తెలుగులోకి వాడుకోవడంవల్ల భాష సంపన్నం అవుతుంది.

అధికార భాషగా తెలుగువాడకం

ఆనంద నామ సంవత్సర ఉగాది పండుగనాడు అఖిల భారత తెలుగు సాంస్కృతిక మహాసభలు జరిపి తాలూకాస్థాయిలో, అన్ని కార్యాలయాల్లోను అధికార భాషగా తెలుగును అన్వయింపుతూ ప్రకటించడం జరిగింది. యీ ఉగాదికి జిల్లా స్థాయిలోను, వచ్చే ఉగాదికి రాష్ట్ర స్థాయిలోను సంపూర్తిగా అన్వయింప బడుతుందని ప్రకటనలు జరిగినవి. ఈ ఉగాది ప్రపంచ తెలుగు మహాసభ జరుపుకున్నది. అయిదుకోట్ల ఆంధ్రులు ప్రపంచ తెలుగు మహాసభ జరుపుకొని, జిల్లా స్థాయి, ఆ పైన రాష్ట్ర పీఠం అధివశిస్తుందని ఆశిస్తున్నారు. అది జరగడం అవసరం

అన్ని ఉద్యమాలలో, అన్ని త్యాగాలలో, మాతృదేశాభిమానంలో ముందుండి నాయకత్వం వహించినట్లే భాషా ఉద్యమంలో బోధనా భాషగా తెలుగును అమలు జరుపుటకు పాలనలో కూడా ముందుండి ఆంధ్ర ప్రదేశ్ పేరులోనేగాక, పాలనలో, బోధనలో కూడా తెలుగు అమలును జరుపుతూ దేశ భాషలందు తెలుగు లెస్స అని ఋజువు చేద్దాం.

> "జారిన దేశగౌరవము చక్కన దిద్ది మహాంధ్రమండలీ
> భారము శ్లాఘనీయముగ పాలనచేసి సమానరాష్ట్రముల్
> కూరిమినాసజేయ తెనుగుం బుడమిన్ గయిసేయరయ్య, దీ
> క్షారతి నాంధ్ర పుత్రులు జగజ్జనధర్మము దృష్టినిల్పుచున్."

తెలుగు పతాకం యెగురని దిశయే లేదు
తెలుగు దివ్వె వెలుగనట్టి నిశయే లేదు
తెలుగు పులుగు చేరలేని దేశం లేదు
తెలుగు వెలుగు దూరలేని కోశం లేదు

—దాశరథి

మహాభారతము

శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

85

సావిత్రీ సత్యవంతుల ఆశ్రమగమనము

"ఆ మాటలు వినిన తోడనే సావిత్రి లేచి, కొప్పు ముడుచుకొని, పతిని గట్టిగా పట్టుకొని తన బాహువులతో ఎత్తి నిలబెట్టెను. సత్యవంతుడు లేచి, అవయవముల దుమ్ము తుడుచుకొని, అన్ని దిక్కులు చూచి పండ్లబుట్టను చూచెను. అది చూచి సావిత్రి 'రేపు ఉదయము వచ్చి ఈ పండ్లబుట్టను తీసికొని పోవచ్చును. నీ సంరక్షణార్థమై నేను ఈ గొడ్డలిని ధరించి నీవెంట నడచెదను' అని చెప్పి, పండ్లబుట్టను చెట్టుకొమ్మకు వ్రేలాడగట్టి గొడ్డలి తీసికొని భర్తవద్దకు వచ్చెను. ఆమె తన యెడమ భుజమునందు భర్త భుజమును ఉంచుకొని కుడి భుజముచేత ఆయన నడుమును బట్టుకొని బయలు దేరెను." అట్లు పోవుచున్న సావిత్రిని చూచి సత్యవంతుడిట్లనెను:-

"ప్రియే! ఇక్కడికి నేను మాటి మాటికి వచ్చుచుందును. కాబట్టి యిక్కడి మార్గములన్నియు నాకు సుపరిచితములే. చెట్ల మధ్యనుండి భూమిపైన బడు వెన్నెల వలనగూడ నేను మార్గమును చూడగలుగు చున్నాను. ఇది మనము పండ్లు కోసికొనుచు వచ్చినప్పటి త్రోవయే వచ్చిన త్రోవనే అనుసరించి పొమ్ము. విచారించకుము. మోదుక చెట్లు ఉన్న యీ వనమునందు త్రోవ రెండుగా చీలి పోవును. అక్కడ ఉత్తరదిశగా పోవు మార్గమును బట్టి పొమ్ము. నాకు ఆరోగ్యము-శక్తి యున్నవి తలి దండ్రులను చూచుటకు తొందర పడుచున్నాను.త్వరగా నడువుము.

"ఇట్లు చెప్పుచు పోయి సత్యవంతుడు త్వరలోనే ఆశ్రమము చేరుకొనెను" అని చెప్పి మార్కండేయ ముని తరువాతి కథ ఇట్లు చెప్పదొడగెను.

ద్యుమత్సేనుని చింత

"యుధిష్ఠిరా! ఇంతలో ద్యుమత్సేనునకు కన్నులువచ్చి అంతా స్పష్టముగా కనపడెను. అతడు తన భార్య 'శైబ్య'తో నచటి యాశ్రమములన్నియు తిరిగి యెక్కడ గూడ పుత్రునిగానక మిక్కిలి దుఃఖించెను. అనేకాశ్రమములకు, నదులకు, వనములకు, సరస్సులకు వారు పోయి ఆ రాత్రి పుత్రుని వెదకుచు తిరిగిరి. దారియందు ఏ ధ్వని విన్నను వారు, సావిత్రి సత్యవంతులు వచ్చుచున్నారనియే యనుకొని నిరాశచెందుచుండిరి. వారి పాదములు పగిలి, గాయపడి, నెత్తురు గారుచున్నప్పటికిని విడువక పుత్రునికై పడగెత్తి వెదకుచుండిరి. దర్భలు, ముండ్లు శరీరమునకు గ్రుచ్చుకొనగా బాధపడుచు నున్మత్తులవలె తిరుగుచుండిరి. అప్పుడు ఆశ్రమవాసులైన బ్రాహ్మణులు వారికడకు పోయి, వారియవస్థకు చింతిల్లి, వారిని తిరిగి ఆశ్రమమునకు తోడ్కొని వచ్చిరి.

"ఆశ్రమమునందు ద్యుమత్సేనుడు భార్యతో గూడియుండి, ఆశ్రమవాసులు ఓదార్చుచు చెప్పుచున్న పూర్వరాజుల విచిత్రకథలను వినుచు శాంతిల్లిరి. కాని, పుత్రుని బాల్య వృత్తాంతమును తలచుకొనుచు మరల దుఃఖించిరి. 'హా పుత్రా! హా వధూ! ఎక్కడనున్నారు? అని బహువిధముల దుఃఖించిరి. ఆ సమయమునందు అక్కడి బ్రాహ్మణులు ఈ విధముగా ద్యుమత్సేనుని, శైబ్యాదేవిని ఇట్లు ఊరడించిరి :-

సువర్చుడు: తపస్సు-దమము-సదాచారము గలిగిన సావిత్రిని జూచి యామె ప్రభావముచేత, సత్యవంతుడు నిశ్చయముగా జీవించి యున్నాడని నేను స్పష్టముగా చెప్పగలను

గౌతముడు: నేను చతుర్వేదములను సాంగములుగా అధ్యయనము చేసినాను. గొప్ప తపస్సు చేసితిని. బ్రహ్మచర్యమును సవిధిగా పరిపాలించి, గురువులను, అగ్నులను సంతుష్టిపరచినాను. అన్ని వ్రతములను, వాయుభక్షణోపవాసాదులను చేసినాడను. నేనుచేసిన యీ తపోవ్రతాదుల ప్రభావముచేత ఇతరుల చర్యలను బాగుగా తెలిసికొనగలను. నా మాటను సత్యముగా మీరు నమ్ముడు నిశ్చయముగా సత్యవంతుడు జీవించియున్నాడు.

శిష్యుడు: మా గురువుగారు పైనచెప్పిన మాట లెప్పుడుగూడ అసత్యములు కాజాలవు. సత్యవంతుడు జీవించియేయున్నాడు.

ఋషులు: సావిత్రికి విధవాత్వమువచ్చు లక్షణములేవియు లేవు. కనుక అతడు జీవించియేయున్నాడు.

భారద్వాజుడు: దాల్భ్యుడు: సావిత్రియొక్క వ్రతాదుల బలము చేతను రాజా! నీకు తలచుకొనకుండ కన్నులు వచ్చుటచేతను, సావిత్రి నిద్రాహారాదులను విడిచి కఠోరవ్రతమును ఆచరించి యుండుట చేతను, నిశ్చయముగా సత్యవంతుడు జీవించియున్నాడని చెప్పవచ్చును.

ఆపస్తంబుడు :– ప్రసన్నమైన యీదిక్కునందు పక్షులు, మృగములు మాట్లాడుకొనుటను వినియున్నాను. ఇంతియేకాక, రాజోచిత ధర్మములను మీరు అనుష్ఠించియుండుటను చూచినాను, ఈ రెంటి ప్రభావము చేత నేను నిశ్చయముగా చెప్పగలను, సత్యవంతుడు జీవించియున్నాడు.

ధౌమ్యుడు. – నీ పుత్రుడు సత్యవంతుడు సమస్త సద్గుణభూషితుడు సర్వజన ప్రియుడు, దీర్ఘాయుష్య లక్షణములు గలవాడు కనుక తప్పక జీవించియున్నాడు.

"ఈ విధముగా సత్యవాక్కులు గల మునులందరు ఓదార్చగా ద్యుమత్సేనుడు, వారు చెప్పిన మాటలను గూర్చి తాను గూడ బాగుగా విచారించుచు శాంతపడి స్థిరచిత్తుడయ్యెను.

"అప్పుడు సావిత్రి సత్యవంతునితోపాటు వచ్చి సంతోష పూర్వకముగా ఆశ్రమమునందు ప్రవేశించెను. అప్పుడచ్చటి బ్రాహ్మణులిట్లనిరి :–

"ద్యుమత్సేన మహారాజా! నీ పుత్రుడు క్షేమముగా తిరిగి వచ్చెను, నీకు కన్నులు వచ్చెను, ఇట్టినిన్ను చూచి మేమందరము నీ యభ్యుదయమునకు సంతసించుచున్నాము, మేము చెప్పిన మాట సత్యమైనట్లు రుజువయ్యెను.

ఇట్లు చెప్పి వారందరు అక్కడ అగ్నిని ప్రజ్వలింప జేసి ద్యుమత్సేనుని వద్ద కూర్చొనిరి. శైబ్యాదేవి, సావిత్రీ, సత్యవంతులు వేరుగా నొకచోట నిలుచుకొనియుండిరి వారందరు ఆ మహాత్ముల అనుజ్ఞమేరకు శోకము వీడి యొకచోట కూర్చొనియుండిరి అప్పుడు వారందరు కౌతూహలము చేత సత్యవంతుని చూచి 'రాజకుమారా? ఇంత రాత్రియగు వరకు అడవిలో భార్యతో నేమి చేయుచుంటివి? నీకు ఏ యాటంకము కలిగెను? నీ తలిదండ్రులు, మేము మిక్కిలి సంతాపము చెందితిమి ఎందుకు మీకు ఇట్లైనదో సవిస్తరముగా తెలుపుము.' అనియడిగిరి, అప్పుడు సత్యవంతుడిట్లనెను:

"తండ్రి యాజ్ఞగొని నేను భార్యతో అడవికిపోయి కట్టెలు కొట్టుచుండగా నాకు విపరీతముగా తలనొప్పివచ్చెను అందుచేత చాలకాలము నిద్రించితిని అంతకుపూర్వమెప్పుడుగూడ నేను అంతసేపు నిద్రించి యుండలేదు మేము రానందువలన మీ కందరికి సంతాపము కలుగును గనుక అడవియందుండక చాల రాత్రియయినను ఆశ్రమమునకు వచ్చి మీ చింత మాన్పితిమి. ఇది దప్ప వేరు కారణము లేదు."ఆ మాటలు విని గౌతముడు ఇట్లనెను:–

"నీ తండ్రికి అకస్మాత్తుగా కన్నులు కనబడుటకు కారణము నీకు తెలియదు. సావిత్రికి తెలిసియుండును. ఆమె చెప్పగలదు. సావిత్రీ! నీవు భూత భవిష్యత్తులను తెలిసికొనగలదానవు. నీవు తేజస్సుచేత సాక్షాత్తు గాయత్రీ దేవివేయని మానిశ్చయము. నీవు దీనికి కారణమెరుగుదువు సత్యముగా నున్నదున్నట్లు చెప్పుము." ఆ విధముగా గౌతముడు అడుగగా సావిత్రి యిట్లు చెప్పదొడగెను.–

"మునీశ్వరులారా! నేను జరిగిన సంగతిని ఏమాత్రము దాచకుండ సత్యము చెప్పెదను. వినుడు. పూర్వము నారదుడు నా పతికి మృత్యువు వచ్చునని యొక గడవు చెప్పియుండెను. నేడు అతని మృత్యుదివసము గనుక అతనిని విడువకుండ వెంటనంటి యుంటిని అడవియందు సత్యవంతుడు తలనొప్పిచేత నా యొడి యందు నిద్రించుచుండగా, యమధర్మరాజు స్వయముగావచ్చి సత్యవంతుని పాశముతో బంధించి దక్షిణ దిక్కునకు పోవుటకు బయలు దేరెను."

"అప్పుడు నేను యమరాజును వెంబడించి, విశేషముగా స్తుతించితిని. అతడు నా స్తుతులకు సంతుష్టుడై నాకు అయిదు వరములనిచ్చెను అవి నా యత్తమామలకు కన్నులు వచ్చునట్లు శత్రుహస్తగతమైన వారి రాజ్యము లభించునట్లును రెండు వరములు; నా తండ్రికి నూర్గురు నాకు నూర్గురు పుత్రులు పుట్టునట్లు రెండు వరములు, నాకు, నాపతికి నాల్గునూర్ల సంవత్సరముల ఆయుష్యము కలుగునట్లు ఐదవవరము. ఇట్లు అయిదువరములను పొందితిని నా పతి యొక్క ప్రాణములను రక్షించుట కొరకే నేను అంతటి కఠోరమైన వ్రతమును ఆచరించి కృతకృత్యురాల నైతిని. నేను, జరిగిన వృత్తాంతమంతయు సవిస్తరముగా చెప్పితిని. మేము జాగు చేసి వచ్చిన కారణము ఇది యని మీరు ఇప్పుడు గ్రహించి యుందురు. నేను అనేక కష్టములను దుఃఖములను అనుభవించి నప్పటికి చివరకు సుఖమే పొందినందు చేత అది దుఃఖముగా భావించను"

"ఇట్లు సావిత్రి చెప్పిన వృత్తాంతమును విని ఋషులు 'పతివ్రతాశిరోమణీ! ద్యుమత్సేన మహారాజు కులము అనేక విపత్తులకు లోనై అంధకారమయమైన దుఃఖకూటమునందు కూరుకు మునిగిపోవు చుండెను. కాని సుశీలురాలు తపోవ్రత చర్య రురాలు, పవిత్ర సదాచార సంపన్నురాలు, సత్కుల సంజాతురాలు, పరమపతివ్రతా శిరోమణివియునైన నీవు ఆయనకు కోడలవైనందుచేత, ఆ వంశమును అనేక సంకటముల నుండి ఉద్ధరించితివి, కడు ధన్యురాలవు" అనిచెప్పి, వారందరు ఆ ఉత్తమ స్త్రీరత్నమును మిగుల ప్రశంసించి, ఆదరసత్కార పూర్వకముగా పూజించి, ద్యుమత్సేనుని నుండి, అతని కుటుంబము నుండి అనుమతి తీసికొని ఆనందముతో తమతమ నివాసములకు పోయిరి." అని చెప్పి మార్కండేయ మహాముని తరువాతి కథను ఇట్లు చెప్పదొడగెను:–

(సశేషము)

తెలుగు లిపి పరిణామం

(గత సంచిక తరువాయి)

శ్రీ తిరుమల రామచంద్ర

అమరావతి లిపి—దక్షిణ అశోక లిపి

- గుహాలిపి
  - చాళుక్య
  - వేంగి
    - పశ్చిమచాళుక్య
    - తూర్పుచాళుక్య
      - పరిణామదశ-సంధికాలం
        - హళగన్నడ లిపి
          - కన్నడ లిపి
        - పాత తెలుగు లిపి
          - తెలుగు లిపి
    - పాతాజావాకవి
      - కొత్తజావా

సంధికాలంలో లిపి పెక్కు మార్పులు చెందింది. చకారానికి తలకట్టు వచ్చింది. ఛకారం ఎడమభాగం గుండ్రనయింది. ఠ, ధ, థలకు తలకట్లు వచ్చాయి. ఫ, భలు చాలా మారాయి. అనుస్వారం చుక్కగా చూపినా, బిందురూపంలో చూపినా అక్షరం పై భాగంలోనో, అక్షరానికి ఎగువ కుడిభాగంలోనో పెట్టడం అలవాటయి వుండేది. ఇప్పుడది అక్షరం ప్రక్కన పంక్తిలోకి వచ్చింది. మహాప్రాణాలకు ఒత్తులు-పొల్లులు ఏర్పడ్డాయి. ఇది మొదట్లో బోర్ల వేసిన అర్ధచంద్రాకారం: క్రమంగా పొక్కిలిలో నిలువుగీతగా మారింది.

రెడ్డిరాజుల కాలానికి-అనగా శ్రీనాథుని కాలానికి ఒకటి రెండు అక్షరాలు మినహాగా అన్నీ మారాయి. తెలుగు ప్రపంచంలో పడ్డామనిపిస్తుంది. ఇప్పటి తెలుగు లిపికి సన్నిహితదశ ఏర్పడింది. క పూర్తిగా మారి ఇప్పటి క లాగ అయింది ష స్పష్టంగా నేటి రూపానికి వచ్చింది.

రెడ్డిరాజుల కాలంతో ప్రారంభమయిన ఈ మార్పు విజయనగర సామ్రాజ్యపు ఉచ్ఛదశలో స్థిరపడిపోయి, తెలుగు కన్నడ లిపులు పూర్తిగా విడిపోయాయి ఈ మార్పునకు అన్నమాచార్యుల కీర్తన రాగి రేకులను ఉదాహరణగా పేర్కొనవచ్చు.

త రెండు వైపులా సుళ్లు తీర్చుకుంది. ద కుడి ప్రక్కన విడిపోయినట్టున్న భాగం కలిసి పోయింది. హ పూర్తిగా వేరయింది. క అని భ్రాంతి కలిగించే శ నేటి శలాగే మారింది. అణిముత్యాలని వర్ణించే స్థితి ఏర్పడింది. ఈ వ్రటువ ఖత్తుకు తాటాకులలో వ్రాయడం కూడ కారణమయి వుంటుంది. ఇంత మార్పువచ్చినా ఏ. ఓల హ్రస్వ దీర్ఘ విభేదం 17వ శతాబ్దివరకు శాసనాలలో కనిపించదు.

మనకు త్స, జ్స అనే వింత ఉచ్చారణ వుంది (ఇది బంగాలీలకు కూడా వుంది-గావంచా.) దీనిని తెలుపడానికి చ జ లపై గరిటెలాంటి, తెలుగు ౨ అంకెవంటి. త వత్తువంటి గుర్తు పాత అచ్చుపుస్తకాలలో కనిపిస్తుంది. వ్రాతలో మనం ఆలాటి గుర్తు వాడము. ఈ ఉచ్చారణగల అక్షరాలను మన వైయ్యాకరణులు దంత్య చ జ లన్నారు. వీటిని సూచించడానికి పైన చుక్కలు పెట్టాలని అప్పకవి సూచించాడు. "దంత్య చ జ గురు ర ల లకు దనరు బొట్లు." త్స జ్స ఱ శలు తెలుపడానికి చ జ ర ల లపై చుక్కలు పెట్టాలని అర్థం. 16వ శతాబ్దికి పూర్వపు తాటాకు పుస్తకాలలోగాని, తక్కిన కడితాల వ్రాత ప్రతులలోగాని ఇలాటి గుర్తులున్నాయేమో చూడటానికి మనకు అప్పటి వ్రాత ప్రతులు దొరకలేదు. శాసనాలలో ఇలాటి గుర్తులులేవు. ఱ శ లకు ప్రత్యేక స్వరూపాలే వున్నాయి. దంత్య చకార జకారాలను పేర్కొనడానికి ఈ ౨ అంకె గుర్తు ఏర్పాటు చేసినవారు 19వ శతాబ్దిలో సి. పి. బ్రౌను. మొదటి చపైన తెలుగు ౧-ఒక్కట్ల గుర్తు, దంత్య చకారంపైన తెలుగు ౨ అంకె గుర్తు వేయించాడు. దీనిని రావిపాటి గురుమూర్తి శాస్త్రిగారు తమ వ్యాకరణంలోను పొందుపరచారు.

తెలుగులో అరసున్న మరొక వింతలిపి. ఇది కూడా వ్రాతలో 16వ శతాబ్దినాటికి ముందు కనిపించదు. 12వ శతాబ్దిదని చెప్పే అధర్వణ కారికావళి "పూర్ణేందు సదృశః పూర్ణః అర్ధ స్త్వర్ధేందు సన్నిభః" అని సూత్రీకరించినా, ఆ కాలపు శాసనాలలోగాని, అంతకుముందు వాటిలోగాని కనిపించదు. అనునాసికాలను అవసరమయితే ఒత్తి పలికేవారు, అవసరం కాకపోతే తేల్చి పలికేవారు. వ్రాయడం మాత్రం అనునాసికంతో కలిపి ద్విత్వాక్షరంగానే వ్రాసేవారు. నేణ్టి, 28 కూస్తుఱు లాగ అనునాసికలకు అనుస్వారం అలవాటయిన తర్వాత, సంస్కృత పదో

చ్చారణలో చిక్కుగలుగ లేదుగాని తెలుగులో చిక్కు వచ్చింది; ఏది తేల్చి పలుకాలో, ఏది తేల్చి పలుకరాదో అని. దానికి ఒక పద్ధతి అనుసరించనట్టు శాసనాలలో కనిపిస్తుంది. రాముండ్డు-దీనిని ఒత్తి పలుకాలి. రాముండు — దీనిని ఒత్తిపలుక నవసరంలేదు. దీర్ఘంమీది మూండు, నేంటి వంటి పదాలలోని అనునాసికం తేల్చి పలుకవలసిందే. వీటిని కూడ ఒత్తి పలుకడం పూర్వం ఉండేది.

ఇది ప్రస్తుతం తమిళనాడులో స్థిరపడిన పూర్వపు తెలుగు వారి ఉచ్చారణలో నేటికీ ఉంది-వేండ, వాండు మొదలయిన మాటలలో అనుసానికాలకు అనుస్వారం అలవాటయిన తర్వాత ఈ తేల్చి పలుకడంకోసం ఖండ బిందువును వైయ్యాకరణులు తర్వాత విధించారు. కనుక ఈ అరసున్నను ఒకప్పుడు వ్యవహారంలో ఉండి కాలక్రమాన లోపించిన అక్షరాల, అను నాసికస్వరాల జ్ఞాపక చిహ్నంగా కొందరు వాడుక చేశారని చెప్పవచ్చు.

అక్షరాలు ఎంత మారుతూ వచ్చాయో, గుణింతాలు అంతకు రెండింతలు మారాయి. ద్విత్వాక్షరాలను సూచించే ఒత్తులు చాలవరకు పూర్వస్వరూపంలోనే ఉన్నాయి.


తలకట్టు అక్షరం మారుతూ వచ్చినప్పుడు ఏర్పడిన ఆకారమేగాని, విడిగా చేరింది కాదని తెలుసుకొన్నాము. కాని, తలకట్టు అకారానికి చిహ్నమనే భావం తర్వాత స్థిరపడింది. ఆకార-అకార దీర్ఘం సూచించడానికి చిన్న అడ్డుగీత అశోక భట్టిప్రోలు శాసనాలనుంచి ఉంది. ఈ అడ్డుగీత అక్షరం కుడిపై చివర వాడేవారు. తర్వాత ఇది అక్షరంపైన అక్షరంతో కలిసిన అడ్డగీతగా మారి, శ్రీనాథుని కాలానికే కొన వంగి సుడి దేరింది. విజయ నగర కాలంలో ఈ సుడి చిన్నదయింది. తర్వాత మారలేదు.

ఇ గుణింతానికి అకార దీర్ఘం సూచించే అడ్డగీతమీద చిన్న నిలువుగీత అశోక శాసనాలలో కనిపిస్తుంది. ఇది సాతవాహనుల కాలానికి తురాయిలాగలేచి, చాళుక్య లిపిలో తురాయి కొన వంగి సున్నగా మారింది. శ్రీనాథుని కాలానికి పెద్ద కమానుగా అయి, విజయనగర కాలానికి ఈ కమాను కుడికొన లోపలికి వంగి నేటి గుడికి మూలమయింది.

ఈ గుణింతానికి పైన రెండు నిలువుగీతలు పెట్టేవారు. ఈ రెండు నిలువుగీతలు క్రమంగా వర్తులాకృతివాల్చి, ఎడమ వైపున సుడి తిరిగి విజయ నగర కాలానికి నేటి రూపానికి సమీపమయింది.

ఉ గుణింతం సూచించడానికి అశోక భట్టిప్రోలు శాసనాలలో అక్షరంక్రింద అడుగీతగాని, నిలువు గీతగాని కనిపిస్తుంది. ఈ అడుగీత నన్నయ కాలానికి అక్షరం పక్కన అంటుకొని ఉండడం కనిపిస్తుంది. ఇది శ్రీనాథుని కాలానికి కొన పైకి వంగి పొడవయింది. విజయ నగర కాలానికి ఇప్పటిలాగ తీర్చినట్టయింది.

ఊ గుణింతం సూచించడానికి అక్షరం అడుగున రెండు నిలువు గీతలు పెట్టేవారు. ఈ రెండు నిలువుగీతలు భట్టిప్రోలు శాసనంలో హంసపాదులాగ మారాయి. ఇక్ష్వాకుల కాలంలో ఈ రెండు అడుగీతలూ కుడివైపునకు వాలాయి. ఇవి క్రమంగా పక్కకు వాలిపడిన ఇంగ్లీషు ఏస్ (ഗ) అక్షరంలాగ మారాయి". విజయనగర కాలానికి కొమ్ము, దీర్ఘం ఇప్పటి స్వరూపానికి సన్నిహితమయింది. కాకతీయుల కాలంవరకు ప ఫ వ లకు ఉకార ఊకార సూచకాలయిన కొమ్ము, కొమ్ముదీర్ఘం అక్షరం పక్కనే వ్రాసేవారు. ఘకార, మకార భ్రాంతికలుగుతుందని కాబోలు రెడ్డిరాజుల కాలంనుంచి ఈ మూడింటికి పొక్కిలిలో కొమ్ము వ్రాయడం అలవాటయింది. (సశేషం)



అఖిల భారత
ప్రథమ ఫొటోగ్రఫీ ప్రదర్శన

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఫొటో గ్రఫీ అకాడమీ ఆధ్వర్యాన హైదరాబాదులో జరిగిన అఖిల భారత ప్రథమ ఫొటోగ్రఫీ ప్రదర్శనకు మార్చి 16వ తేదీన ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు ప్రారంభోత్సవం చేశారు.

"ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫొటోగ్రఫి అకాడమీ నిర్వహిస్తున్న అఖిల భారత ప్రథమ ఫొటోగ్రఫీ ప్రదర్శనకు ప్రారంభోత్సవం జరపడం నాకు సంతోషంగా వుంది. ఈ రాష్ట్రంలో ఫొటోగ్రఫీ రంగంలో జరుగుతున్న ప్రగతిని శ్రద్ధతో గమనిస్తున్నాను. ఆంధ్రప్రదేశ్‌లో ఫొటోగ్రఫీ కళ అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రాఫర్ల సమాఖ్య ఎనలేని కృషి చేస్తున్నది. ఈ సమాఖ్య అఖిల భారత ప్రదర్శన, అంతర్జాతీయ ప్రదర్శనలు ఫొటోగ్రాఫిక్ సదస్సులు విజయవంతంగా ఏర్పాటు చేసింది. ఇది ఫొటోగ్రాఫ్ జర్నల్‌ను ప్రచురించి అఖిల భారత పోటీలలో విజయవంతంగా పాల్గొంది. ఈ విధంగా ఈ సమాఖ్య ఆంధ్రప్రదేశ్‌కు భారత దేశంలోనేకాక ప్రపంచస్థాయిలోకూడా మంచి పేరు సంపాదించి పెట్టింది. ఈ సమాఖ్యకు శ్రీ యన్. భగవాన్‌దాస్ అధ్యక్షులుగా వుండడం చాలా అదృష్టం. ఫొటోగ్రఫీ విషయంలో ఆయనకు గల శ్రద్ధాసక్తులు, నిర్వహణాదక్షత ఈ సమాఖ్యకు కీర్తి ప్రతిష్ఠలు సముపార్జించాయి. అంతర్జాతీయ సమాఖ్య శ్రీ యన్. భగవాన్‌దాస్‌ను సముచిత రీతిని గౌరవించి ఆయనకు అత్యుత్తమ బహుమతులు ప్రసాదించింది. ఇది మనందరికీ గర్వకారణమని చెప్పవచ్చును.


కాలక్రమేణా ఈ సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫొటోగ్రఫీ అకాడమీ అవతరణకు దోహదం కలిగించడం ఎంతో సముచితమయిన చర్య. ఈ అకాడమీ ఏర్పాటయిన ఒక సంవత్సరం లోపలనే అనేక కార్యక్రమాలలో పాల్గొని ముందు ముందు ఇంకా అనేక ఘనకార్యాలను చేపట్టడానికి ఇది పూనుకోవడము హర్షించదగిన విషయం ఇటువంటి ఫొటోగ్రఫీ ప్రదర్శనలను ఏర్పాటు చేయడం ఎంతో ప్రశంసనీయమయిన విషయం. దీని వల్ల ఉత్తమమైన ఫొటోలను ప్రదర్శించడానికి ఫొటోగ్రాఫర్లకు మంచి అవకాశం లభింపచేయడమే కాకుండా ప్రజలకు అటువంటి కళాఖండాలను చూచి ఆనందించే అవకాశం కూడా లభిస్తుంది.

ముందుముందు కూడా ఈ అకాడమీ ఉత్తమ కార్యక్రమాలను చేపట్టగలదని నేను విశ్వసిస్తున్నాను అకాడమీకి అవసరమయిన సహాయ సహకారాలు ప్రభుత్వం అందజేయగలదని నేను హామీ ఇస్తున్నాను. ఫైన్ ఆర్ట్స్, ఆర్కిటెక్చర్ కాలేజీలో ప్రభుత్వం ఫొటోగ్రాఫ్ కోర్సును ఏర్పాటు చేసిన విషయం చాలా మందికి తెలియకపోవచ్చు. ఈ కాలేజీలో డిప్లొమాలు పొందిన విద్యార్థులు ప్రభుత్వం రంగంలోను, ప్రయివేటు వ్యాపారంలోనూ, తగిన ఉద్యోగాలు చేస్తున్నారని విని సంతోషిస్తున్నాను. ఇది ప్రయోజనకారి కాగల కోర్సు. మనం దీనిని ప్రోత్సహించాలి. ఈ ప్రదర్శనకు ఇప్పుడు ప్రారంభోత్సవంజరపడం నాకెంతో హర్షదాయకంగా ఉంది" అని ప్రదర్శనను ప్రారంభించిన అనంతరం ముఖ్య మంత్రి శ్రీ జలగం వెంగళరావు, పై ప్రసంగం చేశారు.

ముఖ్యమంత్రి ఈ అకాడమీకి ప్రస్తుత వార్షిక గ్రాంటును రూ. 25,000 ల నుంచి రూ. 50,000 లకు పెంచుతున్నామని ప్రకటన చేశారు.

అంతకు ముందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫొటోగ్రఫీ అకాడమీ అధ్యక్షులు శ్రీ భగవాన్‌దాస్ ముఖ్యమంత్రికి, చేనేత శాఖామంత్రి శ్రీ కె. వి. కేశవులు, తదితరులకు స్వాగతం చెబుతూ, మొట్టమొదటి ఫొటో 1826 లో ఫ్రాన్సు దేశంలో తీయడం జరిగిందని ఆ ఫొటో ఇప్పుడు లభ్యం కావడం లేదని చెప్పారు. ఈ 150 సంవత్సరాలలో సైన్సు, టెక్నాలజీ మున్నగు వివిధ రంగాలలో ఫొటోగ్రఫీ ఎంతో అభివృద్ధి చెందింది. ఇప్పుడు అత్యంత ఆధునికమయిన కెమెరాలలో ఒక నిముషంలో ఫొటోలు తీసి వాటిని డెవలప్ చేయవచ్చు. సైన్సు రంగంలో ఫొటోగ్రఫీ ప్రముఖంగా అభివృద్ధి చెందింది కానీ, ఇది ఒక కళగా ఇంకా అభివృద్ధి చెందలేదు. 1965 ఫిబ్రవరిలో హైదరాబాదులో అఖిల భారతసాంస్కృతిక మంత్రుల మహాసభ జరిగిన సందర్భంలో తొలిసారిగా భారతీయ ఫొటోగ్రఫీని కళగా గుర్తించి దానికి అధికారికంగా పరిగణన యివ్వడం జరిగింది. ఆ మహాసభలో దిగువ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించబడిందని ఆయన అన్నారు :—


"ఫొటోగ్రఫీలో కళ ఉన్నదని ఈ మహాసభ అంగీకరిస్తున్నది. దీనిని కళగా అభివృద్ధిపరచవలసిన అవసరం వున్నదని భావిస్తున్నది. అయితే ఇతర కళలకూ, ఫొటోగ్రఫీకి ఎంతో భేదం వున్నందువల్ల ఫొటోగ్రఫీని ఒక కళగా అభివృద్ధిపరచడానికి రాష్ట్రంలోను, కేంద్రంలోను ప్రత్యేక అకాడమీని ఏర్పాటు చేయవలసిందని ఈ మహాసభ ఏకగ్రీవంగా సిఫారసు చేస్తున్నది.



ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు అఖిల భారత ప్రథమ ఫొటోగ్రాఫర్ల ప్రదర్శనను మార్చి 16న హైదరాబాదులో ప్రారంభించారు. చేనేతశాఖ మంత్రి శ్రీ కె. వి. కేశవులు, ప్రధాన కార్యదర్శి శ్రీ యన్. భగవాన్‌దాస్‌లను కూడా ఈ చిత్రంలో చూడవచ్చు.

రాష్ట్ర ఫొటోగ్రఫీ అకాడమీని ఆంధ్రప్రదేశ్ ప్రథమంగా ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో కెమెరా క్లబ్‌లను ప్రప్రథమంగా సొసైటీలను సభ్యులుగా చేర్చుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫొటోగ్రఫీ కళను అభివృద్ధిపరచడానికి ఈ అకాడమీ కేంద్ర వ్యవస్థగా రూపొందింది. ఈ సమాఖ్య అఖిల భారత ఫొటోగ్రఫీ సమాఖ్యలో సభ్యత్వం కూడా పొందింది. ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ సమాఖ్య ఏర్పాటు అయినప్పటి నుంచీ అది భారత దేశంలోనేకాక, అంతర్జాతీయస్థాయిలో కూడా ఫొటోగ్రఫీని అభివృద్ధిపరచడానికి కృషిచేస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌సమాఖ్య లెన్స్‌లైట్ అనే త్రైమాసిక పత్రికను ప్రచురిస్తున్నదని. అమెరికా ఫొటోగ్రాఫిక్స్ సొసైటీ వారు నిర్వహిస్తున్న క్లబ్ పోటీలలో పాల్గొని, ప్రతిపోటీలో బహుమతులు పొంది ఫొటోగ్రఫీ ప్రపంచంలో ఒక చరిత్రను సృష్టించిందని ఆయన చెప్పారు. ఆరంభంలో దీనికి గ్రీన్ రిబ్బన్ బహుమతిగా వచ్చింది. దీని నైపుణ్యానికి ప్రతిభకు మరుచటి సంవత్సరం రెడ్‌రిబ్బన్‌లభించింది. గతఐదుసందర్భాలుగా అత్యున్నతమైన రజత పతకం సంపాదిస్తూ వస్తున్నది. గత సంవత్సరం ఉత్తమ బహుమతి గ్రహీతలలో అగ్రస్థానం పొందింది. ఈ అకాడమీ ఆస్తుల విలువ రూ. 87,000 ల వరకు వున్నదని ఆయన చెప్పారు. ఈ అకాడమీకి రూ. 25,000 ల గ్రాంటును ఇచ్చినందుకు ఆయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అకాడమీ ఇంకా, ఉత్తమ పద్ధతులలో కృషిచేయడానికి దానికి గ్రాంటును రూ. 50,000 లకు పెంచవలసిన అవసరం వుందని ఆయన అన్నారు. ఈ అకాడమీ ఆశయాలను పేర్కొంటూ రాష్ట్రంలో తెలుగు ఫొటోగ్రాఫర్ల సౌలభ్యం కొరకై అకాడమీ ఉపాధ్యక్షులు శ్రీ వి. బాపిరాజు వ్రాసిన పుస్తకాన్ని ఈ సంవత్సరం ప్రచురించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఈ అకాడమీ ఈ సంవత్సరం తొలిసారిగా అఖిల భారత ఫొటోగ్రఫీ ప్రదర్శనను ఏర్పాటు చేయడానికి పూనుకొన్నదని దీనికి ముఖ్యమంత్రి ఇప్పుడు ప్రారంభోత్సవం జరుపుతున్నారని ఆయన చెప్పారు. ఈ ప్రదర్శనలో 550 ఫొటోగ్రాఫ్‌లు, 418 స్లైడ్స్ పాల్గొన్నాయి. న్యాయమూర్తులు వంద ఫొటోగ్రాఫ్‌లను 100 స్లైడ్స్‌ను ఎంపిక చేశారని ఆయన తెలిపారు. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి ఇందులో పాల్గొన్న వారికి 16 పతకాలు అనేక యోగ్యత పత్రాలు బహుమతిగా యివ్వడం జరిగింది. ఆంధ్రాయూనివర్సిటీ ఫొటోగ్రఫీలో రెండేండ్లు డిప్లొమా కోర్సును ఏర్పాటు చేయాలని యోచిస్తున్నది. ఆర్ట్స్ సబ్జక్టులలో ఫొటోగ్రఫీని కూడా ఒక అంశంగా ప్రవేశ పెట్టడానికి ఉస్మానియా యూనివర్శిటీ తల పోస్తున్నది. రాష్ట్రంలో ఫొటోగ్రఫీ అభివృద్ధికిది శుభసూచకమని ఆయన అన్నారు.



మన సేద్యపు నీటి ప్రాజెక్టులు

శ్రీ మాదల వీరభద్రరావు

(గత సంచిక తరువాయి)

1952 లో ధవళేశ్వరం వద్ద గోదావరిపై నిర్మింపబడిన ఆనకట్టకు పగుళ్లు చూపి ప్రమాదకర స్థితి ఏర్పడింది. 1965 లో నియమింప బడిన నిపుణుల సంఘంవారు, ఆనకట్ట బలం బాగా తగ్గిపోయిందనీ, ర్యాలీ విభాగం మరింతగా దెబ్బతినిపోయిందనీ, వెంటనే బరాజ్ నిర్మాణావశ్యకతను పేర్కొన్నారు.

గోదావరికి మొదట్లో ఆనకట్ట నిర్మించినప్పుడు 4 లక్షల ఎకరాలకు నీరందించాలని ఉద్దేశించబడింది. కాని క్రమేణా 10 లక్షల ఎకరాల వరకు ఆయకట్టు పెరిగింది. షట్టర్లు పెంచుకుంటూ వచ్చారు. ఆనకట్టకే ముప్పు వాటిల్లే స్థితి ఏర్పడింది.

బరాజ్ నిర్మాణం

చివరకు ఈ ధవళేశ్వరం ఆనకట్ట దిగువన 45 కిలోమీటర్ల దూరాన బరాజ్ నిర్మాణానికి పూనుకొని, ర్యాలి ప్రాంతానగల పిచికల లంక దీవి వద్ద అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఏప్రిల్ 11 వ తేదీన శంకుస్థాపన చేశారు. సర్ ఆర్థర్ కాటన్ మహాశయుని పేరున దీనికి నామకరణంచేయడం సముచితంగా వుంది. 5 సంవత్సరాలలో ఈ బరాజ్ నిర్మాణం పూర్తి కాగలదన్నారు.

ఇందుకు రు 26 కో॥ 56 లక్షలు ఖర్చు కాగలవనీ, దీని క్రింద 4,74,000 హెక్టార్ల భూమికి పుష్కలంగా నీరందుతుందనీ అంచనా వేయబడింది. నిర్మాణ ఖర్చుల నిమిత్తం ప్రభుత్వ ఆయకట్టు రైతుల నుండి అభివృద్ధి పన్ను వసూలు చేస్తున్నది.

గోదావరి బరాజ్ కయ్యే ఖర్చు నంతా రాష్ట్ర ప్రభుత్వమే భరించు కోవలెననీ, బరాజ్‌కు వెనుకటికంటే అదనంగా నీరు వినియోగించుకోరాదనీ షరతులు, పరిమితులు విధించి కేంద్ర ప్రణాళికా సంఘం ఈ నిర్మాణానికి అనుమతించింది. ఇందుకు లోబడి ఈ నిర్మాణం కొనసాగించ బడుతున్నది.

వంశధార ప్రాజెక్టు

వంశధారానది తూర్పు కనుమలలో పుట్టి కోరాపుట్, శ్రీకాకుళం జిల్లాల గుండా 160 మైళ్ల ప్రవహించి, కళింగ పట్నం వద్ద బంగాళాఖాతంలో కలుస్తున్నది.

తరచుగా అనావృష్టికి గురిఅవుతున్న పాతపట్నం, నరసన్న పేట, టెక్కలి తాలూకా పొలాలకు, పలాస సబ్ తాలూకా భూములకు నీరందజేయడానికి ఈ వంశధార ప్రాజెక్టు ఉద్దేశించ బడింది. దీని నిర్మాణానికి రు 877.64 లక్షలు ఖర్చుకాగలవనీ, యిందువల్ల ఎడమ వైపు 1,48,300 ఎకరాల ఆయకట్టుకు నీటి వనరులు లభించగలవనీ, కుడివైపు హీరమండలం కాలువ క్రింద 1,06,000 ఎకరాలకు గూడా నీరు అందుతుందనీ మొత్తం 3 లక్షలు ఎకరాలకు నీరు లభించగలదనీ అంచనా వేశారు.

ప్రాజెక్టు ప్రథమ దశలో రు 318.46 లక్షల ఖర్చుతో గొట్టా వద్ద బరాజ్ నిర్మించి 59 మైళ్ల వరకు నదికి ఎడమ వైపు కాలువ త్రవ్వుతారు. బరాజ్‌పైన 24 అడుగుల వెడల్పున్న రోడ్డు ఏర్పడుతుంది. 1973 మార్చినాటికి ఈ నిర్మాణానికి రు. 192 లక్షలు వెచ్చించడం జరిగింది. 1974 లో రు 80 లక్షలు మాత్రం కేటాయించడం జరిగింది. ఐదేండ్లలో ఈ నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది.

వంశధార ప్రాజెక్టు రెండు దశలకు ఈ విధంగా తుది రూపమివ్వబడింది:— మొదటి దశలో గొట్టావద్ద వంశధార మహేంద్రతనయల సంగమ స్థానానికి 3 మైళ్ల దిగువన ఒక బరాజ్ నిర్మించడం; శ్రీకాకుళం, నరసన్న పేట, పాతపట్నం, టెక్కలి తాలూకాలలో ప్రస్తుతం చెరువుల మూలంగా సాగౌతున్న లక్ష ఎకరాల భూములతో బాటు, సుమారు మరో లక్షన్నర ఎకరాల భూములకు అదనపు నీటి సౌకర్యం కలుగునట్లుగా గొట్టా బరాజ్ నుండి ఎడమ వైపు కాలువ త్రవ్వడం;

రెండవదశలో వంశధార నదిపై బత్తిలిగ్రామానికి సుమారు 4 మైళ్లదిగువన 'నేరడి' వద్ద ఒక బరాజ్‌ను నిర్మించడం; నదివరద నీటిని మరలించేందుకు అనువుగాబరాజ్ కుడివైపున ఒక కాలువను త్రవ్వి, హీరమండలంవద్ద నిర్మింప దలచిన జలాశయానికి ఆనీటిని ప్రవహింపజేయడం; నేరడి—హీరమండలంవరకుగల 20 వేల ఎకరాలకు నీరందించడం;

నదికి కుడి భాగమున గల లక్షన్నర ఎకరాలకు శాశ్వతంగా నీటిని అందజేయుటకు హీరమడలం జలాశయం నుండి మరో కాలువ త్రవ్వడం; హీరమండలం జలాశయం నుండి, గొట్టా బరాజ్‌ను కలుపుతూ ఒక లింకు కాలువను త్రవ్వడం — ఇవీ ముఖ్యమైన పనులు.

రాష్ట్రంలో భారీ ఇరిగేషన్ నిమిత్తం, 5 వ పంచవర్ష ప్రణాళిక కాలంలో రు 211.92 కోట్లు; మధ్యతరహా, మైనర్ ఇరిగేషన్ పథకాలకు రు 39.8 కోట్లు కేటాయించబడినట్లు నీటి వనరుల శాఖ మంత్రి శ్రీ కృష్ణమూర్తి నాయుడు ఇటీవల వెల్లడించారు.

సేద్యపు నీటి ప్రాజెక్టుల సత్వర నిర్మాణాలకు ధనాభావమనేది అడ్డురాకుండా ప్రభుత్వం తగు శ్రద్ధవహించవలసివుంటుంది. కేంద్రం గూడా వీటికి ఆర్థికసహాయం అందజేయడం అవసరం.

మన భూగర్భ జలనిధులు

మన రాష్ట్రంలో భూగర్భ జలనిధులు సైతం హెచ్చుగా గలవని యింతవరకు జరిగిన ప్రయోగ ఫలితాలమూలంగా వెల్లడైంది. ఈ జలాలను వెలికి తీసి వ్యవసాయాభివృద్ధికై సద్వినియోగపరుచుకోవలసివుంది.

భూగర్భ జలశాఖ రు 56 కోట్ల మేరకు పథకాలను సిద్ధంచేసి వాటిని మంజూరుచేసింది. చిన్ననీటి వనరుల కార్యక్రమంక్రింద 59 వేల బావులు, 2600 గొట్టపుబావులు త్రవ్వడానికి, 73 వేల పంపుసెట్ల ఏర్పాటుకు, 17 వేల బావుల మరమ్మతులకు ఈ పథకాలు ఉద్దేశించబడినవి

వీటికి ప్రపంచ బ్యాంకు ద్వారా రు 17 కోట్లు, గ్రామీణవిద్యుదీకరణ సంస్థ ద్వారా రు 4 కోట్లు, మిగిలిన నిధులు యితర వాణిజ్య బ్యాంకుల ద్వారా సమకూర్చ బడగలవని భూగర్భ జలాల విభాగ డైరెక్టర్ ఇటీవల వివరించారు.

భూగర్భ నీటివనరుల పరిశీలనలకు 1974 లో రు 52 లక్షలు కేటాయించ బడినవి తెలంగాణా ప్రాంత భూగర్భ జలాభివృద్ధికి గూడా ఒక పథకం రూపొందించ బడుతున్నది. ఈ కార్యక్రమాన్ని అమలు జరుపుటకు రిగ్గులు, మున్నగు యంత్ర సామాగ్రినీ, నిధులను వెంటనే సమకూర్చు కొనవలసివుంటుంది.

వరద నివారణ పథకాలు

కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతాలలో సుమారు 25 లక్షల ఎకరాలు పల్లపు సాగౌతున్నది. వీటి క్రింద సాలీనా 20 లక్షల టన్నుల ధాన్యోత్పత్తి జరుగుతున్నది. విటి విలువ రు 100 కోట్లని అంచనా వేయబడింది. అయితే, దురదృష్టవశాత్తు వరదలు రావడం మూలాన వేలాది ఎకరాలలోని పంట భూములు ముంపు తగిలి అపారనష్టానికి గురి అవుతున్నవి.

1955—65 మధ్య ఒక్కొ దశాబ్ది కాలంలో 38,660 ఎకరాలకు ఏటా వరద తాకిడి తగులుతున్నదనీ, మురుగు పారుదలలు సక్రమంగా లేనందున ఒక్క గోదావరి మధ్య డెల్టాలోనే సుమారు 21 వేల ఎకరాల పంటపొలాలు నీట మునిగిపోతున్నవనీ, ఏటా సగటు నష్టం సుమారు రు. 2 కోట్లు పైగా వుంటుందనీ మిత్రా సంఘం అంచనా వేసింది. అనగా 10 ఏండ్లలో రూ. 20 కోట్లు విలువగల పంటలు నష్టమైపోయినట్లు విదితమవుతున్నది.

రూ. 17 కోట్లు ఖర్చుచేస్తే ఈ నష్టాన్ని కొంతవరకు నివారించవచ్చుననీ, అదనంగా 2—3 లక్షల టన్నుల వరకు వరి ధాన్యం పండించవచ్చుననీ 1965 డిశంబర్‌లో మిత్రాసంఘం సిఫార్సు గావించింది కాని వరద నివారణ కార్యక్రమాలకు 3వ ప్రణాళికలో ఒక్కకోటి అరవై లక్షల రూపాయలు మాత్రమే హెచ్చించారు. 4వ ప్రణాళికలో రూ. 15 లక్షలు మాత్రం కేటాయించారు. మిత్రా సంఘం సిఫార్సులను అమలు జరిపేందుకు గట్టి కృషి జరగలేదనే చెప్పాలి.

బుడమేరు, తమ్మిలేరు, ఎర్రవాగులపై అడ్డు కట్టలు కట్టి **ఉప్పుటేరు ముఖద్వారాన్ని** వెడల్పుచేసినట్లయితే కొల్లేరు ముంపును చాలవరకు నివారించవచ్చునని, పూర్వం ఇరిగేషన్ **ఛీఫ్**ఇంజనీర్లుగా వున్న శ్రీ వెంకటకృష్ణయ్యర్, శ్రీ ఎం. ఆర్. వెంకట్రామన్ కొన్ని **ముఖ్య** పథకాలను సూచించారు. వీటిని **అమలు** జరిపి వరద నష్టాలను నివారించుకొనేందుకు పూనిక వహించ వలసివుంది.

మురుగు నివారణ కృషి

రాష్ట్ర ప్రభుత్వం డెల్టా ప్రాంతాలకు ఒక డ్రైనేజ్ సెస్ బోర్డును నియమించింది. వారు రూ. 10 కోట్లు ఖర్చుతో కూడిన: తూర్పు–**పశ్చిమ** గోదావరి **జిల్లాలకు**, కృష్ణా, ప్రకాశం, గుంటూరు జిల్లాలకు సంబంధించిన కొన్ని పథకాలను రూపొందించారు. కృష్ణా గోదావరి డెల్టాలలో డ్రైనేజ్ వ్యవస్థను నిజాంసాగర్ ప్రాంత డ్రైనేజ్వ్యవస్థను అభివృద్ధి చేయుటకు మొత్తం రూ. 70 కోట్లు అవసరమని ఆ బోర్డు అభిప్రాయపడింది.

ఇందులో రూ. 22 కోట్లు సెస్సురూపేణా డెల్టా వ్యవసాయ దార్ల నుండి 6 ఏండ్ల కాలంలో వసూలు **చేయాలని** యోచించారు. గత 2 సంవత్సరాలలో సుమారు 8.75 **కోట్లు** యిందుపైన వెచ్చించి నట్లు తెలుస్తున్నది.

డెల్టాప్రాంతాలలోని డ్రైనేజ్ పథకాల యెడల ప్రభుత్వం శ్రద్ధ వహించనట్లయిన, మృష్టాన్నం ఒలకబోసుకున్నట్లు చేతికి రానున్న పంటలు దెబ్బతిని రైతాంగం ఏటేటా తీవ్ర కష్టనష్టాలకు గురయ్యే దుస్థితి ఏర్పడుతూ వుంటుంది.

రాష్ట్రంలో మురుగు నివారణకుగాను, రూ. 25 కోట్లు **ఖర్చుతో అమలుజరుపుటకు** మన ఇంజనీరింగు నిపుణులు లోగడనే **ముఖ్యపథకాలను** సిద్ధంచేసి వున్నారు. వీటికి అవసర నిధులు సమకూర్చడం **ముఖ్యావసరం**. సంపన్నులైన రైతులు డ్రైనేజ్ సెస్సును చెల్లించి **ఈ** కృషిలో సంపూర్ణంగా సహకరించవలసి వుంటుంది.

మిత్రాకమిటీ సూచనలననుసరించి అమలుజరిపేందుకు కృష్ణా, **గోదావరి** డెల్టాలలో డ్రైనేజ్పథకాలకు, **గోదావరి**పైన పోచంపాడు ప్రాజెక్టు నిర్మాణానికి, **గోదావరి**పై బరాజ్ పునర్నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు సహాయం లభించగలదని ప్రపంచ బ్యాంకు, ఆహార వ్యవసాయ సంస్థ సంయుక్తంగా నియమించిన సంఘం ఇరిగేషన్ ఇంజనీర్ శ్రీ టి. ఇ. క్యాంప్‌బెల్ ఇటీవల మన రాష్ట్రాన్ని సందర్శించి వివరించారు. **ఈ** నిధులను సంపాదించి, సత్వరంగా నిర్మాణాలను ముగింపు చేయవలసి వుంది.

నిధులకొరత, నిర్మాణాల్లో జాప్యం

మన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించే నాటికి 240 లక్షల ఎకరాలకు మాత్రమే నీటిపారుదల సదుపాయాలు వుండేవి. రు. **1940 కోట్లు** వెచ్చించి అదనంగా 480 లక్షల ఎకరాలను **నీటి** పారుదలక్రిందకు తీసుకొనిరావాలని ప్రాజక్టులకు ప్రణాళికలు తయారుచేసి అమలు జరిపారు. ఇంతవరకు ప్రభుత్వాలు రు. 1920 **కోట్లు ఖర్చు**పెట్టినవి. కాని అదనంగా 240 లక్షల ఎకరాలకు మాత్రమే నీరు అందించడం సాధ్యపడింది.

'అనేక సేద్యపునీటి ప్రాజెక్టులు దీర్ఘకాలం నిర్మాణంలో వుండటం, ఇందుకవసరమైన నిధులు సకాలంలో సమకూర్చజాలక **పోవడం**, అనుకున్నదానికంటే నిర్మాణ ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం" ఇందుకు ముఖ్య కారణాలుగా నిరుడు కేంద్ర జల విద్యుత్ శాఖామాత్యులు డాక్టర్ కె. ఎల్. రావు పేర్కొన్నారు. ఆయన భారతదేశంలోని ప్రాజక్టులనుగురించి చెప్పినా, ఆ కారణాలు ఆంధ్రప్రదేశ్‌కుగూడా వర్తిస్తాయనుటకు సందేహంలేదు

ప్రజలలోను, ప్రజాప్రతినిధులలోను రావలసిన ఉత్సాహం రానందున ఆనకట్టల నిర్మాణాలలో, కాలువల త్రవ్వకాలలో తమవంతు బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేదనిపిస్తుంది. ప్రాజెక్టులకోసం పరితపించినంతగా, వాటి నిర్మాణాలలో ప్రజోత్సాహం ప్రస్ఫుటం కాలేదు. ప్రజాప్రతినిధులు ప్రాజక్టులకై ఆందోళన గావించినంతగా వీటి నిర్వహణలో హెచ్చుగా పాల్గొనడం కానరాదు. ఇవి ప్రభుత్వ పనులుగానే వుండిపోయినవిగాని, తమ భవిష్యజ్జీవితాలకి ఇవి ప్రాణప్రదములని భావించలేకపోవడం దురదృష్టకరం.

ఇందుకుతోడు అంతర్రాష్ట్రీయ, ప్రాంతీయ నదీజల వివాదాలు, తగిన నిధులు కొరవడటం, ప్రారంభించిన ప్రాజక్టులను సైతం సత్వరంగా **పూర్తి** చేసేందుకు దీక్ష లేకపోవడం **మున్నగున** వన్నీకలసి ఆశించినంతగా సత్ఫలితాలను చేకూర్చజాలక**పోయిన** వని చెప్పవలసివుంటుంది.

నీటి పంపిణీ వ్యవస్థలో లోపాలు

మన రాష్ట్రంలో 1950–51 నాటికి 6 మిలియన్ ఎకరములకు **నీటిపారుదుల అవకాశం** వుండేది. 1969 లో 8 **మిలియన్** ఎకరాలకు **ఈ నీటిపారుదల** శక్తి పెరిగిందని భారీ ఇరిగేషన్ ఛీఫ్ ఇంజనీర్ యిటీవల వివరించారు. అనగా 20 సంవత్సరాలలో 20 లక్షల ఎకరాలు అదనంగా పల్లపుసాగు క్రిందకు వచ్చినట్లు తెలుస్తున్నది. నాగార్జున సాగర్, పోచంపాడు మొదలగు వాటిక్రింద **ఈ నాలుగేండ్లలో** మరికొంత **ఆయకట్టు** పెరిగింది.

ప్రాజెక్టులు కట్టారు. కాలువలు త్రవ్వారు. కాని పొలాలకు **నీటిపంపిణీ** విషయంలో సక్రమమైన **అజమాయిషీ**, అదుపు లేనందున **బోలెడంత** నీరు వృధా **అవుతున్నది**. కాలువల సమీపరైతులు **నీటిని** యిష్టమొచ్చిన రీతి వాడుకోవడం, కాలువల చివరనున్న **ఆయకట్టులో** చేరిన **భూములకు** కూడా నీరందకపోవడం జరుగుతున్నది. నీటిపంపిణీ వ్యవస్థను పునః నిర్మాణం గావించాలని ఇంజనీరింగు **శాఖ** భావిస్తున్నట్లు తెలుస్తున్నది. కాలువలకు గండ్లుకొట్టి యథేచ్ఛగా నీటిని వాడుకొనే పద్ధతులను అరికట్టవలసివుంది. కొత్తగా పల్లపు సాగులోకివచ్చిన ప్రాజెక్టుల క్రింద **ఈ** యిబ్బందులు మరీ ఎక్కువగా కానవస్తున్నవి.

ఇంజనీర్లు 'లోకలైజేషన్' చేసిన పద్ధతిగూడా లోపభూయిష్టంగా వున్నట్లు ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిని మరల నిపుణులు సమగ్రంగా పరిశీలించి లోపాలను చక్కదిద్దవలసి వుంటుంది.

మరో ముఖ్య విషయంగూడా గమనార్హం. రాయలసీమ ప్రాంతంలో ప్రధానంగా తుంగభద్ర ఎగువకాలువ, దిగువకాలువ, కడప–కర్నూలు కాలువల ద్వారా పొలాలకు నీరు లభిస్తున్నది. మెట్టపైర్లకు 'ఖరీఫ్' తరుణంలో నీటివనరులు కలిగించాలనే ఆలోచనలు, ప్రయత్నాలు అంతగా జయప్రదమవుతున్నట్లు కనుపించదు. 'రాబీ' సీజన్‌లోనే కాలువ నీటిని వాడుకునేందుకు రైతులు పోటాపోటీలు పడుతున్నారు. దీనిని ఇంజనీరింగు నిపుణులు, వ్యవసాయ శాస్త్రజ్ఞులు పరిశీలించి ఆయకట్టు క్రింద పైర్ల పద్ధతిని, నీటి విడుదల, పంపిణీ విధానాలను సక్రమంగా రూపొందించ వలసి వుంటుంది.

భావి అభివృద్ధికి సూచనలు

1. కృష్ణాడెల్టాకు మున్ముందు నీటి ఎద్దడి రాకుండా నివారించేందుకు 'పులిచింత' దగ్గర ఒక పెర్మినెంట్ ప్రాజెక్టును విధిగా నిర్మాణం గావించాలి.

2. నాగార్జున సాగర్ ద్వితీయ దశను గూడా వెంటనే చేపట్టి, అనావృష్టికి గురౌతున్న దర్శి, పొదిలి, కనిగిరి మొదలగు ప్రాంతాలకు గూడా నీరందించాలి.

3. శ్రీశైలం ప్రాజెక్టును జల విద్యుత్ పథకంగా పరిమితం చేయకుండా ఇరిగేషన్ ప్రాజెక్టుగా కూడా అభివృద్ధి పరచి, రాయలసీమ దుర్భిక్ష ప్రాంతాలకు నీరందించాలి.

4. గోదావరి బరాజ్ నిర్మాణాన్ని సత్వరం పూర్తిచేయడమే కాక, అపార జలసంపదగల గోదావరి నది నీరు వృధా గాకుండా, ఇచ్చంపల్లి వద్ద భారీ ప్రాజెక్టును నిర్మించుటకు పూనుకోవాలి.

5. తెలంగాణాకు 'పంటలక్ష్మి' గా వర్ధిల్లే పోచంపాడు ప్రాజెక్టును భారీ ప్రాజెక్టుగా అభివృద్ధిచేసి, మరే యితర ప్రత్యామ్నాయ నీటి వనరుల అవకాశంలేని తెలంగాణా మెట్ట భూభాగాలకు నీటిని అందజేయాలి.

6. శ్రీకాకుళం జిల్లాలోని వంశధార ప్రాజెక్టును, నెల్లూరుజిల్లాలోని సోమశిల ప్రాజెక్టును సత్వరం పూర్తి చేయాలి.

7. మిత్రా కమిటీ సిఫార్సుల ననుసరించి కోస్తా ప్రాంతాలలోని వరద నివారణ పథకాలకు, డ్రైనేజ్ స్కీములను వెను వెంటనే చేపట్టి, ముంపు తాకిడికి పంటపైర్లు నష్టపడకుండా తగిన రక్షణ కలిగించాలి.

8. భారీ, మధ్య తరహా ప్రాజెక్టుల నిర్మాణంతోపాటు, చెరువుల మరమ్మతులు, బావుల త్రవ్వకాలు, భూగర్భ జలనిధులను వెలికి తీయడంవంటి కార్య క్రమాలు కొనసాగిస్తూ, మైనర్ ఇరిగేషన్ అభివృద్ధికిగూడా ఎక్కువ శ్రద్ధ వహించాలి.

9. అంతర్రాష్ట్రీయ నదీజలాల వివాదాలవల్ల మన ప్రాజెక్టుల నిర్మాణం పనులు కుంటు పడకుండా, అపరిష్కృతంగా వున్న సమస్యలను వెంటనే సామరస్యంతో పరిష్కరించుకునేందుకు ప్రభుత్వం పూనుకోవలసి వుంటుంది.

10. ఈ కార్యక్రమాలను నిర్విఘ్నంగా పూర్తిచేసి సత్వర ఫలితాలను సాధించుటకు వివిధ ప్రభుత్వ శాఖలమధ్య సమన్వయం వుండటం అవసరం.

పోచంపాడు ప్రాజెక్టుకు శంకుస్థాపన గావిస్తూ కీ. శే. జవహర్ లాల్ యిచ్చిన సందేశంతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను.

"చేసినదానిని గురించి మనం ఎక్కువగా ఆలోచించరాదు. చేయకుండా మిగిలివున్న పనులను గురించే ఆలోచించుదాం. మన దేశంలో అపారంగా వున్న ప్రకృతి వనరులను ప్రజా శ్రేయస్సు కోసం సమీకరించేందుకు ఆలోచిద్దాం.

ఈ పనులు సక్రమంగా చేస్తే మన దేశస్వరూపమే పూర్తిగా మారిపోయి, ప్రజలు సిరి సంపదలతో తులతూగుతారు. ఈ మహత్తర కర్తవ్యాన్ని ఫలప్రదం చేయడంకోసం, మన సర్వశక్తులను కేంద్రీకరించి కలిసి కృషిచేద్దాం."

ఆనకట్టలు రైతుల పాలిటి ఆలయాలు!

రాష్ట్రంలో చిన్న, పెద్ద నీటి వనరుల ప్రాజెక్టులు

స్వాతంత్ర్యానికి పూర్వం	ప్రథమ ప్రణాళిక	ద్వితీయ ప్రణాళిక	తృతీయ ప్రణాళిక	చతుర్థ ప్రణాళిక
దిండి ప్రాజెక్టు	నాగార్జునసాగర్ ప్రారంభం	జటపల్లి ప్రాజెక్టు	కోటిపల్లి ప్రాజెక్టు	ఓకచెట్టివాగు ప్రాజుక్టు
మహబూబ్ నెహర్	సరళాసాగర్ ప్రాజెక్టు	లక్నాపురం ప్రాజెక్టు	వట్టివాగు ప్రాజెక్టు	పోచంపాడు ప్రాజెక్టు
ఫతేనెహర్	కోయిల్‌సాగర్ ప్రాజెక్టు	నల్లవాగు ప్రాజెక్టు	పంపా రిజర్వాయర్	కిన్నెరసాని ప్రాజెక్టు
పోచారం ప్రాజెక్టు	సరళా ప్రాజెక్టు	రామడుగు ప్రాజెక్టు	లంకా సాగర్ ప్రాజెక్టు	గోదావరి బరాజ్
నిజాంసాగర్ ప్రాజెక్టు	కడం ప్రాజెక్టు	స్వర్ణ ప్రాజెక్టు	కనుపూర్ కాలువ పథకం	గుంటూరు ఛానల్
ఎగువమానేరు ప్రాజెక్టు	భీమనపల్లి ప్రాజెక్టు	సలివాగు ప్రాజెక్టు		బహుదా రిజర్వాయర్
ఖానాపూర్ కాలువ	మూసి ప్రాజెక్టు	పైడిగాం ప్రాజెక్టు		తుంగభద్ర ఎగువ కాలువ (2 వదళ)
లక్నవరం సరస్సు	వేదవతి ప్రాజెక్టు	వంశధార ప్రాజెక్టు		గాజుల దిన్నె ప్రాజెక్టు
పాఖాల సరస్సు	సీతానగరం ఆనకట్ట	వరాహ రిజర్వాయర్		
పాలేరు ప్రాజెక్టు	నాగావళి తుడికాలువ	తాండవ రిజర్వాయర్		
మునేరు ప్రాజెక్టు	నారాయణపురం ఆనకట్ట	తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్		
వైరా ప్రాజెక్టు	గంభీరగడ్డ రిజర్వాయర్	కె. సి. కెనాల్ అభివృద్ధి పథకం		
ధవళేశ్వరం ఆనకట్ట	బండకట్టు ఛానల్	తుంగభద్ర ఎగువ కాలువ (ప్రథమదళ)		
కృష్ణా ఆనకట్ట	ప్రకాశం బరాజ్	జుర్రేరు ప్రాజెక్టు		
సంగం ఆనకట్ట	రొంపేరు డ్రైనేజ్ పథకం			
నెల్లూరు ఆనకట్ట	పాలేరు రిజర్వాయర్			
స్వర్ణముఖి ఆనకట్ట	పాలేరు-బిట్రగుంట సప్లయి కాలువ			
ఎగువ సగిలేరు ఆనకట్ట	దిగువ సగిలేరు ప్రాజెక్టు			
సుంకేశుల ఆనకట్ట	నక్కలగండి రిజర్వాయర్			
	ఉప్పుటేరు దిగువ ఆనకట్ట			
	రాళ్లపాడు ప్రాజెక్టు			
	పింఛా ప్రాజెక్టు			
	సిద్దలగండి ప్రాజెక్టు			
	మల్లిమడుగు రిజర్వాయర్			
	కాళంగి రిజర్వాయర్			
	చెన్నరాజస్వామి గుడి ప్రాజెక్టు			
	విద్యారణ్యస్వామి గుడి ప్రాజెక్టు			
	ఎగువ పెన్నార్ ప్రాజెక్టు			
	భైరవానితిప్ప ప్రాజెక్టు			
	తుంగభద్ర దిగువకాలువ పథకం			
	రాజోళిబండ మళ్ళింపు పథకం			



రాష్ట్రంలో ఆయకట్టు అభివృద్ధి

ఆంధ్ర ప్రదేశ్‌లో ఆయకట్టు అభివృద్ధికి సంబంధించిన సుదీర్ఘ చరిత్రలో కమాండ్ ఏరియా అభివృద్ధి శాఖను నెలకొల్పడం ఒక మైలురాయి

అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థలో వనరులను, ఆయకట్టు ప్రాంతాలను గరిష్ఠస్థాయిలో ఉపయోగించుకోవడం చాలా ప్రాధాన్యం వహిస్తుంది. భారీ, మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టు ప్రాంతాలలో ఆయకట్టుకు సంబంధించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను యింతవరకు వివిధ శాఖలు నిర్వహిస్తూ ఉండేవి.

ఇందుకు సంబంధించిన అన్ని ముఖ్య అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించడానికి వీలుగా పబ్లిక్ వర్క్సు శాఖ, వ్యవసాయశాఖ, సహకార శాఖలవంటి వివిధ శాఖల మధ్య సమన్వయం కల్పించడానికి అనువైన ఏకీకృత సంస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడింది. ప్రతీక మాండు ప్రాంతాలలో నీటి వినియోగం అభివృద్ధి, మురుగు నీటిపారుదల పద్ధతి మెరుగుదల భూమిని సమం చేయడం, పంట కార్యక్రమాల ద్వారా నీటిపారుదల సౌకర్యాన్ని గరిష్ఠస్థాయిలో వినియోగించుకోవాల్సిన అవసరాన్ని గూర్చి కేంద్ర ప్రభుత్వం నొక్కిచెప్పింది.

ఏకీకృత సంస్థ

అన్ని శాఖల మధ్య సన్నిహిత సమన్వయం ఏర్పాటు చేయడానికి ఏకీకృత సంస్థ ఉండడం చాలా అవసరం. ఈ దృష్టితోనే 'కమాండు ఏరియా అభివృద్ధి శాఖ' ను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. నిర్ణీత గడువుగల కార్యక్రమం అమలు చేయడంద్వారా నీటిపారుదల వనరులను గరిష్ఠస్థాయిలో ఉపయోగించుకోవడం, గరిష్ఠస్థాయిలో కమాండు ఏరియాను అభివృద్ధి పరచడం యీ శాఖ ప్రధాన లక్ష్యాలు.

ఈ శాఖ ఏర్పడిన మరుక్షణం నుండి పనిని ప్రారంభించింది. ఆంధ్ర ప్రదేశ్‌లో ఐదవ పంచవర్ష ప్రణాళికా కాలంలో దిగువ తెల్పిన ప్రాంతాలలో తీవ్రతర సమీకృత అభివృద్ధిని యీ శాఖ చేపట్టింది. నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువల కమాండు ప్రాంతం, పోచంపాడు ప్రాజెక్టు కమాండు ప్రాంతం, తుంగభద్ర ప్రాజెక్టు దిగువ కాలువ, కె. సి. కాలువ కమాండ్ ఏరియా, తుంగభద్ర ప్రాజెక్టు ఎగువ కాలువ, రాజోలి బండ మళ్లింపు పథకాలను కూడా యీ కార్యక్రమంలో చేర్చుకోవాలని కొత్త ఢిల్లీకి వ్రాయడం జరిగింది.

ముఖ్యంగా మెట్ట ఆరుదలపైర్లు వేసే ప్రాంతాలలో ప్రతి సంవత్సరం భూమి కోతవల్ల భూసారం తగ్గిపోవడం మనందరికీ తెలుసు. దీనిని అరికట్టకపోతే కొంత కాలంలోనే భూసారం తగ్గిపోవడం వల్ల పెద్ద విస్తీర్ణం ఎడారిగా మారిపోయి తత్ఫలితంగా దేశానికి ఎంతో నష్టం కలుగవచ్చు. ఇటీవలి కాలంలో బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన బహుపంటల సేద్యం ద్వారా భూసారాన్ని పరిరక్షించవచ్చు. దానివల్ల అధికోత్పత్తికి కూడా అవకాశం ఏర్పడుతుంది.

ఉత్తమ సేద్యపు విధానాలు

భూమిని, నీటిని ఉత్తమ రీతిగా వినియోగించుకోడానికి ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రవేశపెట్టి వాటిని రైతులోకానికి విస్తృతస్థాయిలో ప్రబోధించాల్సి ఉంటుంది. కమాండ్ ఏరియా కార్యక్రమాలతో పాటుగా యీ పనిని చేపట్టాలి.

(తరువాయి 45 వ పుటలో)

వ్యావహారిక భాషా విజయం

"కళా ప్రపూర్ణ"
శ్రీ వడ్లమూడి గోపాల కృష్ణయ్య

(గతసంచిక తరువాయి)

శ్రీ రామమూర్తి పంతులుగారు ముద్దు నరసింహంగారి హిత సూచని గ్రంథము దాని పీఠికా చదివారనడానికి వాటిని ఆయన 'గద్య చింతామణి'లో ఉదాహరించడమే తార్కాణం. వ్యావహారిక భాషా వాదానికి ప్రళయ ఝంఝామారుతం వంటి ఉద్యమ రూపం ఇవ్వడానికి రామమూర్తి పంతులుగారు చేసిన కృషి, పరిశోధనా అపూర్వమైనవి. మాట మారితే కోట కూలి పోయినట్లు, భాష విధ్వంసమైనట్లు బాధపడిన కొందరు సంస్కృతాంధ్ర పండితులు వజ్రాయుధంవంటి వాటిని ధరించి ఎదురు నిలిచారు. "వజ్రం వజ్రేన భిద్యతే" అన్న సూక్తిని వమ్ముచేస్తూ వజ్రాయుధాన్ని వజ్రంలేకుండానే ముక్కలు ముక్కలు చేసివేశారు రామమూర్తి పంతులుగారు. శ్రీ గురజాడ వేంకట అప్పారావు గారు పెట్టని కోటవలె అండగా వుండగా "గిడుగు గిడుగుకాదు పిడుగు" అని అనిపించుకునేట్లు విజృంభించారు. వ్యావహారిక భాషా విజయ దుందుభిని మ్రోగించడానికి గిడుగు వారు అనేక పండిత సభలలో వాద ప్రతివాదాలకు తలపడ్డారు. గిడుగు వారి అనన్య సామాన్య పరిశ్రమ ఫలితంగా దిగ్దంతుల వంటి పండితులకు సమాధాన రూపమై బాల కవి శరణ్యం, గద్య చింతామణి, ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం, ఇతర వ్యాసాలూ అనేకం అవతరించాయి కొమఱ్ఱాజు లక్ష్మణరావు, వేదం వేంకట రాయ శాస్త్రి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, జయంతి రామయ్య వంటి పండితులు గ్రాంథిక భాషా వాదులుగా వ్యావహారిక భాషా వాదాన్ని ప్రతిఘటిస్తూ నిలిచారు. విశ్వ విద్యాలయాలలో వ్యావహారిక భాషను ప్రవేశ పెట్టడానికి 1913–15 సంవత్సరాలలో మద్రాసు యూనివర్సిటీ బోర్డు ఆఫ్ స్టడీస్ మీటింగులలో మద్రాసు యూనివర్సిటీ బోర్డు "ది తెలుగు కాంపోజిషన్ ఇన్ కాంట్రోవర్సీ" అన్న పేరుతో ఇంగ్లీషులో శ్రీ అప్పారావుగారు వ్రాసిన పరిశోధన రూపమైన గ్రంథం వెలువడింది.

ప్రజల భాషకు సన్నిహితంగా శ్రీ చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారు, శ్రీ శ్రీ ప్రభృతులు కవితలు వెలార్చగా, శ్రీ తాపీ ధర్మారావు వంటివారు ధైర్యంగా కొన్ని పత్రికలను స్థాపించి ఏ అడ్డమూ, ఆటంకమూ లేకుండా పత్రికా రచనలో వ్యావహారిక భాషను ప్రవేశపెట్టారు. తత్ఫలితంగా కథలు, నాటికలు, నవలలు, గేయాలు సకృత్తుగా పద్యాలు వ్యావహారిక భాషలో వెలువడుతూ వచ్చాయి, వేటూరి ప్రభాకరశాస్త్రి, బండారు తమ్మయ్య మొదలైనవారు భాషపట్ల తమ అభిప్రాయం ఎట్లావున్నా ప్రాచీన కవులు చేసిన భాషా విశేష ప్రయోగాలను, వ్యావహారిక భాషా వాదానికి అనుకూలమైన వాటిని ప్రకటిస్తూ వచ్చారు. ఆంధ్రప్రభ సంపాదకులుగా అనేకమంది రచయితల సహకారంతో శ్రీ నార్ల వేంకటేశ్వరరావుగారు వ్యావహారిక భాషకొక స్థాయినీ, గడుసరి తనంతో కూడిన హుందాతనాన్నీ సమకూర్చారు. శ్రీ తాపీ వారు పత్రికలలో వ్యావహారిక భాషను ప్రవేశ పెట్టినది మొదలు ఈ భాష ఆంధ్రదేశం నలుమూలలా ప్రజా సాహిత్యంలో మూడు పూవులారు కాయలుగా పుష్పించి ఫలించినది. శ్రీ రామమూర్తి పంతులు, ప్రభాకర శాస్త్రి మొదలైన వారిచ్చిన భాషా విశేష ప్రయోగాలను శ్రీ గిడుగు సీతాపతిగారు ఉటంకిస్తూ "భారతీ శతకం" రచించారు. వ్యావహారిక భాషా విజయ ఘంటికా నినాదం శ్రవణ పేయమై ఇంతగా స్థిరపడి వినిపిస్తున్నా శ్రీ వఝ్ఝల చిన సీతారామస్వామి శాస్త్రిగారు తమ ఆంధ్ర వ్యాకరణ సంహితా సర్వస్వం 178–179 పుటలలో శ్రీ గిడుగు రామమూర్తి పంతులు గారి వ్యావహారిక భాషా వాదాన్ని అప్రమాణికమని త్రోసిపుచ్చారు. గిడుగువారు అహోరాత్రములు పరిశ్రమచేసి సంపాదించిన ప్రాచీన కవిప్రయోగాల గురించి వారు ఈ క్రిందివిధంగా పేర్కొన్నారు.

"పంతులువారి ప్రయోగ సంచయములోనివి చాలవఱకు గవి ప్రయుక్తములని విశ్వసింప దగిన యతిప్రాసాది స్థల నిబద్ధములు మిక్కిలి యరుదు. మఱియు బంతులువారి ప్రయోగ సంచయములో ప్రామాణికులుగా నెన్నుకొనబడుచున్న మహాకవి ప్రయోగములు మిక్కిలి యల్ప సంఖ్యగలవి."

గిడుగు ప్రభృతులు చేసిన పరిశోధనలను అప్రామాణికాలని వ్రాసిన వఝ్ఝలవారి వాక్యాలను చూచిన నేను వ్యావహారిక భాషా వాదానికి పెట్టనికోటగా నిలవగల ధ్వని–లిపి–పరిణామ రీతుల పరిశీలనతో పరమ ప్రామాణికాలనదగిన లక్షణ గ్రంథాలను మూలమట్టంగా పరిశీలించి "ప్రాచీన వాఙ్మయంలో వ్యావహారిక భాష లేక ధ్వని–లిపి–పరిణామం" అన్న రచన చేసి 1956లో వెలువరించాను. గ్రాంథికవాదులను, గ్రాంథిక వాదాన్ని తిరుగులేని దెబ్బతీసిన ఈ గ్రంథంలోని వ్యావహారిక భాషావాద దిగ్విజయం గురించి ఆంధ్ర

ప్రభలో సుప్రసిద్ధ పండిత పరిశోధకులు శ్రీ తిరుమల రామచంద్ర గారు ఈ క్రింది విధంగా వ్రాశారు.

—"మనం ఎన్నో విషయాలను రోజూ చూస్తూ ఉంటాము. కాని వాటిని పరిశీలించము. అలాగే కష్టాలు పడుతుంటాము. వివేచనతో తెముల్చుకోలేక పోతాము. కవి మన తోటివాడే. కాని దృష్టివేరు. కనుకనే క్రొత్తదృష్టితో చూచి—రోజూ మనం చూస్తున్న దానినే—చెబుతాడు. కవిత్వమై జనం నాలుకపై నిలిచిపోతుంది. తత్వవేత్త కూడా అంతే. రోజూ మనం చూస్తున్న, వింటున్న విషయాలను మరొక దృష్టితో లోతులలోకి చూస్తాడు. ఇది దీనికిటుకు అనితెలుసు కుంటాడు. ప్రజలు అరెరే! అంటారు. రోజూ చూస్తూనే వున్నారు మరి! అదే మౌలికత-అలాంటి మౌలికతే శ్రీ వడ్లమూడి గోపాల కృష్ణయ్యగారిది. ఆయన వ్యావహారిక భాషావాదాన్ని నిరూపించడానికి అనుసరించిన మార్గం అపూర్వం. అసదృశం. వేదాంతులు నిషేధం నుంచి బ్రహ్మసత్యాన్ని సాధించినట్లు, ఈయన నిషేధంతో వ్యవహార భాషా అస్తిత్వ సత్యత్వాలను సాధించి నిరూపించారు. 'లాక్షణికులందరూ పనిగట్టుకుని ఎందుకు అవి కూడదు. ఇవివద్దు, అని నిషేధించారు? అవి వ్యవహారంలో ప్రచురంగా ఉండబట్టే కదా! కనుక సహజమైంది వ్యావహారికమే.' అని ఈయన అడ్డంగా నరుక్కుంటూ పోయారు. ఇంకేముంది? పాచిని తొలగిస్తే కనిపించేది పరిశుభ్రమైన నీరే కదా కొలనిలో.

ప్రజలు తాము వ్యవహరించే పదాలు ఏలా వ్రాస్తున్నారు? లిపి స్వరూపమేమిటి? వారి లిపి ఉచ్చారణకు అనుగుణంగా వుందా? కృత్రిమమా?-అనే ఈ రెండవ ఆయుధంతో శ్రీ గోపాలకృష్ణయ్య గారు అజేయులయ్యారు."

వ్యావహారిక భాషావాదం ఇంతగా దిగ్విజయం సాధించినా వ్యావహారిక భాష అంటే గిట్టనివారు "వ్యావహారిక భాషకు వ్యాకరణం వ్రాయడం సాధ్యం కానేకాదు!" అనే నినాదాన్ని లేవదీశారు. లక్షణ రహితమైన భాష వుండదు కాబట్టి, లక్షణ సహితమైన భాష సూత్రబద్ధం కాక తప్పదు కాబట్టి వ్యావహారిక భాషకు కూడా వ్యాకరణం రచించవచ్చు అని నేను పది పరిచ్ఛేదాలతో 1300 పైగా సూత్రాలు రచించి "వ్యావహారిక భాషా వ్యాకరణం" అవతరింప జేశాను. 1955 నాటికే దీని రచన పూర్తి అయినా, 1958 చివరి వరకు ఇది వెలుగు చూడనే లేదు. శ్రీ తిరుమల రామచంద్రగారు "వ్యవహార భాషా విలక్షణను ఒక్కరే గుర్తించటం, ఒంటి చేయి మీదుగా లక్షణ గ్రంథం బయలుదేరడం అసాధ్యమైన పని. శ్రీ గోపాలకృష్ణయ్యగారికి తొలిసారిగా విస్తృతంగా వ్యావహారిక భాషను వ్యాకర్ణించే విమల యశస్సు కలిగినందుకు అభినందిస్తున్నాను". అని ఆంధ్రప్రభలో అభినందించగా "వ్యావహారికాంధ్రానికి వ్యాకరణాన్ని సంతరించగల మహాభాగ్యం తరుణప్రాయంలోనే శ్రీ వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారికి అమరడం, వారి పాండితీ ప్రకర్షకూ, ప్రతిభా సంపదకూ చక్కని నిదర్శనం." అని 1958 డిసెంబరు 3వ తేదీన ఆంధ్రప్రభ దినపత్రిక సంపాదకీయం ప్రశంసించింది. "భాషాపరంగా ఇంతటి ఘనకార్యాన్ని సాధించి స్వామినేని, కందుకూరి, గిడుగు, గురజాడల ఆశయాన్ని సఫలం చేసినందుకు శ్రీ గోపాల కృష్ణయ్యగారిని అభినందించక తప్పదు." అని అభినందించింది.

(సశేషం)

ఆయకట్టు అభివృద్ధి

(43 వ పుట నుండి)

ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచ బ్యాంకు సహాయంతో నిర్మిస్తున్న పోచంపాడు ప్రాజెక్టు ప్రాంతంలో యీ పథకాన్ని అమలు జరపాల్సిన అవసరాన్ని గుర్తించడం జరిగింది. ఇతర ప్రాజెక్టు ప్రాంతాలలో అనుసరింప బడిన విధానాలను ప్రపంచ బ్యాంకు సలహాపై పోచంపాడు ప్రాజెక్టు ప్రాంతంలో అమలు జరుపుతున్నారు. మురుగునీటి కాలువల త్రవ్వకానికి అనువుగా ప్రాంతీయ నమూనాలు, కాంటూరు మ్యాపులు మొదలైన వాటిని తయారు చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. వాటికితోడు, వ్యవసాయ విస్తరణ పథకాలు, భూగర్భజలాల వినియోగ కార్యక్రమాలను కూడా ప్రవేశపెట్టారు.

కరీంనగర్ జిల్లా జగిత్యాల తాలూకాలోని చెనగల్‌లో ప్రాజెక్టు అభివృద్ధి ప్రదర్శక క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. వ్యవసాయక పరిశ్రమల కార్పొరేషన్‌వారు 17 ఎకరాలు సేకరించి, భూమి చదును చేస్తున్నారు. నాగార్జునసాగర్ కుడికాలువ ప్రాంతంలోని అమరావతి, గరికపాడు, టి. బి. దిగువకాలువ ప్రాంతంలోని ఎమ్మిగనూరులలోను ఏర్పాటు చేసిన క్షేత్రాల మాదిరిగానే యీ క్షేత్రం ఏర్పాటు చేయబడుతున్నది.

నిరంతర కృషి

భూమి చదును చేయడానికి పెద్ద మొత్తంలో పెట్టుబడి అవసరమవుతుంది. అది రైతుకు తలకు మించినపని. ఈ విషయంలో భూమితనఖా బ్యాంకు, ఇతర వాణిజ్య బ్యాంకులవంటి ఆర్థిక సహాయక సంస్థలు రైతులకు సహాయ పడుతున్నాయి. అయితే దురదృష్టవశాత్తు 50 శాతం మంది రైతులు యీ సహాయక సంస్థల రుణాలు పొందడానికి అర్హులుకారు. ఈ ఇబ్బందిని అధిగమించడానికి ప్రస్తుతం తీవ్రంగా కృషి జరుగుతున్నది.

కరీంనగర్ జిల్లా పోరుమళ్ళ గ్రామంలో ఒక క్యూసిక్ నేల చదును చేసే భూమి అభివృద్ధి కొత్త పద్ధతి రైతులను విశేషంగా ఆకర్షిస్తున్నది. పోరుమళ్ల, ముత్యంపేట, కోరుట్ల గ్రామాలలో పైపువారీ ప్రాతిపదికపై 500 ఎకరాల భూమిని అభివృద్ధి చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. పోచంపాడు ప్రాజెక్టు ప్రాంతంలో యిదే పద్ధతిపై 2,000 ఎకరాల భూమిని అభివృద్ధి చేయాలని కూడా ప్రతిపాదించారు. 1975 జూన్‌లోగా యీ పని పూర్తి అవుతుంది.

వచ్చే సంవత్సరాలలో రాష్ట్రంలోని భారీ ప్రాజెక్టు ప్రాంతాలలో ఆయకట్టు అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరిపి భూమి దున్నే రైతులకు సౌభాగ్య సంపదలు చేకూర్చగలరని ఆశిస్తున్నారు. ★

జిల్లాల్లో..

చిత్తూరు జిల్లాలో పశు సంక్షేమం

చిత్తూరు జిల్లాలో ఆరుసూత్రాల పథకం క్రింద కేంద్ర సహాయంలో భాగంగా పశుసంక్షేమ ప్రత్యేక కార్యక్రమాల అమలుకు 1974–75 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం రూ. 7 లక్షలు మంజూరు చేసింది. రూ. 1.50 లక్షల ఖర్చుతో పలమనేరు కార్యస్థానంగా కీలక గ్రామ బ్లాకును కూడా ప్రభుత్వం మంజూరుచేసింది. కృత్రిమ గర్భోత్పత్తి కార్యక్రమం క్రింద సంకరజాతి పశువుల పెంపుదలకు వీలుగా పలమనేరు పరిసర ప్రాంతాలలో పది ఉప కేంద్రాలను ప్రారంభిస్తున్నారు.


చిత్తూరు పాడిప్రాంతంలోను, మదనపల్లి ప్రాంతంలోను మధ్యతరహా రైతులు, సన్నకారు రైతులు వెనుకబడిన వర్గాల వారికి 25 శాతం సబ్సిడీ ప్రాతిపదికపై సంకరజాతి పాడిపశువులను సేకరించి సరఫరాచేస్తారు. ఈ కార్యక్రమం అమలుకు రూ. 60,000 మంజూరు చేశారు.

గోపాలకృష్ణాపురం భూమి కాలనైజేషన్ కన్‌కొంబడిలో ఎంపిక చేసిన కొంతమందికి ఆధునిక పద్ధతులలో గొర్రెలు పెంచడానికి గొఱ్ఱెలు సరఫరా చేస్తారు.

పిచ్చలూరు పంచాయతీ సమితిలోని కలయంబాకంలోను, పుత్తూరు పంచాయతీ సమితిలోని కుప్పంబాదుర్‌లోను కొత్తగా రెండు చిన్నతరహా పశువైద్యశాలలను మంజూరు చేశారు.

విజయవాడ కేంద్రం మాదిరిగా ఒక పశు ఆరోగ్యకేంద్రాన్ని ప్రారంభించాలని ప్రతిపాదించారు. పరికరాల కొనుగోలుకు రూ. 50,000లు కేటాయించారు. అవసరమైన సిబ్బందీ, భవనాల నిమిత్తం వచ్చే సంవత్సరం చర్యలు తీసుకుంటారు. మునిసిపాలిటీ నుండి రూ. 20,000ల విరాళంతో చితూరులో వైద్యశాలను ఆధునీకరిస్తారు. సంచార పరికరాల పథకం క్రింద రైతులకు జాతి దూడలను తక్కువ ధరకు సరఫరా చేస్తారు. జిల్లాకు పశువుల ఉత్పత్తి కేంద్రాన్ని మంజూరుచేశారు. ప్రస్తుత సంవత్సరం యిందు కొరకు సూత్రప్రాయంగా రూ. 10,000 లు కేటాయించారు. నిపుణుల సలహాను అనుసరించి సత్యవేడులోగానీ, కుప్పంలోగానీ యీ కేంద్రాన్ని ఏర్పాటుచేస్తారు.

పీలేరులో పశువులమార్కెటు యార్డును నిర్వహిస్తున్నారు. ఇక్కడ పశువులకు షెడ్లు, నీటిసౌకర్యం వగైరా కల్పిస్తున్నారు. ప్రభుత్వం రూ. 20,000లు కేటాయించింది. అంతే మొత్తాన్ని స్థానిక పశువుల మార్కెటు సంఘం భరిస్తున్నది.



విద్యాశాఖ మంత్రి శ్రీ ఎం. వి. కృష్ణారావు ఫిబ్రవరి 16న నెలూరులో తెలుగు సినీ కళాకారుల బృందంవారి సాంస్కృతిక ప్రదర్శన సందర్భంగా ప్రసంగిస్తున్నదృశ్యం

అగ్నిబాధితులకు సహాయం


ఖమ్మం జిల్లాలోని పెదమండవ గ్రామంలో యిటీవల జరిగిన అగ్నిప్రమాదంలో 130 కుటుంబాలకు తీవ్రనష్టం జరిగింది. రూ. 3.86 లక్షలు విలువచేసే ఆస్తినష్టం సంభవించింది. బాధిత కుటుంబాలన్నిటికీ రు. 18,000ల గ్రాంటును ఖమ్మం జిల్లా కలక్టరు మంజూరుచేశారు. ఖమ్మం బియ్యం మిల్లర్ల సంఘంవారు బాధితులకు రూ. 4,000ల విలువచేసే 12 క్వింటాళ్ల బియ్యం, వస్త్రాలు విరాళంగా యిచ్చారు. జిల్లా కలక్టరు శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్ మార్చి 22 న బాధితులకు యీ సహాయం అందజేశారు. ఖమ్మంజిల్లా పరిషత్తు అధ్యక్షులు, శ్రీ ఆర్. భువనసుందరరెడ్డి, శాసనసభ్యులు శ్రీ శాంతయ్య యితరులు యీ ప్రాంతాన్ని సందర్శించి బాధితులకు రూ. 10,000లు సహాయం చేస్తామని హామీ యిచ్చారు. శాసన సభ్యులు శ్రీ శాంతయ్య రు. 2,000లను కలెక్టరుకు అందజేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో మొక్కజొన్న పంట

ఆంధ్రప్రదేశ్‌లో 1974-75 సంవత్సరంలో 2,89,400 హెక్టార్లలో మొక్కజొన్నపంట వేశారు. గత సంవత్సరం 2,81,500 హెక్టార్లలో యీ పంటవేశారు. పంట విస్తీర్ణంలో 6 శాతం పెరుగుదల ఏర్పడింది.

తెలంగాణా ప్రాంతానికి మాత్రమే యీ పంట పరిమితమై ఉంది. వర్షాకాలంలో ఖరీఫ్‌పంట కాలంలో యీ పంటవేస్తారు. రాబీ పంటకాలంలో పరిమిత స్థాయిలో సేద్యపు నీటివనరుల ద్వారా యీ పంట వేస్తారు.

నిజామాబాదు, మెదకు, వరంగల్లు, కరీంనగర్, ఆదిలాబాదు జిల్లాలలో ప్రధానంగా యీ పంట వేస్తారు. రాష్ట్రంలో యీ పంట వేసే విస్తీర్ణంలో 91 శాతం యీ జిల్లాలలో ఉంది.



ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు ఫిబ్రవరి 20న మహబూబ్ నగర్ జిల్లా నందిగాం లో గ్రామీణ ఉక్కు-సముదాయ పారిశ్రామిక వాడకు శంకుస్థాపన చేసినప్పటి చిత్రం

ప్రస్తుత సంవత్సరం 4,66,900 టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి అయింది. గత సంవత్సరం 4,20,100టన్నుల ఉత్పత్తి అయింది. ఉత్పత్తిలో 11 శాతం పెరుగుదల ఏర్పడింది.

ఎల్.ఐ.జి. ఇండ్లకు శంకుస్థాపన

మునిసిపల్ పరిపాలనశాఖా మంత్రి శ్రీచల్లా సుబ్బారాయుడు యిటీవల నెల్లూరులో అల్పాదాయ వర్గాల ఇండ్ల పథకానికి శంకుస్థాపన చేశారు. ఈ పథకం క్రింద మునిసిపాలిటీవారు ఒక లక్ష ఇరవై వేల రూపాయల ఖర్చుతో ఆరు ఇండ్లను నిర్మిస్తున్నారు. ఇందుకొరకు కేంద్రప్రభుత్వం 93 వేల 6 వందల మేరకు రుణంగా యిచ్చింది.

ఈ సందర్భంగా మంత్రి ప్రసంగిస్తూ మునిసిపాలిటీల వనరులు చాలా పరిమితంగా ఉన్నాయనీ, అందువల్ల ప్రజల అవసరాలను తీర్చలేకపోతున్నాయనీ అన్నారు. విధి నిర్వహణవల్లనే ప్రజలకు హక్కులు లభిస్తాయేకాని అసందర్భపు విమర్శలవల్ల లాభంలేదని ఆయన అన్నారు.

గిరిజన ప్రాంతం అభివృద్ధి

చిన్నతరహా నీటిపారుదల శాఖామంత్రి శ్రీ ఆనం వెంకటరెడ్డి యిటీవల వరంగలుకు 100 కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలోని కోమటగూడెం చెర్వుకట్ట నిర్మాణానికి శంకుస్థాపన చేస్తూ ఐదవ పంచవర్ష ప్రణాళికా కాలంలో ముఖ్యంగా గిరిజన అభివృద్ధి ప్రాంతాలలో చిన్నతరహా నీటిపారుదల సౌకర్యం కల్పనకు అధిక ప్రాధాన్యం యివ్వడం జరుగుతుందని అన్నారు.

శతాబ్దాల తరబడి శిథిలావస్థలో ఉన్న కోమట్లగూడెంలోని యీ చెర్వు పునరుద్ధరణకు రూ 2.76 లక్షలు ఖర్చు అవుతుంది. దీని ద్వారా 209 ఎకరాలకు నీటిపారుదల సౌకర్యం కలుగుతుంది. ఇందువల్ల పరిసర గిరిజన గ్రామాలలోని 450 గిరిజన కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుంది.


వరంగల్లు జిల్లాకలెక్టరు, శ్రీ ఎం. బాలరాజ్ ప్రసంగిస్తూ గోదావరి ప్రాంతంలో ఫిల్టర్ కేంద్రాలను వినియోగించుకోడానికి గిరిజనుల నిమిత్తం రూ. 12 లక్షలు విడుదల చేశారని అన్నారు.

వరంగల్లు జిల్లాపరిషత్తు అధ్యక్షుడు శ్రీ బి. జనార్థనరెడ్డి సమావేశానికి అధ్యక్షత వహిస్తూ గిరిజన, వెనుకబడిన ప్రాంతాలలో సర్వే జరిపి, అంచనాలు తయారుచేయడానికి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ సిబ్బందిని వినియోగిస్తున్నారని అన్నారు జిల్లాపరిషత్తుకోని 3 శాతం సాధారణ నిధిని గిరిజన సంక్షేమ పథకాలకు ఉపయోగిస్తున్నారని ఆయన అన్నారు.

నిజామాబాదులో పారిశ్రామిక తీవ్రతర ఉద్యమం

నిజామాబాదులో మార్చి 5 నుండి 9 వరకు పారిశ్రామిక తీవ్రతర ఉద్యమాన్ని నిర్వహించారు. విద్యుచ్ఛక్తి శాఖ మంత్రి శ్రీ జి రాజారామ్ పరిశ్రమలశాఖ డైరెక్టరు, శ్రీ పి. ఎస్. కృష్ణన్ లఘుపరిశ్రమల సంస్థ డైరెక్టరు శ్రీ ఆర్. పూర్ణమ్, కలక్టరు శ్రీ బి కె. వెంటయ్య, పారిశ్రామిక సలహాదారు శ్రీ కె సి. ఆస్థాని యితర పారిశ్రామిక వేత్తలు, బ్యాంకు ప్రతినిధులు యీ ఉద్యమంలో పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ లఘుపరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సహాయక కార్పొరేషన్, హైదరాబాదులోని ప్రాంతీయ పరిశోధన సంస్థ, అనంతపురంలోని నూనె సాంకేతిక పరిశోధనసంస్థ, సిండికేటు బ్యాంకు, కెనరా బ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దేనాబ్యాంకు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాదు, ఆంధ్రాబ్యాంకు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ప్రతినిధులు, అధికారులు కూడా హాజరైనారు.



విధానసభ అధ్యక్షులు శ్రీ ఆర్ దశరథరామి రెడ్డి నెల్లూరు జిల్లా, తుమ్మెర్ల గ్రామంలో ఫిబ్రవరి 16న ప్రాథమికోన్నత పాఠశాల భవనానికి ప్రారంభోత్సవం చేసిన దృశ్యం

ప్రముఖ యంత్ర పరికరాల తయారీ సంస్థల ప్రతినిధులు కూడా యీ ఉద్యమంలో పాల్గొనడం మరో ముఖ్యాంశం. వారు అక్కడి పారిశ్రామిక వేత్తలకు యంత్రపరికరాల వివరాలను కొటేషనులను అందజేశారు.

నిజామాబాదులో జరిగిన తీవ్రతర పారిశ్రామిక ఉద్యమం అనేకమంది పారిశ్రామిక వేత్తలను ఆకర్షించింది. అనేక ఆర్థిక సంస్థలు సహాయాన్ని అందజేయడానికి సంసిద్ధత తెలియజేశాయి. 198 దరఖాస్తులను రిజిస్టరు చేశారు. ఈ ఉద్యమం సందర్భంగా వ్యవసాయదారుల నుండి 44 మంది పారిశ్రామికులను, వ్యాపార వృత్తుల వారి నుండి 34 మందిని వృత్తిపనివారల నుండి 22 మంది పారిశ్రామికవేత్తలను ఎంపికచేశారు. ఉపాధి ప్రోత్సాహక పథకాల క్రింద నిరుద్యోగులైన విద్యావంతుల నుండి 90 దరఖాస్తులను స్వీకరించారు.

స్థానికంగా లభించే వ్యవసాయ, పశుసంపద, అటవీ వస్తువులు ఖనిజాలు వగైరాల ప్రాతిపదికంగా 101 పరిశ్రమలను ఏర్పాటుచేయడం మరో విశేషం. మొత్తం 198 పరిశ్రమలలో రూ. 130 లక్షల పెట్టుబడి ఉన్నట్టు మదింపు వేశారు. దీనివల్ల 1,309 మందికి ఉపాధి సౌకర్యం లభిస్తుంది

ఆసక్తిగల యితర ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు తమ పేర్లను నిజామాబాదులోని పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టరు వద్ద నమోదు చేయాలని విజ్ఞప్తి చేయబడింది.

ఈ సంచికలో రచయితలు :

శ్రీయుతులు

ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్, భారత రాష్ట్రపతి

జలగం వెంగళరావు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

పిడతల రంగారెడ్డి, ఆర్థిక, సమాచార శాఖా మంత్రి

మండలి వెంకటకృష్ణారావు, విద్యా, సాంస్కృతిక శాఖామంత్రి

బెజవాడ గోపాలరెడ్డి, మాజీగవర్నరు, బుచ్చిరెడ్డి పాలెం, నెల్లూరు జిల్లా

దత్తి ప్రసాదరావు, 4–37, గుజరాతీపేట, శ్రీకాకుళం

వావిలాల గోపాలకృష్ణయ్య, పి. జె –10, పంజగుట్ట కాలనీ, హైదరాబాద్


కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, 69, ఆదర్శనగర్, హైదరాబాద్

తిరుమల రామచంద్ర, 69, ఆదర్శనగర్, హైదరాబాద్

సుధామ, మలక్‌పేట కాలనీ, హైదరాబాద్

మాదల వీరభద్రరావు, సబ్ఎడిటర్, ఆంధ్రప్రభ, క్వీన్స్‌రోడ్, బెంగుళూరు

వఝ్ఝమూడి గోపాలకృష్ణయ్య, డైరెక్టరు, ప్రభుత్వ ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స్ లైబ్రరీ అండ్ రీసెర్చి సంస్థ, హైదరాబాద్.



PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVT OF ANDHRA PRADESH, AT THE GOVT CENTRAL PRESS HYDERABAD.
PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION, PUBLIC RELATIONS ANDHRA PRADESH, HYDERABAD.

స్వీయ చరిత్ర ఆధారంగా -

